www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 37 సంచిక : 223

12 + స్నేహ + 12 పేజీలు వెల : 5.00

విజయవాడ, ఆదివారం 13 ఆగస్టు 2017

facebook/prajasakti, twitter/prajasakti

Sunday Special



ఆ రోజుల్లో.. అండమాన్ జైల్లో..

స్వాతంత్య్రం అంటే బానిసత్వం నుండి విముక్తి పొందడం. భారతీయులు అలా స్వేచ్ఛా జీవుల్లా విహరించడానికి ఎంతోమంది త్యాగాలు చేశారు. వలస పాలన నుండి విముక్తి కోసం సాగించిన స్వతంత్ర సంగ్రామ చరితలో కమ్యూనిస్టులది విశిష్టపాత్ర. ప్రాణాలకు తెగించి ఉద్యమాన్ని ముందుకు నడిపిన ధీరోచిత, వీరోచిత త్యాగమూర్తులెందరో. అలాంటి త్యాగశీలుర జీవిత ఘట్టాల్లో కారాగారాల అనుభవ పుటలు తప్పనసరిగా కనిపిస్తాయి. నాటి విప్లవయోధుల జైలు జీవితగాథలకు అండమాన్ సెల్యులర్ జైలు నిలువెత్తు ప్రతీక. స్వాతంత్య్రోద్యమంలో అండమాన్ వీరులదో ప్రత్యేక అధ్యాయం. ఆ జైల్‌ది భయంగొలిపే చరిత్ర. అంతటి ప్రత్యేక చరిత్రకు నేటికీ సాక్షిగా నిలిచిన అండమాన్ జైల్లో ఆ నాడు విప్లవ వీరులు అనుభవాలపై ప్రత్యేక కథనం స్నేహలో..

కూలీలపై పన్నుపోటు

సంఖ్య పెరిగితే భారం పెరుగుతుంది



- జిఎస్‌టిలో కొత్త కోణం
- గతంలో ఉన్న మినహాయింపు రద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర సర్కారు హడావిడిగా అమలులోకి తీసుకొచ్చిన వస్తు,సేవల పన్ను (జిఎస్‌టి)లో రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తోంది. ఇప్పటికే వివిధ రంగాలకు చెందిన వారు జిఎస్‌టికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ జాబితాలో కూలీలు చేరారు. వివిధ రకాల ప్రాజెక్టుల పనుల్లో వినియోగించే కూలీల సేవలను జిఎస్‌టి పరిధిలోకి తెచ్చి పన్ను వేయడమే దీనికి కారణం. కూలీల సంఖ్య పెరిగే కొద్దీ పన్నుభారం కూడా పెరగనుండటంతో భవిష్యత్తులో కూలీల ఉపాధి ప్రమాదంలో పడనుంది. రాష్ట్ర సర్కారు చేపడుతున్న వివిధ ప్రాజెక్టులపై ఇప్పటికే దీని ప్రభావం పడింది. కూలీలకు బదులుగా యంత్రాలను ఉపయోగించాలన్న ప్రతిపాదనలను అధికారులు చేస్తున్నారు. దీనిని ఒక ఉన్నతస్థాయి అధికారి కూడా ధృవీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల ప్రాజెక్టుల ఖర్చు భారీగా పెరిగే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయంగా యంత్రాలు వాడితే కూలీలు రోడ్డున పడతారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. ఆ స్థాయిలోనే నిర్ణయాలు తీసుకోవాల్సిఉంది' అని ఆ అధికారి ప్రజాశక్తికి చెప్పారు.

ఎందుకీ స్థితి!

గతంలో నీటిపారుదల శాఖతో పాటు ఇతర నిర్మాణ రంగాల్లో వినియోగించే కూలీల వాటాపై పన్ను మినహాయింపు ఉండేది. సేవా పన్ను రూపంలో దీనిని తగ్గించేవారు. వ్యాట్ ఉన్నంత వరకు ఈ విధానమే కొనసాగింది. తాజాగా జిఎస్‌టిలో ఆ విధానాన్ని మిగతా 9లో

15 నుంచి నెల రోజులు
ఉద్యమబాట



అనంతపురంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పి.మధు, చిత్రంలో ఓబులు, రాంభూపాల్

- పక్షం రోజులపాటు నిరుద్యోగ సమస్యలపై ఆందోళనలు
- కరువు సహాయక చర్యలు చేపట్టాలి
- మద్దతు ధర, రుణమాఫీకి ప్రత్యేక చట్టం చేయాలి
- స్పందించకుంటే ఆందోళన మరింత ఉధృతం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సెప్టెంబరు 1 నుంచి 15 వరకు నిరుద్యోగ సమస్యపై ఆందోళనా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రంలో 21.50 లక్షల హెక్టార్లు సాగును కోల్పోయిందని అన్నారు. ముఖ్యంగా రాయలసీమలో 17 లక్షల ఎకరాలు బీడు వారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 10 నుంచి అనంతపురం జిల్లాలో జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు కరాళ నృత్యం చేస్తోందని, సహాయక చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులకు నంద్యాల ఉపఎన్నికలపై ఉన్న శ్రద్ధ ప్రజాసమస్యలపై లేదన్నారు. పంటకు మద్దతు ధర, రుణమాఫీకి పార్లమెంటులో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టాయన్నారు. రాయసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలను ఇస్తామని కేంద్రం చెప్పిందని, ప్రస్తుతం దాని ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నంద్యాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. దీంతో ప్రజా సమస్యలు పక్కదారి పట్టాయన్నారు. యువత భవిష్యత్తును నిర్దేశించే రీతిలో కర్నాటక, ఒరిస్సా, కేరళ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన విధంగా యూత్ పాలసీని ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయసీమ అభివృద్ధి సబ్ కమిటీ కన్వీనరు జి.ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, జిల్లా కార్యదర్శివర్గ భస్యులు ఓ.నల్లప్ప పాల్గొన్నారు.

17 నుంచి గ్రూప్-1 మెయిన్స్

- సర్వం సిద్ధం చేసిన ఎపిపిఎస్సీ
- 78 పోస్టులకు 3,900 మంది అభ్యర్థులు పోటీ

2


ముస్తాబవుతున్న తిరుపతి

- స్వాతంత్య్ర వేడుకలకు భారీగా సన్నాహాలు
- ముఖ్య అతిథులుగా గవర్నర్,ముఖ్యమంత్రి

2

ఉల్లి ధర నియంత్రణకు చర్యలు

- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం
- సబ్సిడీపై రైతు బజార్లలో విక్రయించాలని సూచన
- అక్రమ నిల్వలపై దాడులు చేయాలని ఆదేశం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉల్లిపాయల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఉల్లి ధరల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. వీటి ధర తగ్గే వరకూ సబ్సిడీతో రైతు బజార్లలో విక్రయించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కూడా చంద్రబాబు సూచించారు. ఉల్లి అక్రమ నిల్వలపై మార్కెటింగ్, మిగతా 9లో

ఫలించిన పోరాటం

దేవరపల్లి భూములు దళితులకే



ప్రకాశం జిల్లా దేవరపల్లి దళితుల పోరాటం ఫలించింది. సిపిఎం ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల మద్దతుతో గత రెండు నెలలుగా సాగించిన పోరాట ఫలితంగా చెరువు భూములు దళితులకే స్వాధీనం చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం తరపున సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు ప్రకటించారు. దాని ప్రకారమే చెరువు కట్టను శనివారం సాయంత్రం పొక్లెయిన్లతో తొలగించే పనిని ప్రారంభించారు. దళితుల భూముల్లో అధికార తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధి అండతో చేపల చెరువులు తవ్విన విషయం పాఠకులకు విదితమే.

వార్త 7లో

ఐదు రోజుల్లో 60మంది

వెలుగులోకి గోరఖ్‌పూర్ దారుణాలు

- సమర్థనకు సర్కారు తిప్పలు
- రోజుకు ఏడుగురు చనిపోవడం సహజమే : యుపి ఆరోగ్య మంత్రి
- విలేకరులపై సిఎం ఆదిత్యనాథ్ ఆగ్రహం
- బిఆర్‌డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్



గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ లోక్‌సభ నియోజకవర్గమైన గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో జరుగుతున్న దారుణాలు ఒకటొకటిగా వెలుగులోకి వస్తున్నాయి. 48 గంటల్లో 30 మంది చిన్నారులు ప్రాణాలు విడిచిన సంఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపుతుండగానే ఈ ఆస్పత్రిలో ఈ తరహా మరణాలు కొత్తేమి కాదని తేలింది. సాక్షాత్తు ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్ చెప్పిన వివరాల ప్రకారమే ఇక్కడ ఐదు రోజుల్లో 60 మంది మిగతా 9లో

శరద్‌యాదవ్‌కు ఉద్వాసన

ఎన్డీయేలో చేరాలని నితీష్‌కు అమిత్‌షా ఆహ్వానం



పాట్నా/న్యూఢిల్లీ: కాంగ్రెస్, ఆర్‌జెడితో పొత్తును తెగతెంపులు చేసుకున్న తరువాత బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, జెడి(యు) అధ్యక్షుడు శరద్‌యాదవ్ మధ్య రాజుకున్న విభేదాలు చిలికి చిలికి గాలివానగా మారాయి. శుక్రవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్‌చీఫ్ సోనియా నేతృత్వంలో జరిగిన 12 ప్రతిపక్షాల భేటీకి హాజరైన శరద్‌యాదవ్‌ను జెడి(యు) పార్లమెంటరీ పార్టీ నాయకత్వం నుండి తొలగిస్తున్నట్లు నితీష్ వర్గం ప్రకటించింది. రాజ్యసభలో జెడి(యు) పక్ష నేతగా వ్యవహరిస్తున్న శరద్‌యాదవ్ స్థానంలో ఆర్‌సిపి సింగ్‌ను నియమించినట్లు పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. ఆర్‌సిపి నేతను తమ పార్టీ సభాపక్ష నేతగా నియమిస్తున్నట్లు పేర్కొంటూ జెడి(యు) సభ్యులు రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడును కలిసి లేఖ అందచేశామని ఆయన వివరించారు. రాజ్యసభలో పదిమంది సభ్యుల బలమున్న జెడి(యు) పార్టీ ప్రతిపక్ష పార్టీల భేటీకి హాజరైన తమ ఎంపి ఆలీ అన్వర్ అన్సారీని కూడా పార్లమెంటరీ పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ పార్టీ నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా వుండగా ప్రస్తుతం బీహార్ పర్యటనలో వున్న శరద్‌యాదవ్ శనివారం నాడు పాట్నాలో మీడియాతో మాట్లాడుతూ ఆర్‌జెడి, మిగతా 9లో

నైపుణ్య శిక్షణ.. నిధుల భక్షణ

Sushikshanath Samriddhihi

Andhra Pradesh State Skill

- 24 శాతం మందికే ఉపాధి
- వృథాగా నిధుల ధారబోత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లక్ష్యం నెరవేరటం లేదు. యువతకు ఇస్తున్న శిక్షణ ప్రచారానికే తప్ప, వారికి ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఈ విధానం నేతి బీర చందంగా మారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గత రెండేళ్లలో నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారిలో కేవలం 24 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభించడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత నైపుణ్య శిక్షణ కోసం విడుదల చేస్తున్న నిధులు పలు ప్రయివేటు సంస్థలకు ఓ వరంగా మారాయి. శిక్షణ పొందిన తరువాత ఆ కేంద్రాల ద్వారా యువతకు నామమాత్రంగానే ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా వివిధ పరిశ్రమలు, కంపెనీలకు మిగతా 9లో



కృష్ణా నది కలుషితం : రాజేంద్రసింగ్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణా నది కలుషితమవుతోందని పేర్కొంటూ వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. నదిలో నీటి కాలుష్యం సహా, సమీప ప్రాంత మంతా డంపింగ్ యార్డులా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణానది పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రమూ చర్యలు తీసుకోవడం లేదన్నారు. నదీతీరంలో భారీ భవంతులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిస్తోంద న్నారు. కర్నూలు మురుగంతా రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ ఇంటి సమీపం లోని మురుగు కాలువల ద్వారా కృష్ణా నదిలో కలుస్తోందని తమ పరిశీలనలో గుర్తించినట్లు తెలిపారు. వెంటనే కృష్ణా నది పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

28న విజయవాడకు అమిత్‌షా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా ఈ నెల 28న విజయవాడకు రానున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 28, 29, 30 తేదీల్లో ఆయన రాష్ట్రంలో పర్యటించనున్నట్లు పేర్కొంది. ఆ పర్యటనలోనే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని కూడా ఎంపిక చేయనున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అమిత్‌షా ఇటీవల రాష్ట్రపతి ఎన్నికలకు ముందు హైదరాబాద్, విజయవాడలోను పర్యటించి విషయం విదితమే.



ప్రజ్ఞ

1. ఏనుగుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రారంభించిన ప్రచార కార్యక్రమం?
2. సెన్సార్ బోర్డు నూతన చైర్మన్ ఎవరు?
3. అంతర్జాతీయ యువజన దినోత్సవంగా ఏ తేదీని పరిగణిస్తారు?
4. 'బిమ్‌స్టెక్' దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం ఎక్కడ జరిగింది?
5. తాజాగా ఏ రాష్ట్ర ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 33 మంది చిన్నారులు మరణించారు.

సమాధానాలు 7 లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.


వేడుకల ప్రధాన ఘట్టానికి ఆతిథ్యమివ్వనున్న తారకరామ స్టేడియం ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం


తుదిమెరుగులు దిద్దుకుంటున్న తిరుమల తిరుపతి దేవస్థానాల సంస్థ (టిటిడి) శకటం


సాహసకృత్యాల రిహార్సల్స్

ముస్తాబవుతున్న తిరుపతి

- స్వాతంత్ర్య వేడుకలకు భారీగా సన్నాహాలు
- 6 వేల మంది ఆహ్వానితులకే అనుమతి
- పురవీధుల్లో 12 శకటాల ప్రదర్శన
- ముఖ్య అతిథులుగా గవర్నర్, ముఖ్యమంత్రి
- పేదలకు గృహ నిర్మాణంపై సిఎం ప్రసంగంలో ప్రస్తావనకు అవకాశం
- అడుగడుగునా భారీ భద్రత

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తిరుపతి ముస్తాబవుతోంది.. జిల్లా అధికార యంత్రాంగం ఉత్సవ ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. స్థానిక తారకరామ స్టేడియంలో ఆగస్టు 15న ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ ఉత్సవాలు జరుగుతాయి. వివిధ శాఖల నుంచి 12 శకటాలు ప్రదర్శనకు సిద్ధమవుతున్నాయి. ముఖ్య అతిథులుగా గవర్నర్ ఇఎల్ఎన్ నరసింహన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు.

ఆరువేల మంది ప్రత్యేక ఆహ్వానితులకు మాత్రమే అనుమతి ఉంది. భారీ భద్రత నేపథ్యంలో పాస్‌లు ఉన్న వారినే లోనికి అనుమతించనున్నట్లు చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న వెల్లడించారు. ఇక స్వాతంత్ర్య సంబరాలకు తిరుపతి నగరవ్యాప్తంగా సుందరీకరణ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి కళాశాలల, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు రిహార్సల్స్ చేస్తున్నారు. సాహసోపేతమైన విన్యాసాలు, పోలీసుల కవాతు ప్రాక్టీసు జరుగుతున్నాయి. రాష్ట్ర స్థాయి వేడుకలు తిరుపతిలో జరగనున్న నేపథ్యంలో వారం రోజులుగా పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నారు. వేదిక ఎదురుగా చంద్రగిరి కోట తలపించేలా గోడను నిర్మిస్తున్నారు. వేదిక వెనుక భాగాన శ్రీవారి ఏడుకొండలను ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతున్నారు. 'జనగనమణ' గేయాన్ని మదనపల్లిలో తొలిసారిగా ఆలపించిన నేపథ్యంలో సభలో ప్రాధాన్యతాంశంగా చేర్చనున్నారు.

45 కమిటీల ఏర్పాటు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే తారకరామ మైదానాన్ని తీర్చిదిద్ది భద్రతా విభాగానికి అప్పగించనున్నారు. వేదిక ఎడమవైపు 11 గ్యాలరీలు, కుడివైపు 14 గ్యాలరీలను ప్రతినిధులు ఆశీనులయ్యేలా ఏర్పాటు చేశారు. వర్షం వచ్చినా ఎటువంటి ఆటంకం కలగకుండా వాటర్‌ప్రూఫ్ పందిళ్లను వేశారు. మొత్తం 45 కమిటీలను వేసి ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, జెసి గిరీషా, కార్పొరేషన్ కమిషనర్ హరికిరణ్, తిరుపతి సబ్‌కలెక్టర్ నిషాంత్‌కుమార్ వారం రోజులుగా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శనివారం సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీకాంత్ పరిశీలించారు. వేదికపై గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, చీఫ్ సెక్రటరీ దినేష్‌కుమార్, ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ రమేష్ రంగనాథన్, డిజిపి సాంబశివరావు ఆశీనులవుతారు. రాష్ట్రవ్యాప్తంగా 60 మంది స్వాతంత్ర్య సమరయోధులను ఆహ్వానించి సిఎం చేతుల మీదుగా సన్మానించనున్నారు.

వర్షం వచ్చినా ఆటంకం లేకుండా ముమ్మర ఏర్పాట్లు

వర్షం వచ్చినా ఎలాంటి ఆటంకం లేకుండా ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే వివిఐపిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 3 వేల మందికి పైగా పోలీసు యంత్రాంగం భద్రతను కట్టుదిట్టం చేసింది. హోంగార్డ్సు, స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఎస్‌వి యూనివర్శిటీ, పద్మావతి వర్శిటీ, ఆర్ట్స్ కాలేజి తదితర కళాశాలల, పాఠశాలల విద్యార్థులు వెయ్యి మందికి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దగ్గరగా చూసేందుకు అనుమతి ఇచ్చారు. దేశభక్తి ఉట్టిపడేలా నగరం మొత్తం త్రివర్ణపతాకాలను, ఫ్లెక్సీలను, బ్యానర్లను కడుతున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్చిలను విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. తారకరామ స్టేడియంలో కార్యక్రమాలను చూసేందుకు నాలుగు ఎల్‌ఇడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. నగర వాసులు తిలకించేలా మున్సిపల్ ఆఫీసు, బాలాజీకాలనీ, ఆర్‌టిసి, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లోనూ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి.

ప్రదర్శనకు 12 శకటాలు

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 12 శాఖలకు సంబంధించిన శకటాలు తయారవుతున్నాయి. తారకరామ స్టేడియం వెనకవైపునే కళాకారులు వీటిని ఆయా శాఖల అభివృద్ధిని ప్రతిబింబించేలా రూపకల్పన చేస్తున్నారు. వ్యవసాయం, నీరు-ప్రగతి, విద్య, ఫారెస్టు, హౌసింగ్, వైద్యం, రూరల్ డెవలప్‌మెంట్, స్వచ్ఛాంధ్రప్రదేశ్, టూరిజం, టిటిడి, సాంఘిక సంక్షేమ శాఖ, సిఆర్‌డిఎ శాఖలున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిఎం ప్రసంగం అనంతరం వీటిని పురవీధుల్లోనూ ప్రదర్శించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

వేడుకల్లో సాంస్కృతిక వేడుకల్లో అమరావతి నుంచి రెండు బృందాలు వస్తుండగా, జిల్లా నుంచి మరో రెండు బృందాలు పాల్గొంటాయి. పోలీసు బలగాల కవాతు, సాహసిక విన్యాసాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

పేదలకు ఇళ్లు పంపిణీ

రాష్ట్ర విభజన తరువాత ఒక ఇంటిని కూడా ప్రభుత్వం ఇప్పటివరకూ ఇచ్చిన దాఖలా లేదు. ఎన్‌టిఆర్ స్వగృహ పేరుతో నాలుగేళ్లుగా ప్రచారార్భాటమే తప్ప ఆచరణ లేదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ స్లమ్ హౌసింగ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌ఎస్‌డిపి) గృహాలను హడావుడిగా పూర్తి చేసి 316 మందికి పంపిణీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగానూ నిరుపేదలకు ఇళ్లను పంపిణీ చేయనున్నట్లుగా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం ఉంది.

వాతావరణం

నాలుగు రోజులపాటు వర్షాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లో నాలుగు రోజుల పాటు పలుచోట్ల చెదురు మదురు నుంచి ఓ మోస్తరు జల్లులు పడతాయని హైదరాబాద్ వాతావరణశాఖ పేర్కొంది. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తా యని హెచ్చరించింది.కోస్తాంధ్ర, రాయలసీమ పైనా ఉపరితల ద్రోణి, ఒడిశా నుంచి కోస్తాంధ్ర మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నాయని తెలిపింది.

ఇండిపెండెంట్ స్కూళ్ల చట్టంపై నేడు ఎంబివికెలో రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేట్ పాఠశాలల నియంత్రణకు ప్రభుత్వం తీసుకురాబోతున్న సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెం డెంట్ స్కూల్స్ యాక్ట్‌పై ఫ్యాప్టో ఆదివారం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర సదస్సు నిర్వహించనుంది. పాఠశాల స్థాయిలో విద్యా వ్యాపారాన్ని అడ్డూ అదుపులేకుండా విస్తరించడానికి, కార్పొరేట్ సంస్థల చేతికి అప్పజెప్పడానికి ముసాయిదా బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఫ్యాప్టో విమర్శించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, విద్యావేత్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరింది.


పద్మవిభూషణ్ 'యామిని కృష్ణమూర్తి'కి నేషనల్ ఎమినెన్స్ అవార్డు ప్రదానం చేస్తున్న విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు

యామిని కృష్ణమూర్తికి నేషనల్ ఎమినెన్స్ అవార్డు

- స్వర్ణ కమలం, నగదు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ (విఎండిఎ) ప్రతి సంవత్సరం 'నేషనల్ ఎమినెన్స్ అవార్డు'ను సంగీత, నృత్య, నాటక కళాకారులకు అందజేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ప్రముఖ భరతనాట్యం, కూచిపూడి నృత్య కళాకారిణి పద్మవిభూషణ్ యామిని కృష్ణమూర్తికి ఈ అవార్డును ప్రదానం చేశారు. శనివారం కళాభారతిలో నిర్వహించిన అవార్డుల ఉత్సవానికి ముఖ్యఅతిథిగా మద్రాస్ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షులు ఎన్.మురళి, విశిష్ట అతిథిగా వరల్డ్ టీచర్ ట్రస్ట్ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ కె.పార్వతీకుమార్ హాజరయ్యారు. అతిథుల చేతులు మీదుగా అవార్డు కింద రూ. 2.50 లక్షలు విలువజేసే స్వర్ణకమలం, సిఎస్ఎన్.రాజు పేరిట లక్ష రూపాయల నగదు పురస్కారాన్ని బహూకరించారు. ప్రశంసాపత్రాన్ని అందజేసి శాలువలతో ఘనసత్కారం చేశారు. అనంతరం యామిని కృష్ణమూర్తి చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో ఆకర్షించింది. ఈ సందర్భంగా విఎండిఎ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు సిఎస్ఎన్.రాజు, ఆర్‌కె.ప్రసాద్(రాంబాబు) మాట్లాడుతూ శనివారం నుంచి ఏడు రోజులు పాటు కళాభారతి వేదికగా ప్రముఖులచే సంగీత, నృత్య, నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ట్రిబ్యునల్ తీర్పుల్ని అమలు చేయరెందుకు?

ప్రభుత్వాన్ని వివరణ అడిగిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులను ఎపి ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదో వివరణివ్వాలని హైకోర్టు ఆదేశించింది. ట్రిబ్యునల్ వెలువరించిన తీర్పులన్నింటినీ పరిశీలించాలని, ఏయే శాఖల్లో ఎన్ని తీర్పులు అమలు కాలేదో వివరాలను సమర్పించాలని న్యాయమూర్తులు జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ట్రిబ్యునల్ తీర్పుల్ని నిర్దిష్ట వ్యవధిలోగా అమలు చేస్తామని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని బెంచ్ పేర్కొంది. తమ సర్వీసుల రెగ్యులరైజేషన్‌పై మూడు వారాల్లో ఉత్తర్వులు జారీ చేయాలని 2014 ఫిబ్రవరిలో ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాల్ని సర్కార్ అమలు చేయకపోవడంతో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎం.వెంకటేశ్వరరావు ఇతరులు వేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు విచారించింది. ట్రిబ్యునల్ తీర్పుల్ని ప్రభుత్వం అమలు చేయకపోవడం న్యాయాన్ని అపహాస్యం చేయడమే అవుతుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. అధికారుల్ని స్వయంగా హాజరుకావాలన్న తమ ఆదేశాల వల్ల పెద్దగా ఫలితం కనబడడం లేదని బెంచ్ అభిప్రాయపడింది. ట్రిబ్యునల్‌లో కేసు గెలుపొంది కూడా హైకోర్టుకు రావాల్సిన పరిస్థితులు పునరావ తం కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్యలు తీసుకోవాల్సివుందని బెంచ్ ఆదేశించింది. రెగ్యులరైజేషన్‌కు పిటీషనర్లు అర్హులు కారని, అందుకే ట్రిబ్యునల్ ఆదేశాల్ని అమలు చేయలేదని ప్రభుత్వ న్యాయవాది చెప్పడంతో హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ట్రిబ్యునల్ తీర్పుతో సంత ప్తి చెందకపోతే అప్పీల్ చేసుకోవాలని సూచించింది. కేసు విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది.


పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌కు కొట్టుకొచ్చిన డాల్ఫిన్ కళేబరం

ఫొటో : బాలాజీ, మొగల్తూరు విలేకరి.

17 నుంచి గ్రూప్-1 మెయిన్స్

- సర్వం సిద్ధం చేసిన ఎపిపిఎస్‌సి
- సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు
- నాలుగు నగరాల్లో పరీక్షా కేంద్రాలు
- 78 పోస్టులకు 3,900 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఎపిపిఎస్సీ సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 17 నుంచి 27 వరకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహిస్తారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలతో పాటు అనంతపురంలో పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో 78 పోస్టులకు గాను నోటిఫికేషన్ విడుదలయ్యింది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా 93,482 మంది దరఖాస్తు చేసుకున్నారు. మే 7న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించగా, 1:50 చొప్పున 3,900 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించారు. పరీక్షల నిర్వహణకు అత్యంత పగడ్బందీ ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తారు. అలాగే సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పనిచేయకుండా జామర్‌లను కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. మాల్ ప్రాక్టీస్ లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్తున్నారు. సజావుగా పరీక్షలు నిర్వహించేందుకు గాను ఫ్లైయింగ్ స్వాడ్స్‌ను కూడా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మొత్తం 78 పోస్టుల్లో 5 డిప్యూటీ కలెక్టర్లు, 13 కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్లు, 6 డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌లు, 24 డిఎస్పీ (డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్) పోస్టులు, 10 ఎక్సైజ్ డీఎస్పీ పోస్టులు, 2 డిస్ట్రిక్ట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు, 8 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 పోస్టులు, 10 అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్ పోస్టులున్నాయి.

పొత్తు కుదిరినా అసంతృప్తే!

- మిత్రపక్షంపై పోటీకి సై అంటున్న టిడిపి అభ్యర్థులు
- కాకినాడలో టిడిపి, బిజెపి సీట్ల సర్దుబాటు వ్యవహారం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో టిడిపి, బిజెపిలు పొత్తు కుదిరినా కొన్ని డివిజన్ల కేటాయింపుపై అభ్యర్థుల్లో అసంతృప్తి కొనసాగుతోంది. బిజెపికి కేటాయించిన తొమ్మిది డివిజన్లలో మూడు నాలుగు చోట్ల రెబల్స్ బెడద తప్పేలా లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. నాలుగు రోజులపాటు టిడిపి, బిజెపి ముఖ్య నాయకుల మధ్య సీట్ల సర్దుబాట్లపై సమాలోచనలు జరిగాయి. టిడిపి నుంచి రాష్ట్ర మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, విద్యుత్ శాఖా మంత్రి కళా వెంకటరావు, బిజెపి నుంచి రాష్ట్ర మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, ఎంఎల్ఎలు విష్ణుకుమారరాజు, ఆకుల సత్యనారాయణ చర్చల్లో పాల్గొన్నారు. తొలుత నాలుగు డివిజన్లు కేటాయిస్తామని టిడిపి నాయకులు తెలిపారు. బిజెపి తమకు 26 డివిజన్లు కేటాయించాలని పట్టుపట్టడంతో సీట్ల పంచాయితీ ఒక కొలిక్కి రాలేదు. శుక్రవారం రాత్రికి ఇరు పార్టీల నేతల మధ్య తొమ్మిది డివిజన్లు బిజెపికి కేటాయించేందుకు అంగీకారం కుదిరింది. 4, 5, 9, 35, 36, 39, 41, 47, డివిజన్లు బిజెపికి కేటాయించేందుకు ఒప్పందం జరిగింది. 26 లేదా 27 డివిజన్లలో ఏదో ఒకటి ఇవ్వాలని భావిస్తున్నారు. బిజెపికి కేటాయించిన తొమ్మిది డివిజన్లలో మూడు నాలుగు డివిజన్లలో టిడిపి అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీ నుంచి తప్పుకునేది లేదని పట్టుపడుతున్నట్లు సమాచారం. మా వార్డులు మాకు కేటాయించకపోతే స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీలో ఉంటామని హెచ్చరిస్తున్నట్లు తెలిసింది.

బిజెపి నాయకులు కూడా తమకు బలం ఉన్న చోట్ల కాకుండా బలం లేని చోట కేటాయిస్తే ఉపయోగం ఏంటని టిడిపి నేతలను ప్రశ్నిస్తున్నారు. ఆదివారం ఉదయం రెండు పార్టీల నేతలు అభ్యర్థులతో సమావేశమై, ఒప్పించి పరస్పరం సహకారం ఇచ్చుకునేలా చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. బిజెపికి కేటాయించిన సీట్లలో ముగ్గురు, నలుగురు టిడిపి అభ్యర్థులు స్వతంత్రులుగా పోటీలో ఉండే అవకాశాలున్నాయని ఆ పార్టీ ముఖ్య నేత ఒకరు తెలిపారు. సీట్లు ఖరారైన అభ్యర్థులకు కూడా బి ఫారాలు ఇవ్వకుండా సోమవారం ఉదయం ఇస్తామని, ప్రచారం చేసుకోవాలని ఇరు పార్టీల నేతలు చెబుతున్నారు. ఉప సంహరణ నాటికి మిత్రపక్షాల మధ్య సయోధ్య విషయమై స్పష్టత వచ్చే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

టీమ్ వర్క్‌తోనే నూతన అన్వేషణలు

- గీతం వ్యవస్థాపక దినోత్సవంలో నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ టకాకి కజిత


గీతం వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న జపాన్ శాస్త్రవేత్త డాక్టర్ టకాకి కజిత

ప్రజాశక్తి - విశాఖపట్నం

శాస్త్రవిజ్ఞాన రంగంలో నూతన అన్వేషణలను, కొత్త విషయాలను కనుగొనాలంటే, టీమ్ వర్కుగా పరస్పర చర్చల ద్వారా పూర్తిస్థాయి అవగాహనతో చేపట్టాలని, తన విషయంలో ఇది నిరూపితమైందని ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ టకాకి కజిత పేర్కొన్నారు. గీతం విశ్వవిద్యాలయం 37వ వ్యవస్థాపక దినోత్సవానికి హాజరై గీతం ఫౌండేషన్ అవార్డు 2017ను గీతం అధ్యక్షులు డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి చేతులు మీదుగా స్వీకరించిన ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. తనకు నోబెల్ బహుమతి రావడం వెనక జరిగిన కృషిని, టోక్యోలోని భూగర్భంలో నిర్మించిన సూపర్ కమియో కాండే పరిశోధనా కేంద్రంలో జరిగిన పరిశోధనా వివరాలను ఆయన తెలియజేశారు. న్యూట్రినోలపై అన్వేషణలో నూతన విషయాలను గుర్తించడానికి తాను దాదాపు 12 సంవత్సరాల పాటు సహచరులతో కలిసి ఎక్కువ సమయం భూగర్భంలో నిర్మితమైన పరిశోధనా కేంద్రంలో గడిపినట్లు పేర్కొన్నారు. భౌతికశాస్త్రంలో తమ పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ముఖ్యంగా విశ్వాన్ని అర్థం చేసుకోవడానికి తమ అధ్యయనాలు ఉపకరిస్తాయని ఆయన వివరించారు. యువ పరిశోధకులు ఈ అధ్యయనాలను అన్ని దేశాలలోనూ స్ఫూర్తివంతంగా కొనసాగిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ టకాకి కజితకు గీతం ఫౌండేషన్ అవార్డుతో పాటు 10 లక్షల రూపాయల అవార్డు మొత్తాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు, వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్ఎస్.ప్రసాదరావు, గీతం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ కె.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధికి అరాచకానికి మధ్య పోటీ

- నంద్యాల ఎన్నికపై మంత్రి దేవినేని వ్యాఖ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల్లో అభివృద్ధికి, అరాచకానికి మధ్య పోటీ జరుగుతోందని జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. విజయవాడ జలవనరులశాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎన్నికలో ఓడిపోతామన్న భయంతోనే జగన్ నోటికొచ్చినట్లు మాట్లాడతున్నారని విమర్శించారు. దీన్ని ఎన్నికల కమిషన్ సుమోటాగా స్వీకరించాలని డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు వయసును కూడా పరిగణలోకి తీసుకోకుండా మాట్లాడటం ఆయన మానసికస్థితిని తెలియజేస్తోందన్నారు. 12 అవినీతి కేసుల్లో ముద్దాయిగా ఉన్న జగన్ రాయలసీమలో ప్రాజెక్టులు పూర్తి చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులుగా ఎంతోమంది ప్రముఖులు రాష్ట్రంలో పనిచేసారని అందులో పుచ్చలపల్లి సుందరయ్య, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, చంద్రబాబు ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా రాకుండా జగన్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. గుండ్రేవుల ఇంటర్ స్టేట్ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుంటే, కేసీ కెనాల్ ప్రాజెక్టు గురించి జగన్ మాట్లాడుతున్నారన్నారు. ముచ్చుమర్రి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం వదిలేస్తే, దానిని తాము పూర్తి చేసి రాయలసీమకు నీరందించామన్నారు. ముఖ్యమంత్రి పదవి జగన్‌కు అందని ద్రాక్షేనని ఆయన ఎద్దేవా చేశారు.

చవుడుబారుతున్న 'పశ్చిమ' డెల్టా..!

భవిష్యత్తులో పశ్చిమగోదావరి జిల్లాలో వరిసాగు కనుమరుగు కానుందా?.. డెల్టా భూములన్నీ సాగుకు పనికిరాకుండా పోనున్నాయా?.. అంటే వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి, అధికారుల వరకూ అందరినోటా అవుననే సమాధానమే వస్తోంది. టిడిపి అధికారంలోకొచ్చిన తర్వాత 'పశ్చిమ' డెల్టాలో నిబంధనలకు విరుద్ధంగా, విచ్చల విడిగా తవ్వకం సాగించిన రొయ్యల, చేపల చెరువులే అందుకు కారణంగా శాస్త్రవేత్తల పరిశీలనలో వెల్లడవుతోంది. నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో దెబ్బతిన్న నారుమడు లను పరిశీలించిన మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవ సాయశాఖ అధికారులు ఈ భూములు చవుడుబారి పోయాయని, వరిసాగుకు పనికిరావని తేల్చేయడంతో రైతులంతా ఆందోళన చెందు తున్నారు.

- మార్టేరు వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశీలనలో వెల్లడి
- రొయ్యల, చేపల చెరువుల నీళ్లే కారణమని నిర్ధారణ
- రబీ, ప్రస్తుత ఖరీఫ్‌లో సైతం దెబ్బతిన్న వరిసాగు
- రెండేళ్లలో వరి కనుమరుగయ్యే పరిస్థితులు
- ప్రజాప్రతినిధులు, అధికారులే కారణమంటున్న రైతులు



ప్రస్తుత ఖరీఫ్‌లో దెబ్బతిన్న నారుమడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'పశ్చిమ' డెల్టా వరిసాగుకు ప్రఖ్యాతి గాంచింది. 5.29 లక్షల ఎకరాల్లో వరిసాగు చేసేవారు. మూడేళ్లలో నిబంధనలకు విరుద్ధంగా, విచ్చలవిడిగా చేపల చెరువుల తవ్వకాలు సాగిపోయాయి. రైతులు ఎంత మొత్తుకున్నా ప్రజా ప్రతినిధులుగానీ, అధికారులుగానీ పట్టించుకోవడం లేదు. పోలీసులను కాపలాపెట్టి మరీ తవ్వకాలు సాగించేశారు. జిల్లాలో దాదాపు రెండు పంటలు పండే 2.30 లక్షల సాగు భూమి చేపల చెరువులుగా మారిపోయింది. ఇంకా మూడు లక్షల ఎకరాల్లోనే వరి సాగవుతోంది. ఇప్పుడు ఆ భూముల్లో సైతం వరి పండని పరిస్థితి నెలకొంది. చేపల చెరువుల్లో నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల సాగు చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతి నిధులు మామూళ్లు తీసుకుని అక్రమ సాగును మరింత ప్రోత్సహిస్తున్న పరిస్థితి కొనసాగు తోంది. రొయ్యల సాగు కోసం ఎటువంటి అనుమతులు లేకుండా ఉప్పునీటి బోర్లు వేసేశారు. అత్యంత విషపూరితమైన రసాయనా లను వాడుతున్నారు. ఉప్పు, రసాయనాలు కలిసిన నీటిని పంట కాలువల్లోకి యథేచ్ఛగా వదిలేస్తు న్నారు. ఆ నీరు వరి సాగు చేస్తున్న భూముల్లోకి చేరడం తో నారుమడులు, వరిమొక్కలు దిగకుళ్లిపోతు న్నాయి. చివరిదశకు చేరిన పంట పొలాలు సైతం పనికిరాకుండా పోతున్నాయి. రొయ్యల చెరువుల్లోని ఉప్పునీరు పంట పొలాల్లో చేరి చవుడుబారుతున్నాయి. ఇక ఆ భూముల్లో పంటలు పండే అవకాశం లేదనే స్థాయికి పరిస్థితి చేరింది.



దెబ్బతిన్న నారుమడి

వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశీలనలో తేలిన వాస్తవాలు

గత రబీలో నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు తదితర మండలాల్లో నారు మడులు, నాట్లునాటిన పొలాలు, చేతి కొచ్చిన పంట సైతం రొయ్యల చెరువుల నీటి కారణంగా పెద్ద ఎత్తున దెబ్బతింది. సిపిఎం ఆధ్వర్యాన రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేశారు. కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వ హించి వినతిపత్రాలు సమ ర్పించారు. రొయ్యల చెరువుల యజమా నులకు నోటీసులిచ్చి మమ అనిపిం చడంలో తప్ప అధికారులు కనీస చర్యలు తీసు కోలేదు. ప్రస్తుత ఖరీఫ్‌లోనూ అదే పరిస్థితి నెలకొంది. డెల్టాలో రొయ్యల చెరు వుల నీటికారణంగా దాదాపు 50వేల ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నట్లు అంచనా. నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో పెద్ద ఎత్తున నారుమళ్లు దెబ్బతినడంతో రైతులు 'మీకోసం'లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన రైతులు గతంలో అక్కడ చేపల చెరువు తవ్వకం సాగించొద్దంటూ పెద్దఎత్తున పోరాటం చేసినా అధికారులు వినిపించుకోలేదు. ఇప్పుడు అవే చేపల చెరువుల నీటితో నారుమడులన్నీ పనికి రాకుండా పోయాయి. దెబ్బతిన్న నారుమడులను పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ జిల్లా, డివిజన్, మత్స్యశాఖ అధికారులు దెబ్బతిన్న నారుమడులను పరిశీలించారు. చేపల, రొయ్యల చెరువుల్లోని ఉప్పునీటి కారణంగానే నారుమడులు దెబ్బ తిన్నట్లు తేల్చారు. ఈ భూములన్నీ చవుడు బారిపోయా యని పంటపండే అవకాశం లేదని చెప్పేశారు. చవుడును తట్టుకునే విత్తనాలు వినియోగిస్తే కొంతమేర మేలు జరుగుతుందని సలహా ఇచ్చారు. తమ పరిస్థితి ఏమిటని రైతులు నిలదీయగా కమిటీ వేస్తామంటూ వ్యవసాయశాఖ అధికారులు జారుకున్నారు. డెల్టావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు శాస్త్రవేత్తలు, అధికారులు మాటలను బట్టి అర్థమవుతోంది. మరో రెండేళ్లలో డెల్టాలో వరిసాగు కను మరుగయ్యే పరిస్థితి ఏర్పడనుందని స్పష్టంగా తెలుస్తోంది. చేపల, రొయ్యల చెరువులు వద్దంటూ రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వంగానీ, అధికారులుగానీ వినిపించుకోలేదు. ప్రస్తుతం సాగు చేస్తున్న మూడులక్షల ఎకరాల్లో సైతం పంటలు పండని పరిస్థితి ఏర్పడటంతో రైతులకు ఏం చేయాలో అర్థంకాకుండా పోయింది. ఇప్పటికే ఉపాధిలేక వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు వలసబాట పడుతున్నారు. ముందుముందు పరిస్థితి మరింత దుర్భరంగా మారనుందని అధికారులు మాటలను బట్టి అర్థమవుతోంది.

నాలుగెకరాల నారుమడి దెబ్బతింది



పంట పొలాలు పక్కన చేపల చెరువులు తవ్వవద్దని రైతులంతా కలిసి రెండేళ్లుగా పోరాటం చేశాం. ఇప్పుడు చేపల, రొయ్యల చెరువుల నీటితో పంట పొలాలు మొత్తం చవుడు బారి పండకుండా పోతున్నాయి. నాలుగె కరాల్లో నారుమడి పూర్తిగా దెబ్బతింది. అధికారులు, శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలించి ఈ భూములు పంటకు పనికిరా వంటూ చెప్పేశారు. ఏం చేయాలో అర్థంకావడం లేదు.

- యడ్ల వెంకట సింహాచలం, పెదనింద్రకొలను

చేతికొచ్చిన పంటపొలాలు సైతం కుళ్లిపోయాయి



రబీలో నారుమడులతోపాటు వేసిన నాట్లు, చేతికొచ్చిన పంట సైతం దిగకుళ్లిపోయాయి. రొయ్యల చెరువుల్లోని ఉప్పునీటి తోనే దెబ్బతిన్నట్లు అధికారులు వచ్చి తేల్చారు. ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇక పొలాల నిండా ఉప్పునీరు చేరిపోతుండటంతో ఇక పంట పండుతుందన్న నమ్మకం సైతం పోయింది.

- పంబు గోవింద్, నిడమర్రు మండలం

చేపల చెరువులతో నేల చవుడు బారింది

పెదనింద్రకొలనులో దెబ్బతిన్న నారుమడులను పరిశీ లించాం. పక్కనే ఉన్న చేపల చెరువుల కారణంగా నేలలో ఉప్పు చేరి చవుడు బారుతోంది. వరిసాగు చేసినా తాలు ఎక్కువగా వచ్చి దిగుబడిరాదు. తట్టుకునే విత్తనాలు పెట్టి నీరు పెట్టడం, తీయడం చేస్తే కొంత ప్రయోజనం ఉంటుంది.

- ఎస్.కృష్ణంరాజు, శాస్త్రవేత్త, మార్టేరు పరిశోధనా కేంద్రం.

చేపల చెరువుల కారణంగా నేల ఉప్పుగా మారింది

చేపల చెరువుల వల్లే పెదనింద్రకొలనులో నారుమడులు దెబ్బతిన్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలన చేశాం. నేల ఉప్పుగా మారడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులతో కమిటీ వేసి తగిన చర్యలు తీసుకుంటాం.

- గౌషియాబేగం, వ్యవసాయశాఖ జెడి

అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లు

- 55 వేల మందికి పంపిణీ చేసేలా ఏర్పాటు
- 14 రిజిస్టర్ల వివరాల నమోదు సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం
- నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- నెట్‌వర్కు లేని ప్రాంతాల కార్యకర్తలకు తప్పని కష్టాలు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తల విధుల నిర్వహణకు సంబంధించిన వివిధ రిజిస్టర్లలో నమోదు చేస్తున్న వివరాలను ఇక మీదట ఆన్‌లైన్‌లో స్మార్ట్‌ఫోన్‌లలో నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 55 వేల అంగన్‌వాడీ కార్యకర్తలకు త్వరలో స్మార్ట్‌ఫోన్‌లు అందచేయాలని నిర్ణయించింది. స్మార్ట్‌ఫోన్‌లో ఇందుకు సంబంధించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఇప్పటికే నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియను చేపట్టారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, అనంతపురం జిల్లాల్లో ఈ విధానం విజయవంతమైనందున డిసెంబరు చివరి కల్లా అన్ని జిల్లాల్లోనూ అమలు చేయాలని నిర్ణయించామని రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమ శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ వెల్లడించారు. కుటుంబ సర్వే, గర్భిణులు, బాలింతలు, పిల్లల ఎదుగుదల, బరువు, రోజువారీ ఆహారం, బరువు తక్కువగా ఉన్న వారి వివరాలు, స్టాక్ రిజిస్టర్, రోజువారీ మెనూ, అటెండెన్స్ తదితర వివరాలకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రస్తుతం 14 రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఈ వివరాలను స్మార్టుఫోన్‌లలో నమోదు చేయడం ద్వారా చాలా వరకూ పనిభారం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నేరుగా ఈ కేంద్రాలకు ఫోన్‌లు సరఫరా చేస్తోంది. ప్రస్తుతం నాలుగు జిల్లాల్లో కార్బన్ కంపెనీల ఫోన్‌లను అందించారు. వీటి స్థానంలో మళ్లీ కొత్త ఫోన్లు మిగతా జిల్లాలతో కలిపి వారికీ సరఫరా చేసే ఆలోచనలో ఉన్నారు. సిమ్ కార్డు కూడా ప్రభుత్వమే అందిస్తుంది.

అయితే ఫోన్ నెట్‌వర్కు లేని ప్రాంతాల్లో 4 వేల అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని గుర్తించారు. అయినా వీరు నెట్‌వర్కు ప్రాంతాలకు వచ్చి అప్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న కేంద్రాల కార్యకర్తలు తొలుత 14 రిజిష్టర్లలో నమోదు చేసుకుని ఆ తరువాత మళ్లీ వాటిని సిగ్నల్ వచ్చే మైదాన ప్రాంతాలకు వెళ్లి స్మార్టుఫోన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇది మరింత పనిభారం కావడంతో ఆ ప్రాంతాల్లోని అంగన్‌వాడీలకు కష్టాలు తప్పడం లేదు.

తిరుమలలో సైకో హల్‌చల్

ప్రజాశక్తి-తిరుమల

తిరుమలలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. పిఎసి-4 వద్ద సులభ్ కార్మికురాలిపై కర్రతో దాడి చేశాడు. మహిళకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు సైకోని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దాడిలో గాయపడిన కార్మికురాలికి మెరుగైన చికిత్స కోసం రుయా ఆసుపత్రికి తరలించారు. తిరుమలలో ఇటువంటి వారిని గుర్తించి చర్యలు చేపట్టే విధంగా ఆరోగ్యశాఖలో ఓ శానిటరీ ఇన్స్‌పెక్టర్ స్థాయి అధికారిని నియమించారు.

1,112 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం కంటోన్మెంట్

విజయనగరం జిల్లాలో వేర్వేరు చోట్ల నుంచి శనివారం ఉదయం మహారాష్ట్రకు తరలిస్తున్న సుమారు 1,112 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. విజయనగరం పట్టణంలోని ఎత్తుబ్రిడ్జి వద్ద పోలీసులు చేసిన తనిఖీల్లో సుమారు 412 కేజీల గంజాయిని పట్టుకు న్నారు. విశాఖ జిల్లా గూడెం కొత్తవీధి నుంచి కైలో చిన్నారావు అనే వ్యక్తి కొనుగోలు చేసి మహారాష్ట్ర తరలిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ మేరకు డిఎస్‌పి ఎవి రమణ విలే కర్ల సమావేశంలో వెల్లడించారు. లారీ యజమా నిని, డ్రైవర్, క్లీనర్లను అదుపులోకి తీసుకున్నారు. గంట్యాడ మండలం రామవరం, నరవ గ్రామాల మధ్య వాహనంలో తరలిస్తున్న 700 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నారాయణరావు, కానిస్టేబుళ్లు సతీష్, శ్రీనివాసరావు వాహనాలను తనిఖీ చేస్తుండగా వ్యాన్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో రామవరం, నరవ గ్రామల మధ్య పట్టుకున్నారు. వాహనంలో 700 కేజీల గంజాయి ప్యాకెట్లు ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు.

అనారోగ్యంతో సిఆర్‌పిఎఫ్ జవాన్ మృతి

ప్రజాశక్తి - జలుమూరు

శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం నగరికటకం పంచాయతీ మెట్టపేట గ్రామానికి చెందిన సిఆర్‌పిఎఫ్ జవాన్ సీపాన ఎర్రయ్య(36) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఎర్రయ్య చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమలో విధులు నిర్వర్తిస్తున్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు అక్కడ ప్రథమ చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ క్షీణించడంతో శుక్రవారం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతిచెందాడు. మృతుని స్వగ్రామం మెట్టపేటలో శనివారం అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తహశీల్దార్ కె.ప్రవళికాప్రియ, ఎఎస్‌ఐ తులసీరావు, ఆర్‌ఐ చిన్నారావు పాల్గొన్నారు. మృతునికి భార్య లీలాకుమారి, కుమార్తె జోత్స్న, కుమారుడు తరుణ్ ఉన్నారు. ఎర్రయ్య మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

జోరుగా ఉప ఎన్నిక ప్రచారాలు



జగన్ రోడ్ షో..

ప్రజాశక్తి - నంద్యాల క్రైం

నిరుద్యోగులకు నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీనిచ్చి గద్దెనెక్కిన తరువాత పూర్తిగా విస్మరించారని వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నాల్గో రోజు శనివారం వైఎస్ జగన్ రోడ్‌షో నియోజకవర్గ పరిధిలోని ఒంటెలగల, గోస్పాడు, ఎం.క్రిష్టాపురం, యాళ్లూరు గ్రామాల్లో కొనసాగింది. ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు అభివృద్ధి గుర్తుకు వస్తుందని పేర్కొన్నారు. బాబు ముఖ్యమంత్రిగా లేనప్పుడు రేషన్‌షాపుల్లో తొమ్మిది వస్తువులు ఇచ్చేవారని, ఆయన అధికారంలోకి వచ్చాక ఎనిమిది వస్తువులు కట్ చేశారని అన్నారు. ఆయన చేస్తున్న మోసాల పాలనలకు ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, నాయకులు మల్కిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పిపి నాగిరెడ్డి, సిద్ధం శివరాం, ఎం.విజయశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షులు మహేజబీన్, నాయకులు పాల్గొన్నారు.

ఉధృతంగా టిడిపి..

ఎన్నికల ప్రచారంలో భాగంగా నంది పరిశ్రమల ఎండి.శ్రీధర్‌రెడ్డి, మంత్రుల నేతృత్వంలో నంద్యాల బొమ్మల సత్రం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. టిడిపి అభ్యర్థిని బలపరచాలని కోరారు. 16, 29, 30వ వార్డుల్లో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు, నాయకులు ప్రచారం నిర్వహించారు.

జైలు అనుభవంతోనే ఈ మాటలు : కెఇ

ప్రజాశక్తి - కర్నూలు క్రైం/నంద్యాల/నంద్యాల లీగల్

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 16 నెలలు జైలులో ఉండొచ్చిన అనుభవంతో ఆరాచకంగా మాట్లాడి, ఆ తరువాత వాటికి ఆవేదన అనే రంగు పులుముతున్నారని ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం కర్నూలులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ నంద్యాల ఉప ఎన్నికల్లో ఓడిపోతే పార్టీ ఉనికి కోల్పోతుందనే భయంతో రాష్ట్ర ముఖ్యమంత్రినే తుపాకీతో కాల్చాలని, ఉరి తీయాలని అంటూ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. నంద్యాలలో అరాచకం సృష్టించి ఎన్నికలు వాయిదా వేయించాలనే కుట్ర పన్నుతున్నట్లుగా అనుమానం కూడా కలుగుతోందని అన్నారు.

ధర్మానికి, అరాచకత్వానికి ఎన్నికలు

మంత్రి సోమిరెడ్డి

నంద్యాల ఉప ఎన్నిక ధర్మానికి, అరాచకత్వానికి జరుగుతున్న ఎన్నికలని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభివర్ణించారు. నంద్యాలలోని టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగ్మోహన్‌రెడ్డి టైప్-2 ఉన్మాదిగా మారాడని అన్నారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఉంచాలని డిమాండ్ చేశారు. వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి బంధువులు బహిరంగంగా ఓటర్లకు ఓటుకు రూ.5 వేల చొప్పున పంచుతున్న విషయాన్ని రికార్డు చేశామని, దీనిని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

చాబోలులో కాంగ్రెస్..

ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నంద్యాల మండలం చాబోలులో పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి పాదయాత్ర చేపట్టారు. విజయ పాలడైరి, పొన్నాపురం, సాయిబాబ నగర్, దేవనగర్, మసీదు సెంటర్, విసి కాలని, పెద్ద చర్చి సెంటర్, ఎంఎస్. నగర్ మీదుగా మూలసాగరం, సంజీవనగర్‌లలో పర్యటించారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలనికోరారు.



అగ్రి యాజమాన్యంతో ప్రభుత్వం కుమ్మక్కు!

16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య యాత్ర

సిఎం హామీ నెరవేరలేదు

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినా బాధితులకు న్యాయం జరగక పోవడంతో అగ్రిగోల్డ్ యాజమాన్యంతో ప్రభుత్వం కుమ్మక్కయ్యిందనే అనుమానాలొస్తున్నాయని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. బాధితులకు న్యాయం చేసే విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ సమావేశాల సమయంలో ఆత్మహత్యలకు పాల్పడిన వారికి రూ.5 లక్షలు నష్ట పరిహారమిస్తామని, మూడు నెలల్లో డిపాజిట్‌దారులకు సొమ్ము చెల్లిస్తామని సిఎం ప్రకటించినా ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదన్నారు. ఇక తాడో పేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బాధితులకు న్యాయం చేయాలని హైకోర్టు సూచించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఇప్పటికే అగ్రిగోల్డ్ ఆస్తుల్ని ఎటాచ్ చేసిందని, నెలకు రూ.1000 కోట్లు ఆస్తుల్ని వేలం ద్వారా విక్రయించి బాధితులకు న్యాయం చేయాలని దిశా నిర్దేశం చేసిందని స్పష్టం చేశారు. 30 నెలలుగా తాము పోరాటం చేస్తుంటే ప్రభుత్వం ఇంకా కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 17 వరకు చైతన్య యాత్రను చేపట్టనున్నట్లు ముప్పాళ్ల వివరించారు. మదుపు చేసుకున్న సొమ్ము ఇక రాదని ఇప్పటికే సుమారు 142 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు.

బాధితులకు భరోసా ఇవ్వడానికే చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. నెల రోజులు జరిగే ఈ యాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు సాగుతుందన్నారు. ఆస్తుల వేలాన్ని అగ్రిగోల్డ్ యాజమాన్యమే అడ్డుకుంటోందని, సంస్థ డైరక్టర్లతో పాటు వారి కుటుంబ సభ్యుల్ని వెంటనే అరెస్ట్ చేయాలసి అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు వెంటనే ఆస్తుల్ని వేలం వేసి ముందుగా చిన్న మొత్తాల పొదుపుదారులకు రూ.1,180 కోట్లు చెల్లించాలని వారు కోరారు. దీనికోసం ఉన్నతాధికారులతో ఒక హైపవర్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో చైతన్య యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులను పక్కన పెట్టిన మోడీ, చంద్రబాబు

ఆమ్ ఆద్మీ పార్టీ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి సోమనాథ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ఎన్నికల్లో కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోలేదని ఆమ్ ఆద్మీ పార్టీ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జి సోమనాథ్ భారతి చెప్పారు. రుణమాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు హామీని నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. శనివారం గుంటూరులో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రైతు రణభేరి సభలో ఆయన పాల్గొన్నారు. సభకు పార్టీ రాష్ట్ర కో-కన్వీనర్ పోతిన వెంకట రామారావు అధ్యక్షత వహించారు. రైతులు తమ ప్రతినిధులను చట్ట సభలకు పంపినప్పుడే అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులకు ఢిల్లీ ప్రభుత్వం మేలైన సౌకర్యాలు కల్పిస్తోందని సోమనాథ్ భారతి పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా హెక్టారుకు రూ.50 వేల పరిహారం అందచేస్తున్నామని చెప్పారు. మాజీ ఎంపి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రైతు నాయకులు ఎర్నేని నాగేంద్రరావు, కె.విజయరావు, వై.రాధాకృష్ణ తదితరులు ప్రసంగించారు

15 నుంచి ఉద్యానవన ప్రదర్శన

సేంద్రీయ పంటల ఉత్పత్తి, నర్సరీలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సేంద్రీయ, నర్సరీ ఎక్స్‌పో ఉద్యానవన ప్రదర్శనను ఈనెల 15 నుంచి 18 వరకూ విజయవాడ సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి వెల్లడించారు. శనివారం గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రదర్శనను ప్రారంభిస్తారని చెప్పారు. సేంద్రీయ పంటల ఉత్పత్తి, మార్కెటింగ్, నర్సరీ యాజమాన్యం, ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించనున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు, ఎక్కువ దిగుబడులు సాధించేందుకు, ఒకే సారి బహుళ పంటలు పండించేందుకు రైతులకు శాస్త్రవేత్తలు, నిపుణుల చేత సలహాలు, సూచనలు అందివ్వనున్నామని చెప్పారు. కడియం, రైల్వే కోడూరులో ఉన్న భారీ నర్సరీల స్థాయిలో వివిధ జిల్లాల్లోనూ పెద్ద ఎత్తున నర్సరీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నిధులతో ఐదు లక్షల ఎకరాల్లో ఈ ఏడాది ఉద్యాన పంటలకు బిందు సేద్యం ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు.

కాపులకు నిరసన తెలిపే హక్కు లేదా?

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరిజిల్లా)

రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, వాటిని అమలు చేయాలని నిరసన తెలిపే హక్కు కూడా మాకు లేదా? అని కాపు ఉద్యమ నేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ప్రశ్నించారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 18వ రోజూ పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, కాపు నాయకులు ముఖానికి నల్లముసుగులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ 18 రోజులుగా తమను గృహనిర్బంధం చేయడం అన్యాయమన్నారు. ఇక్కడ చట్టాలు, ప్రాథమిక హక్కులు, నిరసన తెలిపే హక్కు లేకుండా పోయాయన్నారు. తమపై కేసులున్నాయని, జైలులో పెడితే అక్కడైనా గోడు వినిపించుకొనే అవకాశం దొరుకుతుందని అన్నారు. 'రాష్ట్రంలో అనేకమంది పాదయాత్ర చేశారు. ఎవరికీ లేని నిబంధనలు, అనుమతులు మాకేనా?' అంటూ ముద్రగడ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐడి కోర్టుకు పంపిస్తే అక్కడైనా తమకు స్వేచ్ఛ లభిస్తుందని అన్నారు. 'మీరు ఈ బందులదొడ్డికి కాపలా కాసే శ్రమ తగ్గుతుంది. దీన్ని వెంటనే అమలుచేయండి. సిఐడి అధికారులకు తెలియజేయండి' అని ఆయన పోలీసులను కోరారు.



వరుసగా నాలుగురోజులు సెలవులు రావడంతో విజయవాడ-హైదరాబాద్ మధ్య కృష్ణాజిల్లా కంచికచర్ల సమీపంలో ఉన్న కీసర టోల్‌గేట్ వద్ద రద్దీని ప్రతిబింబించే చిత్రమిది.

- ప్రజాశక్తి-కంచికచర్ల



అంతా కల్మషం పేరుకుందీ లోకంలో ...
ఎక్కడ బాధ కనపడుతుందో ?
ఎక్కడ కల్మషం కనపడుతుందో దాన్ని
నిర్మూలించే పనిచేయాలి.

- చలం

సవ్వడి
సాహిత్యం - కళలు

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

విజయవాడ
ఆదివారం 13 ఆగస్టు 2017

అక్షరం

విస్పష్టం, వినూత్నం.. విశాఖ కథా సాహిత్యం


ఆధునిక ఆంగ్ల సాహిత్యంలో అత్యంత ప్రతిభావంతులుగా పేరొందిన రచయితలు, కవులు అయిన గోల్డ్‌స్మిత్, జేమ్స్ జాయిస్, జార్జి బెర్నార్డ్‌షా, జొనాథన్ స్విఫ్ట్, ఆస్కార్‌వైల్డ్.. ఇలా చాలామంది ఐరిష్‌వారే. కనక, ఆంగ్లసాహిత్యమంటే ఐరిష్ సాహిత్యమే అన్నట్టుండేది. అచ్చం ఆ పద్ధతిలోనే ఆలోచిస్తే గురజాడ మొదలుకొని పతంజలి వరకూ ఎందరో మహాకథకుల పుణ్యమాని సుసంపన్నమైన ఉత్తరాంధ్ర సాహిత్యమే తెలుగు సాహిత్యం అనే కీర్తి దక్కించుకుంది. తెలుగు కథ మటుకు తనదైన సొంత గొంతుతో, శైలితో, రూపలావణ్యాలతో, ఎందరెందరో కథాశిల్పుల కళాత్మకతతో మహోన్నతి సాధించింది.


'తలుపు! తలుపు!


మహాకవి గురజాడ వేంకట అప్పారావు కథ 'దిద్దుబాటు' కథారంభంలో రాసిన మాటలివి. కథానాయకుడు గోపాలరావు చేత మహాకవి ఈ మాటలు అనిపించాడు. ఇవి ఆధునిక తెలుగు సాహితి వాకిలి తడుతూ ఆ కవి ఇచ్చిన పిలుపుగా మనకి వినిపిస్తుంది. ఈ కథ 'ఆంధ్రభారతి' 1910, ఫిబ్రవరి సంచికలో అచ్చయింది. వస్తువు, భాష, ఎత్తుగడల మొదలు ముగింపు వరకూ కథావిన్యాసంలో రచయిత చూపే కళా నైపుణ్యమే శిల్పం అయినప్పుడు గురజాడ వారు కథాలోకానికి ఆద్యులు, పూజ్యులని చెప్పడానికి సంకోచించనక్కరలేదు. 'దిద్దుబాటు' మాత్రమే కాకుండా, హంపీ విజయనగర వంశీకుల చరమదశ పాలనలో క్షీణదశకు చేరుకున్న తెలుగు సాహిత్యానికి, కళింగ విజయనగరంలో కొత్త సూర్యోదయాన్ని చూపించినవారు గురజాడ. ఇంతటి మహోన్నత వ్యక్తిత్వం కలిగిన కవి ప్రభావం నుంచి తప్పించుకున్న తెలుగు కథకులు, నాటకకర్తలు, కవులు దాదాపు లేరు. కవిత్వం, నవల, నాటకం, విమర్శ వంటి ప్రక్రియలకు విశాఖ ప్రాంత రచయితలు చేసిన సేవ అపారమైనది. కానీ కథ విషయంలో ఈ ప్రాంతానిది మరీ ప్రత్యేకమైన స్థానం. ఈ ప్రస్థానంలో కూడా గురజాడ అడుగుజాడ ప్రతి మలుపులోనూ కనిపిస్తుంది.

ఇక్కడ పుట్టిన వారే కాకుండా, ఈ ప్రాంతంతో ఏదో విధంగా సుదీర్ఘ బంధం ఉన్నవారి కథలు, ఈ ప్రాంతమే నేపథ్యంగా వచ్చిన కథలను కూడా ముచ్చటించుకోవడం సముచితం. విశాఖ ప్రాంతపు కథకు ఉన్న అద్భుత వారసత్వం అప్పుడే ఆవిష్కృతమవుతుంది. కాళీపట్నం రామారావు (కారా) శ్రీకాకుళం జిల్లా వారు. కానీ ఆయనకూ, విశాఖకూ అవినాభావ సంబంధం ఉంది. చాసో, కారా, రావిశాస్త్రిలను ఉత్తరాంధ్ర కథాత్రయంగా గౌరవిస్తారు.

విశాఖ ప్రాంతపు కథ మాండలీకానికి పెట్టింది పేరు. మాండలీకాన్ని ఉపయోగించుకోవడంలో ఈ ప్రాంత రచయితల ప్రతిభ వేరు. నైపుణ్యం వేరు. అలాగే దృక్పథానికి సంబంధించిన పునాది కూడా లోతైనది. గురజాడ కథలు, కన్యాశుల్కం నాటకం, కవిత్వంతో పాటు, శ్రీశ్రీ మహాప్రస్థానం కూడా ఈ ప్రాంత రచయితలను విశేషంగా ప్రభావితం చేసింది. శ్రీశ్రీ ప్రయోగవాదం, ప్రయోగ దృష్టి ఎందరినో ఆకర్షించాయి. ప్రాచుర్యాన్ని బట్టి గురజాడ తరువాత విశాఖ ప్రాంత రచయిత శ్రీశ్రీ. మహాప్రస్థానం, మరో ప్రస్థానం, సినిమా పాటలు మాత్రమే శ్రీశ్రీ సాహిత్యం కాదు, 30 కథలు కూడా ఆయన రాశారు. 'చరమ రాత్రి', 'ఒసే తువ్వాలు అందుకో', 'ఒక్కల' వంటి కథలవి. ఇవన్నీ దాదావు ప్రయోగాలే. పాశ్చాత్య రచనా ధోరణులకూ, కళా, సాహిత్య రంగాలలో వచ్చిన విప్లవాల పట్ల సహజంగానే ప్రభావితుడైన శ్రీశ్రీ తన కథల్లోనూ వాటిని ప్రతిబింబించారు. 'ఒసే తువ్వాలు అందుకో' తెలుగు ప్రాంత నేపథ్యంతో, పాశ్చాత్య వాదం ఆధారంగా నిర్మించిన కథ. శ్రీశ్రీ రాసినదే 'చావూ-పుట్టుకా' కథ 'లక్ష కథానికల పెట్టు' అంటారు రచయిత, విమర్శకుడు విహారి. ఈ కథానిక అంతా పద్దెనిమిది పంక్తులు. ఆసుపత్రిలో ఆపరేషన్ ద్వారా గర్భిణి బిడ్డకు జన్మనిస్తుంది. పోలీస్ స్టేషన్‌లో అక్కడి ట్రీట్‌మెంట్ ద్వారా ఒక యువకుడు మరణిస్తాడు. అదీ, ఇదీ కూడా హింస. కానీ ఒక హింసతో జననం. మరొక హింసతో మరణం. సొంత రచన గానీ, అనువాదం గానీ ఎంతో కవితాత్మక శైలితోనే శ్రీశ్రీ కథలన్నీ అందించారు. 'అనితర సాధ్యం నా మార్గం' అన్నారాయన. అది కవిత్వంలోనే కాదు, కథలలో కూడానని అనిపిస్తుంది. శ్రీశ్రీ అనువదించిన కథలు కూడా ఎంతో గొప్పగా ఉంటాయి.











ఇక విశాఖ కథాచరిత్ర మరింతగా జేగీయమానం కావాలంటే చాసోను తల్చుకోవల్సిందే! వాయులీనం, ఎందుకు పారేస్తాను నాన్నా!, కుంకుడాకు, ఏలూరెళ్లాలి, ఎంపు, కుక్కటేశ్వరము వంటి కథలు చదవకుండా ఆగిపోతే, తెలుగు సాహిత్యపు ఔన్నత్యం అనుభవానికి రాదు. విశాఖకే చెందిన రాచకొండ విశ్వనాథశాస్త్రి (రావిశాస్త్రి) ఉత్తరాంధ్రతో పాటు, తెలుగు కథకే గొప్ప సంపద. రావిశాస్త్రి శైలి, ఇతివృత్తాల స్వీకరణ అనితరసాధ్యమైన స్థాయిలోనే ఉంటాయి. ఆయన రకరకాల పేర్లతోనూ కథలు రాశారు. అందులో ముఖ్యమైనది జాస్మిన్. మాండలీకాన్ని కూడా కవితాత్మకంగా చెప్పే ప్రతిభ ఆయనది. కథలో అయినా దృశ్య చిత్రీకరణ, పాత్ర చిత్రణ రావిశాస్త్రి గారి అసమాన ప్రతిభలు. ఆయిన ఉపమానాలు నిరుపమానమైనవి. ఎన్నెన్నో కథలు రాశారాయన. వాటిలో 'మామిడి చెట్టు', షోకు పిల్లి', 'వియత్నాం విమల' వంటి కథల్లో వారు చూపిన ప్రతిభ విస్తుపోయేటట్టు చేస్తుంది. 'పువ్వులు', 'వెన్నెల', 'ఎండ', 'వాన', కార్నర్‌సీటు, 'గుంటూరు', 'కోర్టుకు రాని సాక్షులు', ఆరు సారా కథలు, బాకీ కథలు - ఒకటేమిటి ఏ కథ తీసుకున్నా అంతే! 'రుక్కులు' పేరుతో శ్రీశ్రీ రుక్కులు కవితలను రావిశాస్త్రి కథల రూపంలో ఆవిష్కరించడం గొప్ప ప్రయోగమేనని అనుకోవాలి. 'బల్లచెక్క' కథ చరిత్రను శాసించిన ఒక సూత్రాన్ని ఆవిష్కరించే కథ, అదే-మిగులు విలువ. కారల్‌మార్క్స్ చెప్పిన అతి గహనమైన ఈ అంశాన్ని శాస్త్రిగారు చిన్నకథలో నిక్షిప్తం చేశారు.

రావిశాస్త్రి వామపక్షవాది. ఆ సిద్ధాంత సారాన్ని జీవితంలో ప్రతిబింబింపచేసే సన్నివేశాలను తీసుకుని నిజజీవితాన్నే ఆయన ఆవిష్కరించారు.

పురిపండా అప్పలస్వామి విశాఖకు చెందిన ప్రఖ్యాత రచయిత. విమర్శకుడు. 'మనిషీ- ఆడమనిషీ' 'కొయ్యగుర్రం' వంటి కథలు రాశారాయన. కవి ఆరుద్ర మొదటి విశాఖ ప్రాంత కథకుడే. 'ఊరు ఊరుకుంది' 'నే చెప్పానుగా' వంటివి ఆయన కథా సంకలనాలు.

కారా మాస్టారి 'యజ్ఞం' తెలుగు కథాచరిత్రలో ప్రత్యేకమైనది. దేశం ప్రగతి సాధించవచ్చు. కానీ అది ఎవరికి ఉపయోగపడే ప్రగతి? దోపిడీని నిలువరించగలిగిన ప్రగతేనా?.. ఇలాంటి ప్రశ్నలను రేకెత్తించగల కథ. 'నో రూమ్', 'మహదాశీర్వచనం' 'అభిమానం' 'జీవధార' వంటి కథలు ఆయనవే.

బలివాడ కాంతారావు ఈ ప్రాంతానికి చెందిన మరో ప్రముఖ కథకుడు. 'చక్రతీర్థ', 'ముంగిస' కథలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. గొల్లపూడి మారుతీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. వారి కథలు, నాటకాలు తెలుగు సాహిత్యాన్ని శోభాయమానం చేశాయి. కెఎన్‌వై పతంజలి కథకునిగా అధిరోహించిన శిఖరాలు అసామాన్యమైనవి. చూపున్న పాట, వేటకథలు.. వంటివి అందుకు ఉదాహరణలు మాత్రమే! వారి సమగ్ర సాహిత్యం వెలువడడం తెలుగు పాఠకుల అదృష్టం.

భమిడిపాటి రామగోపాలం మరో ప్రముఖ రచయిత. 'వంటొచ్చిన మగాడు', 'వెన్నలనీడ', 'కథన కుతూహలం', 'ఇట్లు మీ విధేయుడు' కథల సంకలనం వెలువరించారు. ఇచ్ఛాపురపు రామచంద్రం 150 వరకు కథలు రాసి ప్రసిద్ధులయ్యారు. ఎన్.మాలతి తన కథలకు పలు పురస్కారాలు అందుకున్న రచయిత్రి. 'మా తోటలో', 'ముగ్ధ', 'నాయకురాలు', 'గారాబం' వంటి కథలు ఆమె రాశారు. గణపతిరాజు అచ్యుత రామరాజు విశాఖకు చెందిన ప్రముఖ సాహిత్యవేత్త.

ఆయన ఎనిమిది కథలతో కూడిన 'మున్నీ' అనే సంకలనాన్ని వెలువరించారు. ఆయన రచించిన 'అన్నవాకం' కథ అపురూపమైనది. మాయా వాస్తవికతకు అద్దం పడుతుంది.

పూసపాటి కృష్ణంరాజు ఈ ప్రాంతం నుంచి వచ్చిన అపురూపమైన రచయిత. గురజాడ మాదిరిగానే తన సామాజిక వర్గంలోని భేషజాలను నిరభ్యంతరంగా కథల్లో వెల్లడించినవారు పూసపాటి. 'రెండు బంట్లు పోయాయి', 'దివాణం సేరీవేట', 'సీతాలు జడుపడ్డది'.. వంటి వారి కథలకు ప్రత్యేక స్థానం దక్కుతుంది. మర్యాదల దగ్గర తేడా వచ్చిందన్న సాకుతో గోలకు దిగిన మగ పెళ్లివారికి పెళ్లికూతురు చిన్నమ్మ ఎలాంటి సమాధానం ఇచ్చింది? ఆ కాలంలోనే ఒక స్త్రీ పాత్ర అంత విప్లవాత్మక చర్యకు దిగినట్లు చూపడం నిజంగా విశేషమే! అసలు ఆ పెళ్లికొడుకే నాకు అక్కరలేదందామె. అక్కడే ఉన్న తన మేనమామ కొడుకు చేత తాళి కట్టించుకుంది. ఇదీ- 'రెండు బంట్లు పోయాయి..' కథ ఇతివృత్తం.

అల్లం శేషగిరిరావు కథలు విశాఖ కథా సాహితి మెడలో అందమైన అడవిపూల మాలలే! 'అరణ్య ఘోష', 'మంచి ముత్యాలు' అనే సంకలనాల్లో ఆయన కథలు ఉన్నాయి. 'చీకటి' కథ చదవి కన్నీరు పెట్టనివారు ఉండరు. రథయాత్ర కథ కూడా విశిష్టమైనది. ద్వివేదుల విశాలక్షి అరవై వరకు కథలు రాశారు. 'ఆమె కోరిక' 'భావబంధం' ఆమె కథా సంకలనాలు.

విశేష సంఖ్యలో కథలు రాసిన మరొక రచయిత జయంతి పాపారావు. వాటిలో కొన్ని 'సంఘర్షణ' 'జయంతి పాపారావు కథలు' వంటి సంకలనాల్లో చోటు చేసుకున్నాయి. పాపారావు సాహిత్య విమర్శకులు కూడా. జగన్నాథ శర్మ విజయనగరం ప్రాంతం వారు. ఆయన కథలు ప్రఖ్యాతమయ్యాయి. 'పేగుకాలిన వాసన' ఎప్పటికీ గుర్తుంటుంది. గొబ్బూరి వెంకటానంద రాఘవరావు (అలనాటి సైన్స్ వ్యాసాల రచయిత) 'రాజావారి ఎడమకన్ను, సీతమ్మ గోస' వంటి కథలు రాశారు.

తెలుగేతరులైన ఎల్‌ఆర్ స్వామి తెలుగు కథలను, నవలలను మలయాళీ భాషలోకి అనువదించడమే కాదు, సొంతంగా రెండు వందలకి పైగా తెలుగు కథలు రాశారు. 'కథాస్వామ్యం', ' గోదావరి స్టేషన్', 'ఆటవిక రాజ్యం' వంటి కథలు రాశారాయన. 'లోగుట్టు పెరుమాళ్ల కెరుక..' వంటి కథా సంకలనాలు వెలువరించారు. ఆయన పలు కథానికల్లో కార్మిక జీవితం ప్రస్ఫుటంగా కానవస్తుంది. మేనేజిమెంటు ధోరణులు తెలియవస్తాయి. మళయాలీ అయినప్పటికీ పదహారు సార్లు తెలుగు కథల పోటీల్లో బహుమతులు గెల్చుకోవడం ఆయన 'కలం'కారీ పనితనానికి నిదర్శనం.

త్రిపుర శ్రీకాకుళం జిల్లా వారు. భగవంతం కోసం, పాము వంటి కథలతో ప్రసిద్ధులు. స్త్రీచైతన్యం కోసం కలం పట్టిన రచయిత్రి మల్లీశ్వరి 'పితృత్వం' 'మమ్మల్నీ మారనివ్వండి', 'పోరాటం కథ' వంటి కథలు రాశారు. అగ్రశ్రేణి సాహిత్య విమర్శకులు, ప్రసిద్ధ రచయిత చందు సుబ్బారావు 'శిలాఖండం' పేరుతో కథల సంపుటిని వెలువరించారు. 'మంత్రాంగం' తదితర కథలతో కూడిన ఈ సంకలనం చదువరులకు చేరువయింది.

కవన శర్మ (కందుల వరాహ నరసింహ శర్మ) విశాఖ ప్రాంతానికి చెందినవారు. 'కవన వ్యంగ్యాలు' సంకలనం వెలువరించారు. అప్పాద్వేదుల అన్నపూర్ణ కూడా విశాఖకు చెందిన కథకురాలు. 'సెలయేరులో అల', 'అదెక్కడి ప్రేమ', 'అమ్మాయే పుట్టాలి' వంటి కథలు (పదిహేను) రాశారు. అర్నాద్ (దుంప హరనాథ్‌రెడ్డి) 'ఆర్నాద్ కథలు' పేరుతో 12 కథలు రాశారు. రాచకొండ ఉమా కుమార శాస్త్రి 'ఓ పోలీసోడి కథలో ఓ రోజు', 'చావు పుట్టుక' అనే కథలు రాశారు.

విశాఖకు ఉద్యోగం కోసం వచ్చి, మన్యం వీరుడు అల్లూరి ఉద్యమం ఆధారంగా మూడు కథలు, పప్పుశెట్టివారిపాలెం ప్రాంతంలో రంగురాళ్లతో ఛిద్రమైన జీవితాల మీద ఒక కథ రాసిన రచయిత గోపరాజు నారాయణరావు. ఇలా విశాఖ కథా సంపద ఇంతగా పెరగడానికి ఎందరో రచయితలు దోహదపడ్డారు. ఇంకా ఎందరో ఉన్నారు. అందులో కొందరు ... కావలిపాటి విజయలక్ష్మి, కాలిపు వీరభద్రుడు, ఇచ్ఛాపురపు జగన్నాథరావు, అయిల సోమయాజుల కామేశ్వరరావు, శిలుకోటి కాశీ విశ్వనాథం, కాశీ విశ్వేశ్వరరావు కొప్పల, పెరుమాళ్ల గణేశ్వరరావు, గజపతిరాజు చంద్రశేఖర్‌రాజు, గరిమెళ్ల నాగేశ్వరరావు, డీఏఎస్ నారాయణరావు, నూతి సూర్యప్రకాశరావు, మంత్రిప్రగడ లక్ష్మీశేషుబాబు, ముచ్చర్ల రజనీ శకుంతల, మరువాడ రాజేశ్వరరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, మోదు రాజేశ్వరరావు, శ్రీరంగం రాజేశ్వరరావు, పట్టిసపు రాధామహాలక్ష్మి, అడపా రామకృష్ణ, వసంతరావు రామకృష్ణరావు, అవసరాల రామకృష్ణారావు, భాగవతుల లలితా శర్మ, సూరిశెట్టి వసంత్‌కుమార్, షాహిన్, సింహగిరి పట్నాయక్, ఈరంకి సీతారామప్రసాద్ వంటి వారంతా విశాఖ ప్రాంతానికి చెందినవారు. ఇంకా హెబ్బలి హైమవతి, సౌరిస్, ద్వివేదుల సోమనాథశాస్త్రి, బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు, డాక్టర్ మానుకొండ సూర్యకుమారి, ఇవటూరి సురేశ్, సింహం, రౌతు సురేంద్రబాబు, ఉప్పల అప్పలరాజు, అక్కినపల్లి సుబ్బారావు, శ్రీరాజ్, సూరిశెట్టి సాంబశివరావు, బాబ్జీ, సోమయాజులు సంగమేశ్వర శర్మ (సస్యశ్రీ), పుచ్చల సరళాదేవి, సత్యవాడ సోదరీమణులు, అయ్యగారి సీతారత్నం, గరిమెళ్ల సరస్వతి, అయ్యగారి శ్రీనివాసరావు, జీవీఎన్ సత్యనారాయణ, పి.శ్రీదేవి, పుప్రేవు సత్యనారాయణ, బెహరా వెంకట సుబ్బారావు, అంగర వెంకట శివ ప్రసాదరావు, దూరి వెంకటరావు, వీరాజీ, వేమూరి వెంకట రమణమూర్తి, అంగర వెంకట కృష్ణారావు, విశ్వనాథ రమ, పూళ్ల విశ్వనాథస్వామి, పులిగడ్డ విశ్వనాథరావు, పంతుల విశ్వనాథరావు తదితరులు విశాఖ కథా చరితకు వన్నె తెచ్చారు.

అయితే, విశాఖకు సుదీర్ఘమైన, సుందరమైన సాగరతీరం ఉంది. సాగరమే జీవనంగా బతికే జాలారి సమాజం అపారంగా ఉంది. మరో పక్క ఓడల పరిశ్రమ, ఇతర పరిశ్రమలతో అలరారే పెద్ద పారిశ్రామికవాడ విశాఖపట్నం. అటవీ ప్రదేశమూ హెచ్చుగానే ఉంది. పైగా ఈ అటవీ ప్రాంతం ప్రశాంతంగా ఉన్నది తక్కువ కాలమే. పద్మనాభ యుద్ధం నాటి నుంచి విశాఖ మన్యం అలజళ్ల వరకూ మన ఏజన్సీ మీద ప్రభావం చూపించిన ఘటనలు చాలానే ఉన్నాయి. ఈ అలజడులలో ప్రముఖమైనది అల్లూరి శ్రీరామరాజు ఉద్యమం. ఈ అంశాలను ప్రతిబింబిస్తూ వచ్చిన కథలు తక్కువ. విశాఖ మన్యానికి సంబంధించి, శ్రీరామరాజు ఉద్యమం గురించి ప్రామాణికమైన రచన ఏదీ ఈ ప్రాంత వాసులు చేపట్టకపోవడం ఒక వైచిత్రి. జాలర్ల జీవితాన్ని చిత్రించే కథలు కూడా అరుదుగా వచ్చాయి. విశాఖ ఉక్కు కర్మాగారం స్థాపనకోసం జరిగిన ఉద్యమం, ప్లాంటు నిర్మాణం, నిర్వాసితుల వెతలు.. తదితర అంశాలు చిన్నవేం కావు. వీటి గురించి కూడా కథలు అక్కడక్కడే వచ్చాయి. ఇందువల్లే, ఈ మేరకు రచయితలు తమ ప్రతిభను చూపడానికి, తమ కలాలను పదునుపెట్టడానికి అవకాశం ఇంకా మిగిలే ఉంది.

మార్గ- దేశీ రీతుల మేలు కలయికగా తొలినాళ్ల నుంచీ వర్ధిల్లుతున్న మన కథని, అదే స్ఫూర్తితో జానపద, నాగరికశైలుల సమన్వయంతో మరింత ముందుకు తీసుకువెళ్లవలసిన అవసరం ఉంది. తతిమా భారతీయ భాషల, ప్రపంచ భాషల కథా సాహిత్యం కంటే మన కథను విశిష్టమైనదిగా, భిన్నమైనదిగా నిలబెట్టవల్సిన బాధ్యతా మనందరి మీదా ఉంది.

- డాక్టర్ చింతకింది శ్రీనివాసరావు
88971 47067

పుస్తకం

బాల సాహిత్యం .. ఓ 'మంచి' ప్రయత్నం

బాలసాహిత్యం ఎంత విరివిగా ఉంటే అంతగా బాలల మనో వికాసానికి దోహదపడుతుంది. ఒకప్పుడు చందమామ, బాలమిత్ర, బాలజ్యోతి వంటి బాలల పత్రికలు - పిల్లలను అలరించాయి. వారి విజ్ఞాన వికాస ప్రగతికి ఎంతో దోహదపడ్డాయి. తరువాతి కాలంలో వివిధ కారణాల వల్ల బాలసాహిత్యానికి ప్రోత్సాహం, ప్రాచుర్యం మందగించింది. అయితే, సుమారు 40 ఏళ్ల తర్వాత 'తానా- మంచి పుస్తకం' ఆధ్వర్యంలో బాలసాహిత్యం కోసం ఓ మంచి ప్రయత్నం జరిగింది. తానా 21వ మహాసభల సందర్భంగా చేపట్టిన ఈ కృషి ఫలించి, 11 బాలల నవలలు వెలుగులోకి వచ్చాయి. నేటి తెలుగు పిల్లల ప్రపంచానికి ఇదో అపురూప కానుకనే చెప్పాలి.



'బాల సాహిత్య రచనల పోటీ-2017'ను తానా-మంచి పుస్తకం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) 21వ మహాసభలను పురస్కరించుకుని ఈ పోటీల నిర్వహణకు ఓ ముందడుగు వేస్తే, మంచి పుస్తకం కూడా తన తోడ్పాటు అందించింది. 40 ఏళ్ల తర్వాత తెలుగు బాలసాహిత్యంలో నవలల పోటీని నిర్వహించడం మళ్లీ ఇప్పుడే. రెండు విభాగాలుగా ఈ పోటీలు జరిగాయి. ఒకటి సాహసం, మరొకటి సైన్స్ ఫిక్షన్. ఇవి రెండూ నేడున్న పరిస్థితుల్లో ఆహ్వానించాల్సిన అంశాలే. రచయితలు, సాహితీ వేత్తలు బాగా స్పందించారు. బాలసాహిత్యంలో ఉద్ధండులు మొదలుకొని ఔత్సాహికుల వరకూ ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇది బాలసాహిత్యం పట్ల నేటి రచయితల బాధ్యతకు, స్పందనకు నిదర్శనం. ప్రోత్సహించే వారుండాలేగానీ బాలసాహిత్య సృజనకు కొదవలేదని ఈ పోటీలు మరోసారి రుజువు చేశాయి.

ఎంపిక ఇలా ...

వందకుపైనే నవలలు పోటీకి వచ్చాయి. మొదటి వడపోతలో 68 రచనల్ని స్వీకరించారు. వాటిని పరిశీలించి, 22 రచనల్ని ఎంపిక చేశారు. వీటిని సాహిత్యంతో అనుబంధం ఉన్న ఇద్దరు న్యాయనిర్ణేతలు డాక్టర్ రావి శారద (విజయవాడ); ప్రముఖ కవి, రచయిత, పిల్లల రచనల వర్క్‌షాపు నిర్వాహకుడు డాక్టర్ ఆర్ సీతారామ్ (ఖమ్మం)- ఆసాంతం చదివి, వాటిల్లోంచి 11 రచనల్ని ఎంపిక చేశారు. నిర్వాహకులు ఒక్కొక్క రచనకు రూ.10 వేల నగదు పారితోషికం అందజేశారు. ఎంపికైన నవలల్ని 'మంచి పుస్తకం' పబ్లిషర్స్ పుస్తకాలుగా ప్రచురించి ఆగస్టు 8వ తేదీన శ్రీ పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించారు.

ఆకట్టుకునే ఇతివృత్తాలు

రచయితలందరూ స్థాయిల్లో, వయస్సుల్లో చాలా అంతరాలే ఉన్నాయి. నవలల ఇతివృత్తాలు వైవిధ్యభరితంగా ఉన్నాయి.

ఉనిమా లోకంలో.. ఈ సైన్స్ ఫిక్షన్ నవలను పిఎస్ఎస్ఎన్ మూర్తి అద్భుతంగా రచించారు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా, కట్టనూరు గ్రామానికి చెందినవారు. ఈ నవలలో తొమ్మిదేళ్ల రాజు మెరుపు తాకిడికి ఉనిమా లోకం చేరుకుంటాడు. అక్కడ విద్యుత్ ఇంజనీర్ అయిన తండ్రి రఘు పరిష్కరించలేని సమస్యను ఫైన్‌మాన్ అనే శాస్త్రవేత్త సహకారంతో పరిష్కరిస్తాడు.

ఈ-తరం కుర్రాడు.. ఈ నవలను నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించారు. దీనిలో రవి కిడ్నాప్‌కు గురవుతాడు. తనలాగే కిడ్నాప్‌కు గురైన మరో ముగ్గురి సహకారంతో అక్కడి నుంచి తప్పించుకునే వ్యూహరచన చేస్తాడు. వారు ఆ ముఠా బారి నుంచి ఎలా బయటపడ్డారన్నది ఈ కథ ఇతివృత్తం.

కిట్టూ సాహసం.. ఇది రావెళ్ల శ్రీనివాసరావు రచన. ఇందులో పల్లెటూరి పిల్లవాడి సాహసాన్ని తీసుకున్నారు. రైలు పట్టాలపై మేస్తున్న గేదెలను ప్రమాదం బారిన పడకుండా ఎలా కాపాడాడనేదే కథ సారాంశం.

కోతుల దాడి-శ్రీను తెలివి : ఈ నవలను వాసంతి అనే కలం పేరుతో కె.జ్యోతిర్మయి రాశారు. కోతుల బారిన పడి, వాటి నుంచి బయటపడటానికి సింధు, శ్రీను పన్నిన పన్నాగాలు.. వారి నిబ్బరం, సమయస్ఫూర్తి ఈ నవల సారాంశం.

గుడ్డేళ్లగుమ్మి మారెమ్మ : ఈ కథను భూపాల్ అద్భుతంగా మలిచారు. బాబాయి కూతురిని చంపిన పులిని, అడవి బిడ్డగా ఎదిగిన మారెమ్మ ఎలా హతమార్చిందో తెలియజెప్పే సాహస కథ ఇది.

నల్లమలలో... : దీని రచయిత శాఖమూరి శ్రీనివాసరావు. నల్లమలలో చైతూ- మిత్రబృందం పర్యటన, అనుభవాల సారాంశం ఈ కథ. చివరకు వారు ఇంటికి చేరిన తీరును అద్భుతంగా మలిచారు రచయిత.

బబచి తాతయ్య : ఈ రచన పుట్టగుంట సురేష్‌కుమార్ చేశారు. తాబేలు- తేజ మధ్య అనుబంధం అపురూపంగా అల్లుకొంటుంది. తేజకు తాబేలు ఏ విధంగా సహాయపడి, అతనిలోని భయాన్ని పోగొట్టిందో తెలియజేసే కథ ఇది.

మామయ్యతో కిట్టూ : దీని రచయిత కంచనపల్లి వేంకట కృష్ణారావు. దీవి యాత్రలో కిట్టూ మామయ్యతో పయనమవుతాడు. ఆ సందర్భంగా ఎదురైన అనుభవాలు సారాంశమేఈ కథ.

మేథ : సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సలీం రాశారు దీనిని. మనిషిలాంటి రోబోలను తయారుచేసే పరిశోధకుడు, ఆర్జీ అనే రియల్ గేమ్‌ని సృష్టిస్తాడు. దానిలో జరిగిన చిన్న పొరపాటు ఏవిధమైన మార్పులకు దారి తీస్తుంది? దానివల్ల కుటుంబమంతా ఎలా రిస్క్‌లో పడుతుంది? రోబో వల్ల కథ ఎలా సుఖాంతమవుతుందో ఈ నవల్లో రాశారు.

రామదండు : ఈ రచనను 'అనురాధ' అనే కలం పేరుతో రాసే గంటి సుజల చేశారు. అమ్మమ్మ ఊరు వెళ్లిన పిల్లలు ఆ ఊళ్లో దొంగల్ని ఎలా పట్టుకున్నారో హృద్యంగా రాశారు.

తానా - మంచి పుస్తకం సంయుక్తంగా చేసిన ఈ కృషి అభినందనీయం. వివిధ అంశాలపై సృజనాత్మకంగా వెల్లివిరిసిన ఈ చిట్టి నవలలను పిల్లల దరికి చేర్చటం, వారు చదివేలా ప్రోత్సహించటం ఇప్పుడు పెద్దలందరూ చేయాల్సిన పని. మంచి పనికి మంచి తోడ్పాటు జత కలిస్తేనే మరింత మంచి పెరగటానికి, మంచి పుస్తకం వర్ధిల్లటానికి అవకాశం ఏర్పడుతుంది.

- శాంతిశ్రీ
83338 18985

ప్రజాశక్తిమంతులు

ఈ పోటీల్లో ఇద్దరు ప్రజాశక్తి 'చిన్నారి' పేజీ రచయితలకు బహుమతులు వచ్చాయి. బాలసాహిత్యంలో డాక్టరేట్ పొందిన, సాహితీ స్రవంతి నగర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ రావెళ్ల శ్రీనివాసరావు అందులో ఒకరు. మరొకరు శాఖమూరి శ్రీనివాసరావు. ఆయన ప్రస్తుతం 'చిన్నారి'లో కామిక్ స్టోరీలను ప్రతిరోజూ అందిస్తున్నారు. ఈ పోటీల్లో రావెళ్ల రచన 'కిట్టూ సాహసం', శాఖమూరి రచన 'నల్లమలలో..' ఎంపికయ్యాయి. విజేతల్లో ఇద్దరు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు ఉన్నారు. వారు భూపాల్, సలీం.

షహీన్.. ఓ పోరాటగాథ

ఈ 11 నవలల్లో 'షహీన్' ప్రత్యేకమైన రచన. ఇది సమకాలీన సమస్యను ఇతివృత్తంగా చేసుకొని, అద్భుతంగా అల్లిన కథ. ఈ కథను పరిచయం చేస్తూ సీతారామ్.. 'రచయిత రవికిరణ్ సిరియా అంతర్యుద్ధంలో ఓ పాప ఎలాంటి కీలకపాత్ర పోషిస్తుందీ.. వివరించడం వాస్తవికంగా ఉంది.' అని అన్నారు. 'సిరియా అంతర్యుద్ధంలో ఆ తెల్లని పసిపిల్లలు.. ఎర్రని రక్తంలో ఓడుతుండటం చాలా బాధ కలిగిస్తుంది. తొమ్మిదేళ్ల బాలిక తన చుట్టూ జరుగుతున్న ప్రతి విషయాన్నీ ఫేస్‌బుక్‌లో నిత్యం పోస్టులు పెడ్తుంటుంది. పెద్దలకే బాంబు అన్నా, యుద్ధమన్నా భయం.. అలాంటిది ఆ పాప ఎంతో సాహసంగా ఇలాంటి ఎన్నో విషయాల్ని పోస్టు చేయడమే .. నా కథలో షహీన్ పాత్రకు స్ఫూర్తి. తొలిసారి రాసినా.. ఇంతమంది పెద్దల సరసన విజేతగా నిలవడం ఆనందంగా ఉంది' అంటూ భావోద్వేగంగా చెప్పారు అందరిలోకి చిన్నవాడైన రచయిత రవికిరణ్.

సంక్షుభిత స్వతంత్రం

మువ్వన్నెల జెండా నింగికెగరనంటోంది
స్వతంత్రమనేది ఒకరిచ్చేది కాదనీ
కులమతాల వివాదాలతో
కుహనా దేశభక్తి వీరంగాలతో
తనను వివస్త్రను చెయ్యొద్దంటూ
కుమిలి కుమిలి ఏడుస్తోంది !

విచ్చలవిడితనంతో
రాజకీయ ఉచ్చులతో
సమాజాన్ని కుళ్ళ బెడుతున్న
అసహన అమానుషాన్ని చూడలేకపోతున్న
పచ్చి బాలింత మన స్వతంత్ర జెండా!
పురిటి నొప్పుల పెనుగులాటలో
జీవం సంశయమైతే
కాలం తెచ్చిన కులమతాల రంగును
ఉమ్మ నీరుతో కలుపలేక
ఇంకా పచ్చి బాలింతగానే
మిగిలిపోయింది!

కుట్ర కుతంత్రాలను గర్భాన మోయలేక
ప్రసవ వేదనను భరించలేక
గర్భాన్నే దాచుకొని నిరంతర
సంక్షుభిత సంఘర్షణ కీల నా జాతీయ పతాక!

- వైష్ణవి శ్రీ
8977237345

ఏడు పదుల స్వాతంత్ర్యం ఏడ్చింది!

డెబ్భై ఏళ్ళ స్వాతంత్ర్యం
బోరుబోరున విలపిస్తోంది
ఊపిరందని చిన్నారులతోపాటు
తానూ చచ్చిపోయానంది
కలలోనూ లేనంది

ఈ ఏడు దశాబ్దాల్లో
ఎన్ని రంగులు మార్చినా
ఎన్ని ఊసులు చెప్పినా
తా చేసింది శూన్యమని
తానే తెలుసుకుంది
కన్నీటి సాక్ష్యంగా ...

సార్వభౌమత్వానికి సామ్యవాదం జోడించినా
అందరికీ దూరమైన సమానత్వం నవ్విందని
అభినవ దేవళాల శాస్త్రీయత పక్కనెట్టి
మూఢాచారాల మూర్ఖత్వం ముసిరిందని
పదబంధనాల్లోని స్వేచ్ఛ నలుగుతూ ఏడ్చింది

విచ్చలవిడి స్వాముల వింతలను
మత్తులో తూగుతున్న యువతను
మత బంధనంతో ఉరేసుకున్న విద్యార్థిని
డబ్బున్నోడి కొమ్ము కాస్తున్న నాయకుణ్ణి
చూసి తనని తాను రక్షించుకోలేని
స్వేచ్ఛాధీన దీనంగా నవ్వింది

మాటలూ చేతల మధ్య
అంతరాన్ని చవిచూసిన
నా ఏడుపదుల స్వాతంత్ర్యం
పరాధీనగానే ఉన్నానని
కన్నీళ్ళు కార్చింది
కళ తప్పి నవ్వింది

- జంధ్యాల రఘుబాబు
9849753298

రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి సవ్వడి పేజీలో ప్రచురణార్థం రచయిత (త్రు)ల నుంచి రచనలు ఆహ్వానిస్తున్నాం. ప్రగతిశీల సాహిత్యంపై వ్యాసాలూ, సమీక్షలు; సమకాలీన సాహిత్య ధోర ణులపై విశ్లేషణలూ రాసి పంపవచ్చు. కళారంగంపైనా, నాటకాలపైనా విశ్లేషణలు రాయవచ్చు. రచనలను ఈమెయిల్లో కూడా పంపించవచ్చు. కాపీలను పేజీ మేకర్ ఫైలుతో పాటు పిడిఎఫ్‌గా మార్చి పంపాలి.

email id : **prajasavvadi@gmail.com**

పెద్ద పెద్ద కళ్లు.. నిండైన విగ్రహం.. గల గల పారే నవ్వు... ఆ రోజుల్లో నవ్వుల రాణిగా పేరొందిన నటి ఆమె. తల్లి కేరళ కుట్టి.. తండ్రి ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుకు చెందిన వారు. దక్షిణాది భాషల్లోనే కాకుండా హిందీతో కలిపి సుమారు 400కు పైగా చిత్రాల్లో ఆమె నటించారు. ఎన్టీఆర్ నటించి, దర్శకత్వం వహించిన 'శ్రీకృష్ణపాండవీయం' ఆమె తొలి తెలుగు చిత్రం. ఆ తర్వాత ఎన్నో తెలుగు సినిమాల్లో తనదైన పాత్రలు పోషించి, అన్ని వయసుల ప్రేక్షకుల్ని మెప్పించారు. దేవతల పాత్రల్లో ఆమె ఒదిగిపోయేవారు. ఆ పాత్రల్లో ఆమె ప్రసన్నతను, ప్రచండతను.. విలయతాండవాన్ని నూటికి నూరుశాతం హావభావాలతో ప్రదర్శించగల గొప్ప నటి. ఎలాంటి పాత్ర ఇచ్చినా తగిన న్యాయం చేయగల కళాకారిణి. ఆమె ఎవరో కాదు.. ఒకప్పుడు ఎన్టీఆర్ హిట్ పెయిర్‌గా అలరించిన కె.ఆర్. విజయ. అసలు పేరు దేవనాయకి.. అయితే, అమ్మానాన్నల పేర్లలోని మొదటి అక్షరాలు కె.ఆర్.కు విజయం సాధించాలనే తలంపుతో 'కె.ఆర్. విజయ' అని మార్చేశారు. పేరుకు తగ్గట్టుగానే సినీరంగంలో విజయప్రస్థానం కొనసాగించిన కె.ఆర్. విజయ 'జీవన' విశేషాలు ఆమె మాటల్లోనే..





అమ్మా నాన్నల మొదటి అక్షరాలే..

కె.ఆర్.విజయ



భర్త వేలాయుధన్‌తో

పుట్టింది కేరళలోని ట్రావన్‌కూర్‌లో అయినా.. పెరిగింది మాత్రం చిత్తూరులోనే. నాన్న రామచంద్రన్, అమ్మ కల్యాణి. ఆరుగురి సంతానంలో నేనే పెద్దదాన్ని. నాన్న ఆర్మీలో పనిచేసేవారు. నాన్నది చిత్తూరు. అమ్మది కేరళలోని త్రిస్సూర్. అమ్మానాన్న ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. మా సొంతిల్లు చిత్తూరులోనే ఉండేది. ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్యగారిల్లూ.. మా ఇల్లూ పక్కపక్కనే. ఆయన మా కుటుంబంతో ఎంతో ఆప్యాయంగా, కలిసిపోయేవారు. నాకు ఊహ తెలిసినప్పుడు నాగయ్యగారు నన్ను ఎత్తుకుని, ఆడించడం బాగా గుర్తు.

పేరు మారిందిలా..

మా అమ్మానాన్న నాకు పెట్టిన పేరు 'దేవనాయకి'. పేరు ఎలా మారిందంటే.. ప్రముఖ తమిళ దర్శకుడు, (ప్రముఖ నటి రాధిక తండ్రి) ఎంఆర్ రాధగారు కె.ఆర్.విజయగా పేరు మార్చేశారు. ఆయన సినిమా షూటింగ్ ప్రారంభోత్సవంలో 'నీ పేరేంటమ్మా?' అని అడిగారు. 'దేవనాయకి' అని చెప్పా. "అదేం పేరమ్మా.. ముసలోళ్ల పేరులాగా? నీ పేరు నేను మారుస్తానుండు.. అంటూ.. నువ్వు ఒప్పుకుంటావుగా?" అని అడిగారు. 'సరే' అన్నాను. "మీ అమ్మ పేరులో మొదటి అక్షరం కె... నాన్న పేరులో మొదటి అక్షరం ఆర్... ఈ రెండూ కలిసేలా.. నీ పేరు పెడతాను" అన్నారు. "నీ చిత్రాలన్నీ విజయవంతం కావాలి" అంటూ "నీపేరు కె.ఆర్.విజయ. సరేనా?" అని అన్నారు. అక్కడున్న అందరూ అంగీకరించారు. అలా ఆయన ఆశీస్సులతో నా సినీ కెరీర్‌లో విజయం సాధించాను.

చిన్నప్పుడే..

నేను మా తాతయ్య, తాతమ్మల దగ్గరే పెరిగాను. ఆడపిల్లల పట్ల వాళ్లు చాలా స్ట్రిక్ట్. నన్ను ఒంటరిగా బయటికీ పంపేవారు కాదు. నేను సినిమాల్లో నటించడం మా తాతమ్మకి అస్సలు ఇష్టం లేదు. నాన్నకి మాత్రం చాలా ఇష్టం. పదో తరగతిలో ఉన్నప్పుడే నాకు సినిమాల్లో అవకాశాలు రావడం మొదలైంది. దాంతో చదువు మధ్యలోనే ఆపేసి, సినిమాల్లోకి వచ్చేశా. తమిళ చిత్రంతో 1963లో సినీరంగ ప్రవేశం చేశా. నా మొదటి చిత్రం 'కర్పగం'. ఇది పూర్తి కుటుంబకథా చిత్రం. ఈ చిత్రాన్ని కె.ఎస్.గోపాలకృష్ణన్‌గారు నిర్మిస్తే, జెమినీ గణేశన్, సావిత్రి, ఎస్వీ రంగారావు, ముత్తురామన్ తదితరులు నటించారు. ఈ చిత్రంలో గమ్మత్తేమంటే నన్ను ఎత్తుకుని ఆడించిన నాగయ్యగారు కలెక్టర్ పాత్ర వేయడం. ఈ చిత్రం సూపర్‌హిట్ అవ్వడంతో నా దశ తిరిగింది. తెలుగులో ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ గారితో 'తోడు-నీడ'గా ఆదుర్తి సుబ్బారావుగారు రీమేక్ చేశారు.

శ్రీకృష్ణపాండవీయంతోనే

తెలుగులో నా తొలిచిత్రం 'శ్రీకృష్ణపాండవీయం'. ఎన్టీఆర్ నన్ను ప్రత్యేకంగా పిలిచి రుక్మిణి పాత్ర నువ్వే చెయ్యాలన్నారు. నాకు తెలుగు సరిగా రాదంటే.. "అవన్నీ నేను చూసుకుంటా.. ఆ పాత్రలో నువ్వయితేనే బాగా రాణిస్తావు" అని నచ్చజెప్పారు. అన్నట్టుగానే తర్వాత నాకు ఎన్ని ఆఫర్లో. జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాలన్నింటిలోనో నటించా. ఎన్టీఆర్ క్రమశిక్షణ, మంచి మనస్సు పరిశ్రమలో అందరికీ తెలుసు. 'పరమానందయ్య శిష్యుల కథ, లక్ష్మీకటాక్షం, ఏకవీర, భలేతమ్ముడు, మేలుకొలుపు..' ఇలా ఎన్టీఆర్‌తో ఎన్నో చిత్రాలు చేశా. 'భలే తమ్ముడు' ఎన్టీఆర్‌తో చేసిన సూపర్‌హిట్ సాంఘిక చిత్రమైంది. ఈ షూటింగ్‌కు వచ్చినప్పుడు బాలకృష్ణను చూశా. అప్పుడు చాలా చిన్నపిల్లోడు. తర్వాత 'భైరవద్వీపం, సింహా, శ్రీరామరాజ్యం' వంటి చిత్రాల్లో బాలకృష్ణకు తల్లిగా నటించా. ఇలా తండ్రీకొడుకులతో కలిసి నటించడం నాకు చాలా సంతోషం కలిగించింది.

అక్కినేనితో 'సిపాయి చిన్నయ్య'

అక్కినేనితో 1969లో డి.రామానాయుడు నిర్మించిన 'సిపాయి చిన్నయ్య'లో నటించా. నాతో భారతి కూడా నటించింది. ముత్తురామన్‌తో 'భలేపాప' చిత్రం కూడా మరవలేనిది. 'సూత్రధారులు, ఇద్దరూ ఇద్దరే, రాజావిక్రమార్క, జగన్మాత, విశ్వనాథనాయకుడు, శ్రీదేవి, శ్రీవినాయక విజయం, మా మంచి అక్కయ్య, దుర్గ, సింహ, శ్రీరామరాజ్యం, 100% లవ్' వంటి చిత్రాల్లోనూ నటించా. ఇలా దక్షిణాదిలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లో నటించాను. తెలుగులో సిఎస్‌రావు, పుల్లయ్య, బి.విఠలాచార్య, పుండరీకాక్షయ్య, శోభన్‌బాబు, కృష్ణంరాజు, ఎంజి రామచంద్రన్, శివాజీగణేశన్, జయశంకర్, పద్మిని, వైజయంతిమాల, బి.సరోజాదేవి, అంజలి వంటి వారందరితో కలిసి నటించడం నా అదృష్టం. నాకు నాట్యం రాదు. నేర్చుకోలేదు కూడా. అయితే నృత్యదర్శకులు చెప్పినట్లు చేసేదాన్ని. బాగుందంటే ఆ క్రెడిట్ నృత్యదర్శకులదే. నా మొదటి చిత్రం 'కర్పగం', వందో చిత్రం 'నత్తయిల్ ముత్తు' చెప్పుకోదగ్గ చిత్రాలు. ఈ రెండూ శతదినోత్సవ చిత్రాలే. ప్రభుత్వాల నుండి ఎన్నో ప్రశంసలు, అవార్డులు పొందాను. నా విజయానికి గోపాలకృష్ణన్‌గారు, మావారు వేలాయుధన్‌గారు ముఖ్యకారకులు. నాటి తరం వారి మనసులు బంగారమే. మమతానురాగాలతో కలిసిమెలిసి ఉండేవాళ్లం. కాలం మారింది. నటులూ కాలానుగుణంగా కొత్త టెక్నాలజీతో ప్రయోగాలు చేస్తున్నారు. మావి మావే.. ఇప్పటివి ఇప్పటివే.. అప్పటివీ తీసిపోలేని చిత్రాలే అంటాను నేను..!

బుల్లి తెరపై

సినిమాల్లోనే కాకుండా టీవీ సీరియల్స్‌లో నటించాను. "మడిసారుమామి, ఆదిపరాశక్తి, కుడుంబం, రాజరాజేశ్వరి, ఆనందం, శ్రీకృష్ణలీల, సత్యం శివం సుందరం.." వంటి తమిళ, మలయాళ సీరియల్స్‌లో నటించాను. అంతేకాదు, వాటిని ప్రొడ్యూస్ చేయడం, దర్శకత్వం వహించడం కూడా చేశా. ఇది గొప్ప సాహసమే అని చెప్పాలి. ఇవన్నీ ప్రేక్షకాదరణ పొందడం నాకు చాలా ఆనందం కలిగించింది.

- ఎస్.ఎస్

మాదీ ప్రేమవివాహమే!

మా అమ్మానాన్నది ప్రేమవివాహం.. మాదీ ప్రేమవివాహమే. మావారి పేరు వేలాయుధన్. మాకో కూతురు.. పేరు హేమలత. అల్లుడు వ్యాపారవేత్త. మా ఆయన నిర్మాత, దర్శకులు. దాదాపు అన్ని భాషలలోనూ 56 చిత్రాలు ప్రొడ్యూస్ చేశారు. నిర్మాతగా ఉన్నప్పుడే ఆయన నాకు పరిచయం. అది ప్రేమగా మారింది. ఆ విధంగా పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాం. మా పెళ్లికి సినీరంగ ప్రముఖులెందరో హాజరయ్యారు. బాలకృష్ణ నటించిన 'అన్నదమ్ముల అనుబంధం, మా ఇంటి ఇలవేల్పు..' ఇలా దాదాపు 15 తెలుగు చిత్రాల్ని ఈయనే నిర్మించారు. శివాజీ గణేశన్, ఎన్టీఆర్ చిత్రాలకు ఆయనే ప్రొడ్యూసర్. అక్కినేనిగారు మా వారికి మంచిమిత్రులు. 'సిపాయి చిన్నయ్య' నిర్మాణ సమయంలోనే వారికి స్నేహం ఏర్పడింది. ఆ విధంగా మేము ఫ్యామిలీ ఫ్రెండ్స్ కావడం నాకు చాలా సంతోషం కలిగించిన అంశం. ఈ రంగంలోనే కాకుండా ఆయన ఆరితేరిన వ్యాపారవేత్త కూడా. షిప్పింగ్ ఎగుమతి, దిగుమతి వ్యాపారం, సుదర్శన్ చిట్‌ఫండ్స్ తెలుగు రాష్ట్రాల్లో ఎంతో పేరు సంపాదించింది. అదేవిధంగా రాజమండ్రిలో బ్రిక్స్ ఫ్యాక్టరీ స్వయంగా చూసుకునే వారు. గత ఏడాదే ఆయన మాకు దూరమయ్యారు. ఆయన లేని లోటు ఒకటైతే, ఆయన చూసే బాధ్యతలన్నీ ఇప్పుడు నేను చూడాల్సి వస్తోంది. దీనివల్ల సినీ రంగానికి దూరంగా ఉన్నా.



కూతరు హేమలతతో కె.ఆర్.విజయ



జీవన చిత్రం

జీవనసౌరభం

బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్నీ స్వీకరించండి, బలహీనపరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండి..



మీ కోసం

కొబ్బరి నూనెలో నిమ్మరసం కలిపి తలకి పట్టిస్తే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.



అవిసెలతో మెరిసే గోళ్లు

కొన్ని పోషకాల లోపంవల్ల జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇదే గోళ్లకూ వర్తిస్తుంది. అవి పొడిబారినట్లు ఉన్నా, బీటలు వారినా..కొన్ని రకాల పోషకాలు లోపించాయని గుర్తించాలి. ఏంటా సమస్యలంటే..

గోళ్లు పెళుసుబారి, వాటి నుంచి పొట్టులా రాలుతోందా.. అయితే ఎసెన్షియల్ ఫ్యాటీయాసిడ్ల లోపం ఉందని అర్థం. కాబట్టి మనం తీసుకునే ఆహారంలో ఆ ఫ్యాటీయాసిడ్లు అందేలా చూసుకోవాలి. అందుకోసం అవిసె గింజల్ని ఏదో ఒక రూపంలో తీసుకోవడం మొదలుపెడితే మంచిది. సమస్య చాలా తక్కువ సమయంలోనే అదుపులోకి వచ్చేస్తుంది.

✧ కొందరికి గోళ్లు గరుకుగా ఉండి, నిర్జీవంగా కనిపిస్తుంటాయి. ఇలాంటివారు కెరోటిన్ అనే పోషకం అందేలా చూసుకోవాలి. ఈ పోషకం గోళ్లను మృదువుగా, ఆరోగ్యంగా, బలంగా మారుస్తుంది. అందుకోసం మాంసాహారాన్ని ఎంచుకోవాలి. లేదంటే ప్రొటీన్లు ఎక్కువగా ఉండే సోయాబీన్స్, పాలూ, పాల పదార్థాలు తీసుకోవాలి.

✧ ఇనుము లోపం ఉంటే గనుక గోళ్లు బలహీనంగా మారతాయి. త్వరగా విరిగిపోతుంటాయి కూడా. ఆ సమస్యను తగ్గించాలంటే ఇనుము శాతం సమృద్ధిగా ఉండే గుడ్లూ, పాలకూర, ఖర్జూరాల్లాంటివి తీసుకోవాలి. అయితే వీటితోపాటూ సి విటమిన్‌నీ తీసుకోగలిగితే శరీరానికి ఇనుము సులువుగా అందుతుంది. అందుకోసం నిమ్మజాతి పండ్లూ, టమాటాలూ, క్యాప్సికంలాంటి వాటిని ఎంచుకోవాలి. ✦

క్యారెట్ ఫేస్‌ప్యాక్

ఆరోగ్యానికి ముఖ్యంగా కళ్లకు ఎంతో మేలుచేసే క్యారెట్లు చర్మానికి కూడా బాగా ఉపయోగపడతాయి. క్యారెట్స్‌తో ఫేస్‌ప్యాక్స్ ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.

✧ బౌల్‌లో క్యారెట్ జ్యూస్, ఎగ్‌వైట్‌ను టేబుల్ స్పూన్ చొప్పున తీసుకోవాలి. అందులోకి స్పూన్ ఆలివ్ ఆయిల్ వేసి, టేబుల్ స్పూన్ పెరుగును కలపాలి. అన్నీ మిక్స్ చేసి ఆ మిశ్రమాన్ని ముఖం, మెడకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాల తర్వాత ఫేస్‌ప్యాక్‌ను గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేయటం వల్ల చర్మంపై ఉండే మృతకణాలు తొలగిపోతాయి. ముఖచర్మం ఆరోగ్యవంతంగా కనిపిస్తుంది.

✧ క్యారెట్‌తో పాటు బొప్పాయిని ఒకే పరిమాణంలో తీసుకుని పేస్ట్ చేసుకోవాలి. ఇందులోకి తగినన్ని పాలుపోసి, ఆ రెండింటి పేస్ట్‌లను బాగా కలపాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి పట్టించి, పదిహేను నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోవాలి. ఇలా చేస్తుంటే మంచి ఫలితం కలుగుతుంది.

✧ పొడిచర్మం ఉండేవారు ఒక బౌల్‌లో టేబుల్‌స్పూన్ క్యారెట్ జ్యూస్, టీ స్పూన్ తేనెను కలిపి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఫేస్‌కు అప్లై చేసి ఇరవై నిమిషాల తర్వాత శుభ్రపరచుకోవాలి. ఇలా వారానికి మూడుసార్లు ఈ ఫేస్‌ప్యాక్ ముఖానికి అప్లై చేస్తే ముఖవర్చస్సు వస్తుంది.

✧ తగు పరిమాణంలో క్యారెట్ పేస్ట్‌ను బౌల్‌లో తీసుకుని అందులోకి టేబుల్ స్పూన్ పెరుగు వేసి కలపాలి. ఒక ఫుల్ టీ స్పూన్ శనగపిండి, రెండువేళ్లకు వచ్చినంత పసుపును మూడుసార్లు తీసుకోవాలి. వీటన్నింటిని బాగా కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. ఇలా తరచుగా ఈ ఫేస్‌ప్యాక్‌ను వాడుతుంటే ముఖచర్మంలో కాంతి కనిపిస్తుంది.

✧ ఒక బౌల్‌లో క్యారెట్ జ్యూస్, అరటిగుజ్జు, ఎగ్‌వైట్‌ను రెండు టేబుల్ స్పూన్ల చొప్పున తీసుకుని అందులోకి నాలుగు చుక్కల నిమ్మరసం వేసి బాగా మిక్స్ చేయాలి. ఈ ఫేస్‌ప్యాక్‌ను వాడితే ఆశించిన ఫలితం కనిపిస్తుంది. ✦





పాలిటీ టెర్మినాలజీ

గ్రూప్స్ ప్రత్యేకం





కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు.
సెల్ : 9440262072

1. ఆయారామ్, గయారామ్ : పార్టీ ఫిరాయింపులు జరిపే వారికి ముద్దుపేరు. వీరిరువురూ హర్యానాలో 1967-68లో తరచూ పార్టీలు మారడం వల్ల ఆ విధంగా పిలుస్తున్నారు.

2. ఫ్లోర్‌క్రాసింగ్ : ప్రతిపక్షాలకు చెందిన సభ్యులు అధికార పక్షంలోకి మారడం.

3. కోరమ్ : సభ జరగడానికి కావాల్సిన కనీస సభ్యుల సంఖ్య. భారతదేశ చట్ట సభలలో కోరమ్ 1/10వ వంతుగా నిర్ణయించారు. **ఉదా :** లోక్‌సభలో కోరమ్ 55 మంది సభ్యులుకాగా, రాజ్యసభలో 25 మంది సభ్యులు.

4. లేమ్‌డక్ సెషన్ : బ్రిటన్ సామాన్యుల సభ (హైస్ ఆఫ్ కామన్స్) ఎన్నికలు జరిగిన తరువాత అంతకుముందు సభసభ్యులుగా ఉండి ప్రస్తుత సభకు ఎన్నిక కానివారిని, నూతనంగా ఎన్నికైన సభ్యులను కలిపి చిట్టచివరి సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. దీనిని లేమ్‌డక్ సెషన్ అంటారు. ఈ విధానం భారతదేశంలో అమలులో లేదు.

5. విజేతృభాగ నిర్ణయ పద్ధతి : ఈ పద్ధతి అమెరికాలో అమలులో ఉండేది. ఎన్నికలలో గెలిచిన పార్టీ తన మద్దతుదారులను ప్రభుత్వ ఉద్యోగాలలో నియమించడాన్ని విజేతృభాగ నిర్ణయ పద్ధతి అంటారు. 1828లో ఆండ్రూజాక్సన్ అనే అమెరికా అధ్యక్షుడు ఈ పద్ధతిని ప్రవేశపెట్టాడు. 1887లో ఉడ్రోవిల్సన్ ఈ పద్ధతిని రద్దు చేశారు.

6. అధికార పృథక్కరణ సిద్ధాంతం : ఈ సిద్ధాంతాన్ని మాంటెస్క్యూ ప్రతిపాదించాడు. ప్రభుత్వ అంగాలైన కార్యనిర్వాహక వర్గం, శాసననిర్మాణశాఖ, న్యాయశాఖల మధ్య సంబంధాన్ని ఈ సిద్ధాంతం వివరిస్తుంది.

7. నిరోధ సమతౌల్యాలు (చెక్స్ అండ్ బ్యాలెన్సెస్) : అమెరికా రాజ్యాంగం ఈ సిద్ధాంతంపై ఆధారపడింది. ప్రభుత్వ అంగాలు మూడు ఒకదానిని మరొకటి నిరోధించుకుంటూ సమతుల్యంతో పనిచేస్తాయి.

8. షాడో క్యాబినెట్ : బ్రిటన్ దేశంలో అమలులో ఉన్నది. బ్రిటన్‌లో ప్రతిపక్షంలో ఉన్న పార్టీ కూడా ఒక ఛాయా మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసి మంత్రిత్వ శాఖలను తన సభ్యులకు అప్పగిస్తుంది. ఆయా శాఖలలో వారు అనుభవం పొందుతారు.

9. హంగ్ పార్లమెంట్ : లోక్‌సభ సాధారణ ఎన్నికలలో ఏ రాజకీయ పార్టీకీ సంపూర్ణ మెజారిటీ రాని పరిస్థితిని హంగ్ పార్లమెంట్ అంటారు.

10. రీ కాల్ : స్విట్జర్లాండ్‌లో అమలులో ఉన్న ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులలో ఇది ఒకటి. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు సక్రమంగా పనిచేయని పక్షంలో ప్రజలు వారిని వెనుకకు పిలుస్తారు.

11. న్యాయ సమీక్షాధికారం : కార్యనిర్వాహక వర్గం, శాసన నిర్మాణశాఖ రూపొందించిన చట్టాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే (అల్ట్రావైరెస్) అవి చెల్లవు (నల్ అండ్ వాయిడ్) అని న్యాయవ్యవస్థ ప్రకటించడం. 1803లో మాడిసన్ వార్సెస్ మార్బురీ కేసులో అమెరికన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ న్యాయసమీక్షాధికారాన్ని ప్రకటించాడు.

12. శ్వేతపత్రం : ప్రభుత్వం ఒక విషయానికి సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా, అధికారపూర్వకంగా ప్రకటించే పత్రాలు.

13. ఫోర్త్ ఎస్టేట్ : పత్రికా రంగాన్ని, మీడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరిస్తారు. బ్రిటిష్ పార్లమెంట్‌సభ్యుడు ఎడ్‌బర్గ్ మొదటిసారిగా ఈ పదాన్ని ఉపయోగించాడు.

14. ఫిఫ్త్ ఎస్టేట్ : ఇటీవల కాలంలో 'సోషల్ మీడియాను' ఫిఫ్త్ ఎస్టేట్‌గా వ్యవహరిస్తున్నారు.

15. సుమోటో : న్యాయవ్యవస్థ తనంతట తానుగా, స్వయం ప్రేరితంగా, పిటిషన్ అవసరం లేకుండా ఒక అంశాన్ని విచారణకు స్వీకరించడం.

16. గెర్రిమాండరింగ్ : నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను తమకు అనుకూలంగా అధికారంలో ఉన్న పార్టీ చేపట్టడాన్ని గెర్రిమాండరింగ్ అంటారు.

17. ఫిల్‌బస్టరింగ్ : శాసనభలు, చట్టసభలు సమావేశాలు సరిగా జరగకుండా ఉండటానికి సభ్యులు సుదీర్ఘమైన ఉపన్యాసాలు చేయడం, అమెరికాలో ఫిల్‌బస్టరింగ్ అనే సెనేటర్ ఈ పద్ధతిని ఉపయోగించాడు.

18. వాయిదా తీర్మానం (ఎడ్‌జర్న్‌మెంట్ మోషన్) : అత్యవసర ప్రజాసంబంధిత విషయంపై చర్చించడానికి ఈ తీర్మానం ఉపయోగపడుతుంది. సభ్యుడు ఈ తీర్మానం ప్రవేశపెట్టదలిస్తే స్పీకర్‌కు ఆరోజు ఉదయం 10 గంటలులోగా లిఖితపూర్వక తీర్మానాన్ని అందజేయాలి. దీనికి 50 మంది సభ్యుల మద్దతు అవసరం.

19. అడ్వకేట్ జనరల్ : రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ న్యాయ సలహాదారుడుని. 167వ నిబంధన ప్రకారం గవర్నర్‌చేత నియమిస్తారు.

20. అటార్నీ జనరల్ : భారత ప్రభుత్వ ప్రథమ న్యాయ సలహాదారుడు. 76వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి ద్వారా నియమిస్తారు.

21. కొలీజియం : న్యాయమూర్తుల నియామకానికి సిఫార్సులు చేయడానికి భారతదేశంలో కొలీజియం ఏర్పడింది. దీనిలో ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ఉంటారు.

22. వార్షిక ఆర్థిక పట్టిక (యాన్యువల్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్) : భారతదేశంలో రాజ్యాంగంలో 112వ నిబంధన ప్రకారం బడ్జెట్‌ను వార్షిక ఆర్థిక పట్టిక అని పిలుస్తారు.

23. ఉపకల్పనా బిల్లు (అప్రాప్రియేషన్ బిల్) : బడ్జెట్‌పై చర్చ సందర్భంలో వివిధ శాఖలన్నీ చేసిన గ్రాంట్ల కోసం డిమాండ్స్, అన్నింటికీ కలిపి ఉపకల్పనా బిల్లుగా ప్రతిపాదిస్తారు.

24. సంకీర్ణం (కొయాలియేషన్) : ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రానప్పుడు భిన్నమైన పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం.

25. సమిష్టి బాధ్యత : పార్లమెంటరీ విధానంలో మంత్రిమండలి సమిష్టిగాను, వ్యక్తిగతంగానూ ప్రజలు ఎన్నుకున్న సభకు బాధ్యత వహించాలి.

26. సంఘటిత నిధి : భారత ప్రభుత్వానికి వచ్చే ఆదాయాలన్నింటినీ 266వ నిబంధన ప్రకారం ఏర్పడిన సంఘటిత నిధికి జమ కడతారు.

27. ఆగంతక నిధి : ఊహించని వ్యయాలను భరించడానికి రాష్ట్రపతి అధీనంలో 267వ నిబంధన ప్రకారం ఆగంతక నిధిని ఏర్పాటు చేశారు.

28. కోత తీర్మానం : పార్లమెంటరీ విధానంలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సభ్యులు బడ్జెట్ ప్రతిపాదనల పట్ల నిరసన తెలపడానికి కోత తీర్మానాలు ప్రతిపాదించవచ్చు.

29. అత్యవసర పరిస్థితి : రాజ్యాంగంలో 352వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి ఆంతరంగిక, బాహ్య అత్యవసర పరిస్థితిని విధించవచ్చు.

30. రాష్ట్రపతిపాలన : రాజ్యాంగంలో 356వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలన విధించవచ్చు. ఇప్పటికి సుమారు 125 సార్లు విధించారు.

31. ఆర్థిక అత్యవసర పరిస్థితి : దేశంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు రాష్ట్రపతి దేశంలో ఆర్థిక అత్యవసర పరిస్థితిని 360వ నిబంధన ప్రకారం విధించవచ్చు. ఇప్పటివరకూ విధించలేదు.

32. ఆర్థిక బిల్లు : బడ్జెట్ ఆమోదించే చివరి దశలో ఆర్థికమంత్రి పన్నుల ప్రతిపాదనలన్నింటినీ కలిపి ఆర్థిక బిల్లుగా ప్రతిపాదిస్తాడు.

33. ఆర్థిక సంఘం : కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ కోసం రాష్ట్రపతి 280వ నిబంధన ప్రకారం ఐదేళ్లకు ఒకసారి ఆర్థిక సంఘాన్ని నియమిస్తాడు.

34. గిలిటెనింగ్ : బడ్జెట్‌పై చర్చ సందర్భంగా గ్రాంట్ల కోసం డిమాండ్ చర్చ జరుగుతున్నప్పుడు, కేటాయించిన సమయం అయిపోయిన తర్వాత, మిగిలిపోయిన డిమాండ్లనన్నింటినీ ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించడాన్ని గిలిటెనింగ్ అంటారు.

35. హెబియస్ కార్పస్ : అక్రమంగా నిర్బంధించిన వ్యక్తిని న్యాయస్థానంలో హాజరుపరచమని సుప్రీంకోర్టు 32వ **నిబంధన ప్రకారం, హైకోర్టు 226వ నిబంధన ప్రకారం జారీ చేసే రిట్.**

36. అంతర్‌రాష్ట్ర మండలి : కేంద్ర-రాష్ట్ర వివాదాలు, అంతర్‌రాష్ట్ర వివాదాల పరిష్కారానికి 263వ నిబంధన ప్రకారం ఏర్పడినది.

37. ఆర్డినెన్స్ : పార్లమెంట్ సమావేశాలలో లేనప్పుడు అత్యవసర విషయాలపై రాష్ట్రపతి ద్వారా ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయిస్తుంది.

38. నిర్ణాయకపు ఓటు : ఒక బిల్లుపై అధికారపక్షానికి, ప్రతిపక్షానికి సమానంగా ఓట్లు వచ్చినప్పుడు స్పీకర్ నిర్ణాయకపు ఓటును వినియోగించవచ్చు.

39. జీరో అవర్ : ప్రశ్నోత్తరాల సమయం తరువాత సభాకార్యక్రమాలు మొదలయ్యే ముందు కాలాన్ని జీరో అవర్ అంటారు. 1962 నుంచి భారత పార్లమెంట్‌లో ఈ పద్ధతి అమలులో ఉంది. ఈ సమయంలో ముందస్తు నోటీసు లేకుండా ఏ అంశంపైనైనా వివరణ కోరవచ్చు.

40. ఎడ్‌జర్న్‌సైన్‌డై (నిరవధిక వాయిదా) : లోక్‌సభ సమావేశాలు నిర్ణయించిన కాల వ్యవధిలో పూర్తి అయిన తరువాత స్పీకర్ సభను నివరధిక వాయిదా వేస్తాడు.

41. ప్రోరోగ్ : సభ సమావేశాలను ముగింపు చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయడాన్ని ప్రోరోగ్ అంటారు.

42. ఆపద్ధర్మ ప్రభుత్వం : అధికారంలో ఉన్న ప్రభుత్వం రాజీనామా చేసినప్పుడు ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకూ కొనసాగే ప్రభుత్వాన్ని ఆపద్ధర్మ ప్రభుత్వం అంటారు.

43. పృథకరించు సిద్ధాంతం (డాక్ట్రిన్ ఆఫ్ సెవెరబిలిటీ) : ఒక చట్టంలోని కొన్ని నిబంధనలు రాజ్యాంగానికి భంగకరమని న్యాయస్థానం ప్రకటించినప్పుడు, ఆ నిబంధనలను రాజ్యాంగ అనుకూల నిబంధనల నుంచి వేరు చేసి, భంగకర నిబంధనలు చెల్లవు, రాజ్యాంగ అనుకూల నిబంధనలు చెల్లుతాయి అని ప్రకటించడం.

44. గ్రహణ సిద్ధాంతం (డాక్ట్రిన్ ఆఫ్ ఎక్లిప్స్) : రాజ్యాంగం అమలులోకి రాకముందు అమలులో ఉన్న చట్టాలు, రాజ్యాంగం 'అమలులోకి వచ్చిన తరువాత రాజ్యాంగ విరుద్ధంగా భావిస్తే, ఆ చట్టాలు చెల్లుబాటు విషయంలో సుప్రీంకోర్టు ఈ సూత్రాన్ని వినియోగిస్తుంది.

45. సమన్యాయ పాలన (రూల్ ఆఫ్ లా) : ఈ సూత్రాన్ని బ్రిటన్ నుంచి గ్రహించారు. దీని ప్రకారం చట్టం ముందు పౌరులందరూ సమానులే.

46. ఉభయసభల సంయుక్త సమావేశం : రాజ్యాంగంలో 108వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి అవసరమైనప్పుడు ఉభయ సభల సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తాడు.

47. అవశిష్టాధికారాలు : కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలలో చేరని అధికారాలను అవశిష్టాధికారాలు అంటారు. భారతదేశంలో ఇవి కేంద్రానికి కలవు.

48. పిత్ అండ్ సబ్‌స్టెన్స్ (డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టెన్స్) : అధికార విభజన జరిగినప్పుడు ఒక జాబితాలో పొందుపరిచిన అంశం, మరొక జాబితాలో పొందుపరచిన అంశంతో కొంత మేరకు అతిక్రమం జరగవచ్చు. అలా జరిగినప్పటికీ ఆ చట్టాలను రద్దు చేయరు. దీనిని పిత్ అండ్ సబ్‌స్టెన్స్ అంటారు.

49. గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జిఎస్‌టి) : భారత ప్రభుత్వం వస్తువులపై 'ఒక జాతి – ఒకే పన్ను' నినాదంతో గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్‌ను 101వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రవేశపెట్టి 279–ఎ నిబంధనను రాజ్యాంగంలో చేర్చినది. దీని ప్రకారం పన్నుల వ్యవస్థను నిర్ణయించడానికి ఆర్థికమంత్రి ఆధ్వర్యంలో జిఎస్‌టి కౌన్సిల్ ఏర్పడింది.

★

రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ - కొన్ని ముఖ్య గ్రంథాలు

1.	Granville Austin	Indian Constitution : corner stone of a Nation.
2.	Granville Austin	Working a Democratic Institution : The Indian Experience
3.	Rajani Kothari	Politics in India
4.	Rajani Kothari	Caste in Indian Politics
5.	D.D. Basu	Introduction to Indian Constitution
6.	Lord Bryce	Modern Democracies
7.	Ivor Jennings	Some characteristics of Indian Constitution
8.	H.J. Laski	Grammar of Politics
9.	K.C. Wheare	Federal government
10.	R. Venkatraman	My Presidential Years
11.	T.N. Seshan	The Degeneration of India
12.	Nani Palkivala	We, the people
13.	N. Sanjeeva Reddy	Without fear or favour
14.	P.V. Narasimha Rao	The Insider
15.	M.V. Pylee	Constitutional government of India
16.	N.D. Palmer	The Indian Political System
17.	W.H. Morris Jones	The government and politics of India
18.	R.L. Hard Grave	India: Government and politics in a developing Nation
19.	Atul Kohli	The success of India's democracy
20.	F.R. Frankel	India's Political Economy 1947-1977
21.	Selig Harrison	India : The most dangerous decades
22.	W.H. Morris Jones	Parliament in India
23.	Kuldip Nayar	India After Nehru
24.	M. Weiner	Sons of the Soil
25.	Paul Brass	Factional politics in an Indian state



జిఎస్‌టి 'శ్లాబ్'లను తగ్గించొచ్చు


- రెవెన్యూ పెరిగితేనే యోచన
- మంత్రి మెఘ్వాల్ వెల్లడి

కోల్‌కత్తా : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబులను తగ్గించే యోచన ఉందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్ అన్నారు. అయితే జిఎస్‌టి రెవెన్యూలో పెరుగుదల చోటు చేసుకున్న తర్వాతే దీన్ని ఆలోచిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం జిఎస్‌టిని ఐదు శ్లాబుల్లో అమలు చేస్తున్నారు. అందులో సున్నా శాతం, 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం శ్లాబుల్లో పన్ను వసూళ్లు చేస్తున్నారు. ఈ సంఖ్యను తగ్గించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. శనివారం కోల్‌కత్తాలో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బహుళ శ్లాబుల వల్ల చిన్న వ్యాపారాలకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదన్నారు. పైగా జిఎస్‌టి లాంటి పన్ను సంస్కరణల వల్ల అన్ని రాష్ట్రాలను బోర్డులను ఒకే వేదికపైకి తీసుకు రాగలిగామన్నారు. ఇది వరకు కేంద్ర ప్రభుత్వ జాబితా, రాష్ట్ర ప్రభుత్వ జాబితా, రెండింటి జాబితాలు తదితర పన్నులతో కొంత గందరగోళంగా ఉండేదన్నారు. జిఎస్‌టి ఏకరూప పన్ను వల్ల ప్రస్తుతం ఆ సమస్య తొలిగిపోయిందన్నారు. ఇప్పటి వరకు జిఎస్‌టి నెట్‌వర్క్ (జిఎస్‌టిఎన్)లో 13.2 లక్షల మంది డీలర్లు తమ వ్యాపారాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. దేశంలోనే పశ్చిమ బెంగాల్ రాష్ట్రం అత్యధికంగా 56,000 రిజిస్ట్రేషన్లతో ముందు స్థానంలో ఉందన్నారు. జిఎస్‌టికి ముందు 80 లక్షల పన్ను చెల్లింపుదారులున్నారన్నారు. తయారీ రంగం జోన్లకు ప్రోత్సాహకాల ఇచ్చేది?, లేనిది? జిఎస్‌టి కౌన్సిల్ త్వరలోనే నిర్ణయం తీసుకోనుందన్నారు. దీనిపై నిర్ణయం తీసుకునే వరకు మాత్రం పన్ను చెల్లింపులు, ఫైలింగ్‌లు చేయాల్సిందేనని తెలిపారు.

టెల్కోల 'మొండి బాకీల' భారం

- బ్యాంకులపై ఒత్తిడి
- రెవెన్యూకు జియో దెబ్బ

న్యూఢిల్లీ : టెలికం రంగంలోకి రిలయన్స్ జియో ప్రవేశించిన తర్వాత టెలికం పరిశ్రమ రెవెన్యూ భారీగా తగ్గిపోయిందని 2016–17 ఆర్థిక సర్వే–2 వెల్లడించింది. పోటీలో భాగంగా చాలా కంపెనీలు వాయిస్, డేటా ఛార్జీలను తగ్గించాయని తెలిపింది. తీవ్ర పోటీ, ధరల యుద్ధంతో ఈ రంగం భారీ స్థాయిలో రెవెన్యూ కోల్పోయిందని విశ్లేషించింది. టెల్కోలు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు చెల్లించడంలో విఫలం కావడంతో చాలా వరకు నిరర్థక ఆస్తులు పెరిగాయని ఈ సర్వే పేర్కొంది. ఆర్థిక సర్వే ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకులకు టెలికం కంపెనీలు 2016–17లో రూ.2,335 కోట్ల మొండి బాకీలను మిగిల్చాయి. ఈ మౌలిక వసతుల రంగం మొండి బాకీలు 8.7 శాతానికి ఎగిశాయి. 2015–16లో మొండి బాకీలు 5 శాతంగా నమోదయ్యాయి. అధిక స్పెక్ట్రమ్ ధరలతో పరిశ్రమ ఒత్తిడిని ఎదుర్కొంటుంది. 2016–17 జనవరితో ముగిసిన మూడో త్రైమాసికంలో దేశంలోని అగ్రశ్రేణి మూడు టెలికం కంపెనీలు భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యూలర్‌ల రెవెన్యూ వరుసగా 7.98 శాతం, 5.14 శాతం, 4.91 శాతం చొప్పున పడిపోయింది. గతేడాది సెప్టెంబర్‌లో రిలయన్స్ జియో భారత్‌లో వాణిజ్య సేవలను ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పుడు ప్రకటించిన ఉచిత సేవలు చాలా కాలం కొనసాగించింది. ప్రస్తుతం చౌక ధరల్లో డేటాను అందిస్తుంది. జియో రాకతో అన్ని టెల్కోలు తమ డేటా విస్తృతిని పెంచడంతో పాటు ఛార్జీలను తగ్గించాయని ఆర్థిక సర్వే పేర్కొంది. కంపెనీల లాభదాయకత పడిపోయింది. జియో రాక తర్వాత వినియోగదారుడిపై సగటు రాబడి 32 శాతం మేర తగ్గింది. పలు పరిణామాల మధ్య టెల్కోల ఆదాయం తగ్గడమే కాకుండా బ్యాంకులు ఇచ్చిన అప్పులు ఒత్తిడిలో పడ్డాయి. ఇదే సమయంలో ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, పన్నులు తదితర రాబడి తగ్గిందని ఈ సర్వే పేర్కొంది. ప్రస్తుతం భారత స్థూల దేశీయోత్పత్తిలో టెలికం రంగం 6.5 శాతం వాటా (140 బిలియన్ డాలర్ల) కలిగి ఉంది. ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 లక్షల మంది ఆధారపడ్డారు. జియో రాకతో ఈ రంగంలో నెలకొన్న పోటీ వల్ల టెల్కోలు భారీ స్థాయిలో ఛార్జీలను తగ్గించడంతో లాభాల్లో భారీ క్షీణత చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో భారతీ ఎయిర్‌టెల్ లాభాలు 75 శాతం పడిపోయి రూ.367 కోట్లకు పరిమితమయిన విషయం తెలిసిందే. గతేడాది ఇదే త్రైమాసికంలో ఈ కంపెనీ రూ.1,462 కోట్ల లాభాలు నమోదు చేసుకుంది. కాగా ఐడియా సెల్యూలర్ క్రితం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకంగా రూ.815 కోట్ల నష్టాలు చవి చూసింది. ఈ కంపెనీ వరుసగా మూడు త్రైమాసికాలుగా నష్టాలను నమోదు చేసింది. 2017 ఏప్రిల్ నుంచి జూన్ కాలంలో వొడాఫోన్ ఇండియా రెవెన్యూ 13.9 శాతం తగ్గి రూ.11,624 కోట్లుగా నమోదు చేసింది.



అంకితభావంతో పనిచేసే ప్రభుత్వం : బాలకృష్ణ


ప్రజాశక్తి-ఉప్పలగుప్తం, కొత్తపేట (తూర్పుగోదావరి)

నిబద్ధతతో కూడిన పాలననందిస్తూ అంకితభావంతో పనిచేసే ఏకైక ప్రభుత్వం టిడిపి అని సినీ హీరో, హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఉప్పలగుప్తం, కొత్తపేట ప్రాంతాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్.యానాంలోని శ్రీరామ్‌నగర్‌లో అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యాన నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పున:ప్రతిష్ట కార్యక్రమంలో బాలయ్య పాల్గొన్నారు. ఆలయ పున: ప్రతిష్ట శిలఫలకాన్ని ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావుతో కలిసి బాలకృష్ణ ఆవిష్కరించారు.

సిపిఎస్ నుంచి మినహాయించాలి

ప్రజశక్తి - ఒంగోలు క్రైం

ప్రమోట్ విఆర్ఒలకు సిపిఎస్ విధానం నుంచి మినహాయింపు ఇచ్చి పెన్షన్ సౌకర్యం కల్పించాలని విఆర్ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.భక్తవత్సల నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవనంలో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల విఆర్ఒల ప్రాంతీయ సమ్మావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.పి.రంగయ్య అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా భక్తవత్సల నాయుడు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగోన్నతిపై విఆర్ఒలుగా వచ్చిన వారు 4,500 మంది ఉన్నారని వారందరినీ జిఒ నం.39 ప్రకారం ఐదేళ్ల కనీస సర్వీసు ఉన్నవారుగా నియమించారని అన్నారు. వీరి సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.



పెట్టుబడిదారీ వ్యవస్థ రాజ్యమేలుతోంది

అప్పుల్లో కూరుకుపోతున్న సామాన్యులు

పరిస్థితి ఇలాగే ఉంటే ప్రపంచ యుద్ధం తప్పదు

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రపంచంలో, దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ రాజ్యమేలుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పేర్కొన్నారు. తరిమెల నాగిరెడ్డి 41వ వర్ధంతిని శనివారం అనంతపురం జిల్లా పరిషత్ సమావేశ హాలులో స్మారక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తరిమెల స్మారకోపన్యాస సభలో 'తాకట్టులో భారతదేశం-తదనంతర ఆర్థిక పరిస్థితులపై విశ్లేషణ' అంశంపై బివి రాఘవులు ప్రసంగించారు. 1971- 72లోనే తరిమెల నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం' అనే పుస్తకాన్ని రచించారని గుర్తు చేశారు. తరిమెల నాగిరెడ్డి దూరదృష్టితో మూల్యాంకనం చేసి ఆర్థిక సంక్షోభం తదితర అంశాలను తెలిపారని వివరించారు. 1968 నుంచి ప్రపంచ దేశాలన్నీ పెద్ద సంక్షోభాన్ని చవిచూశాయన్నారు. ఆధునిక పెట్టుబడిదారీ విధానాన్ని అమెరికా ఇప్పటికీ అనుసరిస్తోందన్నారు. ప్రపంచంలో సామ్రాజ్యవాద దేశాలు ఉన్నాయని, పంపిణీలో తేడాలు వచ్చి మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలు వచ్చాయన్నారు. ఇప్పుడు ఎక్కడ వీలైతే అక్కడ దోచుకోవడానికి పెట్టుబడిదారీ వ్యవస్థ పరుగులు తీస్తోందన్నారు. సహజ వనరులను దోచుకోవడానికి ద్రవ్య పెట్టుబడి కొత్తపుంతలు తొక్కుతోందన్నారు. ఇలాంటి వ్యవస్థలన్నీ ఏకమైతే మూడో ప్రపంచ యుద్ధం దాపురించే ప్రమాదం ఉందన్నారు. తరిమెల నాగిరెడ్డి స్మారక సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ.. తమ సంఘం ఏ పార్టీకి అనుకూలం, వ్యతిరేకం కాదన్నారు. సమకాలీన పరిస్థితులపై ప్రజలను చైతన్య వంతులను చేస్తూనే, తరిమెల నాగిరెడ్డిని స్మరించుకుంటూ ప్రతి నెలా ఒక రోజు ఒకరితో ఒక అంశంపై విశ్లేషించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత రాచపాళెం, చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం రాయలసీమ అభివృద్ధి కమిటీ కన్వీనర్ జి.ఓబులు, జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బి.వి. రాఘవులు

దళితుల పోరాట విజయం

దేవరపల్లిలో చెరువు కట్టలు తొలగింపు

ప్రజాశక్తి-పర్చూరు

భూముల కోసం పోరాటం చేస్తున్న మండలంలోని దేవరపల్లి దళితుల కల సాకారమైంది. సిపిఎం ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల మద్దతుతో గత రెండు నెలలుగా సాగించిన పోరాట ఫలితంగా చెరువు భూములు దళితులకే స్వాధీనం చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం తరపున సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు ప్రకటించారు. దాని ప్రకారమే చెరువు కట్టను శనివారం సాయంత్రం పొక్లెయిన్లతో తొలగించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జులై 30న దళితులతో మంత్రి నక్కా ఆనందబాబు సమావేశమయ్యారు. దళితుల భూములు వారికే అప్పగిస్తు న్నామని ప్రకటించారు. చెరువు కట్టలను కూడా మూడ్రో జుల్లో తొలగిస్తామని ప్రకటించారు. గ్రామ ప్రజల నీటి సమస్య తీర్చేందుకు అవసరమైన పథకాలు మంజూరు చేస్తా మని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షపు నీటికి చెరువు నిండింది. కట్టలు తెగగొట్టి బయటకు పంపేందుకు దళితులు ప్రయత్నించారు. గ్రామంలోని పెత్తందార్లు కొందరు అడ్డుకున్నారు. దీనికి నిరసనగా పర్చూరు రెవెన్యూ కార్యాలయం వద్ద దళితులు ఆందోళనకు దిగారు. కొన్ని కట్టలను పగులగొట్టి నీటిని బయ టకు పంపారు. ఆ తరువాత రెండ్రోజులు వర్షం కారణంగా చెరువులోకి దిగలేని పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం మూడు పొక్లెయిన్లతో చెరువు కట్టలు చదును చేసే పని ప్రారంభించారు. గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిపిఎం నాయకులు పెంట్యాల హనుమంతరావు, పర్చూరు డివిజన్ సిపిఎం నాయకులు కె.ప్రభుదాస్, ఎం డేవిడ్ కట్టలు చదును కార్యక్రమాన్ని పరిశీలించారు.

చేపల చెరువులో విషప్రయోగం

- రూ.50 లక్షల చేప పిల్లలు మృతి
- పెత్తందార్ల పనే అంటున్న బాధితులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (విజయవాడ)

చేపల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు పురుగు మందు కలిపిన సంఘటన కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం మండ లం ఈలప్రోలులో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దీంతో సుమారు రూ.50 లక్షలు విలువైన చేప పిల్లలు మృత్యువాత పడ్డాయి. గ్రామంలో అగ్రకులానికి చెందిన కొంతమంది పెత్తందారులు ఉద్దేశపూర్వకంగానే ఈ దారుణా నికి ఒడిగట్టి ఉంటారని బాధితులు చెబుతున్నారు. ఈ ఏడాది వేసవిలో చెరువు పూడిక తీయించుకుని గత బుధవా రం దళిత సొసైటీ సభ్యులు దానవాయి చెరువులో సుమారు రూ.50 లక్షల విలువ చేసే చేప పిల్లలను వదిలారు. శనివారం ఉదయం చెరువు దగ్గరకు వెళ్లిన సొసైటీ సభ్యులు చేప పిల్లలు చనిపోయి నీటిపై తేలియాడటం చూసి నిర్ఘాంతపోయారు. ఈ దారుణానికి పాల్పడినవారు తమ గ్రామానికి చెందిన పెత్తందార్లేనని, తాము ఆర్థికంగా అభివృద్ధి సాధించడం ఇష్టంలేక ఈ పని చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించి తమకు నష్టపరిహారాన్ని ఈ ఘటనకు పాల్పడిన వారి వద్ద వసూలు చేసి ఇవ్వాలని బాదితులు డిమాండ్ చేశారు.



మృతి చెందిన చేప పిల్లలను బయటకు తీస్తున్న మత్స్యకారులు

చేపల చెరువును సందర్శించిన సిపిఎం నేతలు

సిపిఎం పశ్చిమ కృష్ణా కార్యదర్శివర్గ సభ్యులు ఆంజనేయులు, బి.సుబ్బారావు, మండల కార్యదర్శి విఠలరావు, నరసింహారావులు ఈలప్రోలులో చేపల చెరువును సందర్శించి మాట్లాడారు. దోషులను కఠినంగా శిక్షించి బాధితులకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. దళిత సొసైటీ అధ్యక్షులు మిరియాల లక్ష్మణ్‌రావును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

భవనాల కూల్చివేతపై బాధితుల నిరసన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలో రోడ్డు విస్తరణ భూ సేకరణపై కోర్టు వివాదంలో ఉన్న స్థలాల్లోని భవనాలను అధికారులు శనివారం ఉదయం కూల్చివేశారు. పెద్ద సంఖ్యలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం, నాలుగు పొక్లెయిన్లతో ఒక్కసారిగా కూల్చివేతలు మొదలు పెట్టింది. బాధితులు అడ్డుకోవాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ క్రమంలో బాధితులు భవనాల్లో సామాను తరలింపునకు, జాగ్రత్త చేసుకునేందుకు గడువు కోరినా అధికారులు పట్టించుకోలేదు. తమకు ముందస్తు నోటీసులివ్వకుండా, పరిహారం చెల్లించకుండా భవనాల కూల్చివేతపై బాధితులు నిరసన వ్యక్తం చేశారు.

ఏడో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

మున్సిపల్ కార్మికుల ఉపాధిని పరిరక్షించాలని, ప్రజలపై భారాలు మోపే జిఒ నెంబరు 279ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఏడో రోజుకు చేరుకు న్నాయి. విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నాచౌక్ వద్ద శనివారం ఈ దీక్షలను సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ మున్సి పల్ కార్మికులు అనేక విధాలుగా ఉద్య మాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణ మన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం కార్మికుల పట్ల మొండివైఖరిని విడనాడాలని హితవుపలికారు. చంద్రబాబు ప్రభుత్వానికి యంత్రాలు, దళారులపై మమకారం ఎక్కువని విమర్శించారు. రేయింబవళ్లు దుమ్మూ ధూళిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను బలిపశువులను చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో అనంతపురం జిల్లాకు చెందిన మున్సిపల్ కార్మికులు కూర్చున్నారు. ఈకార్యక్రమంలో జెఎసి నాయకులు కె.ఉమామహేశ్వరరావు, కె.నాగభూషణం, ఎ.రంగనాయకులు, ఎం.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చట్టాల ఉల్లంఘన

ప్రజాశక్తి-గుడివాడ

చేపల చెరువుల తవ్వకాల్లో చట్టాలను, జిఒలను భూ యజమానులు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా వాటిని రక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని రాష్ట్ర పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడ మండలం దొండపాడులో శనివారం ఆయన పర్యటించి అక్కడి పరిస్థితులను, దళితులపై దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. భూస్వాములు, పెత్తందారులు తాత్కాలిక అనుమతులను పొంది జిఒలను సైతం పట్టించుకోకుండా చెరువులను తవ్వుతు న్నారన్నారు. తద్వారా అక్కడి ప్రజలు ఉపాధితోపాటు అనారోగ్యాల బారిన పడుతు న్నారని అన్నారు.

వ్యవసాయ వర్సిటీకి భూమి కోసం సిఎంతో చర్చిస్తా

ఐకార్ తరహాలో స్వతంత్ర సంస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు

లాంలో వర్సిటీ పాలకమండలి సమావేశంలో ఎంపి రామ్మోహననాయుడు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయింపు విషయంలో త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చిస్తానని శ్రీకాకుళం ఎంపి కె.రామ్మోహననాయుడు తెలిపారు. గుంటూరుకు సమీపంలోని లాంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో శనివారం జరిగిన పాలకమండలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి వల్లభనేని దామోదరనాయుడు అధ్యక్షత వహించారు. శిలాఫలకానికే పరిమితమైన 'వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్మాణం' అన్న శీర్షికతో శనివారం 'ప్రజాశక్తి' దినపత్రికలో వచ్చిన వార్తపై సమావేశంలో చర్చ జరిగింది. విశ్వవిద్యాలయ భవనాల నిర్మాణానికి 2015 నవంబరు 16న శంకుస్థాపన జరిగినా ఇంత వరకూ ఎందుకు ప్రారంభించలేదని ఎంపి ప్రశ్నించారు. పశువైద్య విశ్వవిద్యాలయం నుంచి భూమి కేటాయింపు జరగలేదని దామోదర నాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని వివరాలూ తెలుసుకున్న ఎంపి తాను త్వరలో ఈ అంశంపై చంద్రబాబుతో చర్చిస్తానని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ వర్సిటీకి 200 ఎకరాలు అందుబాటులో ఉందని, ఇంకా 300 ఎకరాలు కావాలని ఉపకులపతి తెలిపారు. రెండు నెలల్లో టెండర్లను పిలుస్తామ న్నారు. జిఒ 64పై వివాదం ఏర్ప డిన నేపథ్యంలో భారత వ్యవసాయ మండలి (ఐకార్) తరహాలో ఒక స్వతంత్ర్య సంస్థను ఏర్పాటు చేసి ఈ సంస్థ ద్వారా ప్రాథమిక పరీక్ష నిర్వహించిన తరువాతనే రాష్ట్రంలో వ్యవసాయ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని సమావేశం ప్రభు త్వానికి ప్రతిపాదనలు పంపింది. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా మొక్కజొన్న పరిశోధనా కేంద్రంలో 10 మంది శాస్త్రవేత్తల నియామకానికి సమావేశం ఆమోదం తెలిపింది. రూ.30 లక్షలతో ఈ పరిశోధనా కేంద్రం భవనాల నిర్మాణానికి ఆమోదం తెలిపారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న లాం వర్సిటీ ఉపకులపతి దామోదరనాయుడు

ప్రజ్ఞ జవాబులు


1. గజయాత్ర
2. ప్రసూన్ జోషి,
3. ఆగస్టు 12
4. ఖాట్మాండు,
5. ఉత్తరప్రదేశ్



వసతి ప్రకాష్ మెహతాపై లోకాయుక్త విచారణ

ముంబయి : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న గృహ నిర్మాణ మంత్రి ప్రకాష్ మెహతాపై లోకాయుక్త విచారణకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఆదేశించారు. దక్షిణ ముంబయిలోని ఎంపి మిల్స్ ప్రాంగణంలోని మురికివాడల పునరావాస సమాఖ్య (ఎస్ఆర్ఎ) ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన హక్కులను న్యాయవిరుద్ధంగా తనకు అను కూలమైన సంస్థకు బదిలీ చేశారని మంత్రిపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. మంత్రి వర్గం నుంచి ప్రకాష్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే ప్రతిపక్షాల ఆరోపణల మేరకు మంత్రి ప్రకాష్ మెహతాపై లోకయుక్త విచారణకు ఆదేశిస్తున్నానని, అప్పటి వరకూ ప్రకాష్‌ను తొలగించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు.

'బ్లూ వేల్' గేమ్‌ను నిషేధించండి



తిరువనంతపురం : చిన్నారుల ఆత్మహత్యలకు దారితీసే 'బ్లూ వేల్' అనే కొత్త ఆన్ లైన్ గేమ్‌ను నిషేధించాలని కేరళ సిఎం పినరయి విజయన్ ప్రధాని మోడీని కోరారు. ఈ మేరకు ప్రధానికి రాసిన లేఖను విజయన్ శనివారం మీడియాకు వెల్లడించారు. దేశం ముంగిట 'బ్లూవేల్' అనే ప్రమాదం ఉందని, తగిన చర్యలు తీసుకుని విలువైన చిన్నారుల ప్రాణాలు కాపాడాలని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇది వీడియో గేమ్ కాదని, చివరి దశలో గుర్తు తెలియని వ్యక్తి ఇచ్చే ఆదేశాల మేరకు చిన్నారులు ప్రాణాలు తీసుకుంటారని విజయన్ వివరించారు. ఈ గేమ్‌ను నిషేధించడమే సమస్యకు పరిష్కారమని, పలు కేంద్ర మంత్రిత్వ శాఖల సహకారంతో అది సాధ్యమౌతుందన్నారు.

అసంఘటిత రంగ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన నోట్ల రద్దు

- పెరిగిన సామాజిక బీమా డిమాండ్
- ఆర్థిక సర్వే వెల్లడి

న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ ఇటీవల కాలంలో తీసుకున్న పెద్ద నోట్ల రద్దు చర్య అసంఘటిత రంగ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందని శుక్రవారం పార్లమెంట్‌కు సమర్పించిన ఆర్థిక సర్వే రెండవ భాగం పేర్కొంది. అయితే, సామాజిక బీమా డిమాండ్ పెరిగిందని ముఖ్యంగా అభివృద్ధి తక్కువగా వున్న రాష్ట్రాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోందని సర్వే తెలిపింది. డిసెంబరు, మార్చి మధ్య కాలంలో నోట్ల రద్దు ప్రభావం బాగా తీవ్రంగా వుందని, తదనంతర కాలంలో కాస్త తగ్గుతూ వచ్చిందని తెలిపింది. ఇందుకు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) వంటి కార్యక్రమాలు ప్రధాన కారణంగా చెప్పుకోవాలని, అవసరమైన వారికి సామాజిక భద్రతను కల్పించే పాత్రను ఈ పథకం పోషిస్తున్నదని సర్వే పేర్కొంది. పెద్ద నోట్ల రద్దు సమయంలో బీమాకు డిమాండ్ పెరిగిందనడానికి సాక్ష్యాధారాలు కనిపిస్తున్నాయని, బీహార్, చత్తీస్‌ఘర్,



రాజస్థాన్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా వంటి అభివృద్ధి తక్కువగా నమోదైన రాష్ట్రాల్లో ఈ పరిస్థితి అధికంగా వుందని సర్వే పేర్కొంది. పెద్ద నోట్ల రద్దుకు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మధ్య గల సంబంధంలో నాలుగు దశలున్నాయని తెలిపింది. మొదటి దశలో– నోట్ల రద్దు తర్వాత నాలుగు వారాల పాటు ఉపాధి హామీ పనులకు డిమాండ్ తగ్గిందని సర్వే తెలిపింది. రెండో దశలో–ఆ పరిస్థితి నుండి కోలుకోవడానికి మరో నాలుగు వారాలు పట్టగా, మూడో దశలో–డిమాండ్ గణనీయంగా పెరిగిందని, ఈ పరిస్థితి పది వారాల పాటు కొనసాగిందని తెలిపింది. ఇక చివరిగా నాలుగో దశలో–అంటే మార్చి మధ్య నాటికి, ఉపాధి హామీ పథకంపై పెద్ద ప్రభావమేమీ కనిపించలేదని సర్వే పేర్కొంది. అయితే నోట్ల రద్దు తొలినాళ్ళలో నాలుగు వారాల పాటు డిమాండ్ తగ్గడమనే అంశం గందరగోళపరుస్తున్నదని సర్వే పేర్కొంది. నోట్ల రద్దుతో సరఫరా, బీమా డిమాండ్ రెండూ దెబ్బతిన్నాయి. తొలివారాల్లో, సరఫరా తగ్గడంతో డిమాండ్ బాగా పెరిగిందని పేర్కొంది. కాలం గడుస్తున్నకొద్దీ, చలామణిలోకి నగదు వస్తున్న కొద్దీ ఆర్థికపరమైన ఇబ్బందులు తొలగిపోవడంతో బీమా డిమాండ్ మరింత స్పష్టంగా గోచరమైందని సర్వే వివరించింది. 2016–17లో వ్యవసాయం రంగం పనితీరు బాగుండడం వల్ల కూడా నోట్ల రద్దు ప్రభావం పెద్దగా లేకుండా పోయిందని తెలిపింది. 2006లో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టినప్పటి నుండి చూసినట్లైతే 2016–17 మధ్య కాలంలోనే పూర్తయిన పనుల రేటు ఎక్కువుగా నమోదైందని సర్వే పేర్కొంది.

యుపిలో మరో దారుణం

నిద్రిస్తున్న మహిళలకు నిప్పు అంటించిన దుండగులు

బరేలీ : యుపిలో మరో దారుణం చోటు చేసుకుంది. నిద్రలోవున్న ఇద్దరు అక్కాచెల్లెళ్లకు గుర్తు తెలియని దుండగులు నిప్పు అంటించిన ఘటన బరేలీ జిల్లా నవాబ్‌గంజ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. వారి హాహాకారాలు విన్న తల్లిదండ్రులు, చుట్టుపక్కల వాళ్లు మంటలు ఆర్పి సమీపంలోని ఆసుపత్రికి బాధితులను తరలించారు. బాధితుల్లో ఒకరైన ఫిజా మాట్లాడుతూ "మేం నిద్రిస్తున్న మంచానికి కొంతమంది దుండగులు నిప్పు పెట్టారు. మేం లేచేసరికి వారు పారిపోయారు. ఆ సమయంలో వారిని గుర్తు పట్టలేకపోయాం" అని చెప్పారు. తమ కూతుళ్లను చంపేందుకు యత్నించినవారెవరో తెలీదని, ఎవరితోనూ తమకు శత్రుత్వం లేదని బాధితురాలి తల్లి చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు. మంచంపై పెట్రోలు వేసి నిప్పు అంటించినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు.

జమ్మూ రైల్వే స్టేషన్‌లో హై అలర్టు

ఉగ్రదాడి హెచ్చరికల నేపథ్యంలో అధికారుల అప్రమత్తం

జమ్మూ : ఉగ్రదాడి హెచ్చరికల నేపథ్యంలో జమ్మూ రైల్వే స్టేషనులో శనివారం హైఅలర్ట్ ప్రకటించారు. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా కమాండర్ అబు దుజనా ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా ఉగ్రదాడులు జరిగే అవకాశముందని ఇంటెలిజెన్స్ అధికారులు హెచ్చరించడంతో పాటు తాజాగా ఓ రైలులో పేలుడు పదార్థాలు లభించడం, రైల్వే స్టేషనులో అనుమానాస్పద వ్యక్తులు వదిలేసిన బ్యాగులు కలకలం సృష్టించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మరోవైపు స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు జరుగుతుండటంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా భద్రతా చర్యలు ముమ్మరం చేసినట్లు ఆర్‌పిఎఫ్ దళ డిప్యూటీ కమాండెంట్ జెకె కుందల్ చెప్పారు. 2014లో జమ్మూ స్టేషనుపై ఉగ్రవాదులు దాడిలో నలుగురు భద్రతా సిబ్బంది మరణించారు.

విద్యార్థి సంఘాల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

- మమత ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించిన జెయు విద్యార్థులు
- విసీ జోక్యాన్ని కోరుతూ కార్యాలయం ముంగిట ఘెరావ్

కోల్‌కతా : వర్శిటీలు, కళాశాలల్లో విద్యార్థి సంఘాలను రద్దు చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జాదవ్‌పూర్ యూనివర్శిటీ(జెయు) విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేగాక 24 గంటలకుపైగా వర్శిటీ పరిధిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ అంశంపై జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉపకులపతి(వీసీ) సురంజన్ దాస్ కార్యాలయం ముందు ఘెరావ్ నిర్వహించారు. ఫిబ్రవరిలో ఆమోదించిన పశ్చిమ బెంగాల్ యూనివర్శిటీ, కళాశాలల చట్టం ప్రకారం ఎన్నికల సంఘాలను రద్దు చేసి, వాటి స్థానాల్లో కౌన్సిళ్లను తీసుకొచ్చారు. ఆ కౌన్సిల్ అధ్యక్షుడిని ప్రిన్సిపాల్ నామినేట్ చేస్తారు. అందులో అధ్యాపకులు కూడా ఉంటారు. ప్రతి రెండేళ్లకోసారి విద్యార్థి మండలికి ఎన్నికలు నిర్వహిస్తారు. ఓటు వేయాలన్నా, పోటీ చేయాలన్నా 60 శాతం హాజరు ఉండాలనే నిబంధన పెట్టారు. జూన్‌లో విడుదలైన ఆ చట్టంలోని నిబంధనలను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అయితే గవర్నర్ ఆమోదం పొందిన చట్టాన్ని మార్చేది లేదని విద్యాశాఖ మంత్రి పార్థా ఛటర్జీ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై ఓ విద్యార్థి మాట్లాడుతూ నూతన చట్టం అప్రజాస్వామికమని, తమ హక్కును కాలరాస్తోందని పేర్కొన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ విద్యార్థులు చేసిన డిమాండ్‌కు విసీ అంగీకరించారు. ఈ మేరకు వర్శిటీ నిర్వహణ మండలి ప్రభుత్వానికి లేఖ రాసింది.

ప్రభుత్వంపై విమర్శలు నిషేధం

ఐఐఎంసి కౌన్సిల్ నిర్ణయం

న్యూఢిల్లీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసి) సిబ్బంది ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఇకపై నిషేధం. ఈ నిర్ణయాన్ని ఇక్కడి ఐఐఎంసి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీసుకున్నట్లు సంస్థ డైరెక్టర్ జనరల్ కెజి సురేష్ తెలిపారు. ది సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కాండక్ట్ (సిసిఎస్) నియమాల ప్రకారం ప్రభుత్వంపై సిబ్బంది విమర్శలు చేయడాన్ని నిషేధించినట్లు తెలిపారు. ఢిల్లీ యూనివర్శిటీతో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలో వున్న మీడియా పాఠశాలల్లో ఈ నిషేధం అమల్లో వుంటుందని అన్నారు. అయితే సిసిఎస్ నిబంధనల పరిధిలోకి ఢిల్లీ యూనివర్శిటీ సిబ్బంది రారని ఢిల్లీ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్ (డియుటిఎ) అధ్యక్షులు నందితా నరైన్ తెలిపారు. సిసిఎస్ నిబంధనలన్నీ అర్థం లేనివని విమర్శించారు. అలాగే ఈ నిషేధంపై కొంత మంది అధ్యాపకులు కూడా నిరసన వ్యక్తం చేస్తున్నారు. అంశాన్ని సమాచార, ప్రసార మంత్రి స్మృతి ఇరానీ వద్ద ముగ్గురు జెడి(యు) ఎంపీలు లేవనెత్తారు. ఈ నిషేధం ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జర్నలిజం ఉపాధ్యాయులకే తన అభిప్రాయాన్ని వెల్లడించే హక్కు లేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. సాంఘిక, రాజకీయ, ఆర్థిక సమస్యలపై అభిప్రాయాలను నిషేధించడం 'పారదర్శక వైవిధ్యం'ను చూపిస్తుందని అధ్యాపకులు అంటున్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లో వరద ఉధృతి

- నలుగురు మృతి
- కొనసాగుతున్న సహాయక చర్యలు



గౌహతి : ఈశాన్య రాష్ట్రాలను మరోసారి వరదలు కబళించాయి. కాస్త విరామం అనంతరం ఎడతెగకుండా పడిన వర్షాలకు అస్సాంలోని 19 జిల్లాలు ముంపునకు గురయ్యాయి. గడిచిన 24 గంటల్లో వరదలో కొట్టుకుపోయి, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో నలుగురు మరణించారు. సుమారు 10 లక్షల మంది ముంపు ప్రాంతాల్లో ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. మరోవైపు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. త్రిపుర, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్‌లు వరద ప్రభావానికి గురైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 1750 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, లక్ష హెక్టార్ల సాగు భూమి నీట మునిగిందని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 268 పునరావాస కేంద్రాల్లో 63 వేల మంది ఆశ్రయం పొందారని చెప్పారు.

ముంబయిలో రుణ మాఫీ పొందిన రైతుల జాబితా ఏమీ లేదు : ఆర్‌టీఐ అధికారులు

813మంది రుణమాఫీ పొందినట్టు మహారాష్ట్ర సిఎం ట్వీట్

ముంబయి : రుణ మాఫీ పొందిన ముంబయికి చెందిన రైతుల జాబితా తమ దగ్గర లేదని మహారాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ముంబయి నగరం, శివారు ప్రాంతాలకు చెందిన రైతుల గురించి సమాచార హక్కు కార్యకర్త అనిల్ గల్గాలీ అడిగిన ప్రశ్నకు ఆర్‌టీఐ అధికారులు తమ దగ్గర జాబితా ఏమీ లేదని సమాధానమిచ్చారు. రూ. 1.50 లక్షలమేరకు తమ రాష్ట్రంలోని రైతుల రుణాలను మాఫీ చేస్తున్నట్టు ఈ ఏడాది జూన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. ఆ తర్వాత ఆయన తన ట్విట్టర్ ద్వారా రాష్ట్రం మొత్తంమీద రుణ మాఫీ పొందినవారి సంఖ్యలు పేర్కొంటూ..వారిలో ముంబయికి చెందిన 813మంది రైతులు కూడా ఉన్నట్టు తెలిపారు. అయితే, సమాచారశాఖ అధికారి ఇచ్చిన సమాధానం ముఖ్యమంత్రి ప్రకటనతో విభేదించడంతో తాము అయోమయానికి గురయ్యామని గల్గాలీ తెలిపారు. ముంబయిలో అంతా ధనిక రైతులే ఉన్నట్టు సమాచారశాఖ తమకు తెలిపిందని గల్గాలీ అన్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన సమాచారంలో ఇదే విషయం ఉన్నట్టు ఆర్‌టీఐ అధికారులు తమకు చెప్పారని గల్గాలీ తెలిపారు.

హాస్టల్ ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ ఢిల్లీ విద్యార్థినుల ఆందోళన

న్యూఢిల్లీ : హాస్టల్ ఫీజును పెంపునకు వ్యతిరేకంగా ఢిల్లీ యూనివర్శిటీ హిందూ కాలేజీ విద్యార్థినులు చేపట్టిన ఆందోళన శనివారంతో మూడో రోజుకు చేరుకున్నది. పెంచిన ఫీజును వెంటనే ఉపసంహరించుకోవాలని కాలేజీ యాజమాన్యాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం అమ్మాయిల హాస్టల్ ఫీజు ఏడాదికి రూ.90 వేలు ఉండగా.. అబ్బాయిలకు రూ.60 వేలు ఉన్నది. నిరసనలో భాగంగా శుక్రవారం రాత్రి కాలేజీ పరిపాలనా విభాగం ఎదుటే విద్యార్థినులు నిద్రించారు. మూడు రోజులుగా నిరసన చేస్తున్నా కాలేజీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని ఓ విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకుండా వారు తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. తమతో కాలేజీ యాజమాన్యం బహిరంగంగా చర్చలు జరిపి, స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళనను విరమిస్తామని ఆమె హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్ ఫీజును పెంచారని, దీనిపై కల్పజేసుకోవాలని ఢిల్లీ మహిళా కమిషన్ (డీసీడబ్ల్యూ)ను గతనెలలో కలిసి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఈ విషయమై కాలేజీ ప్రిన్సిపాల్‌కు డీసీడబ్ల్యూ ఇటీవల నోటీసులు కూడా జారీ చేసింది.

సైన్యంలోకి రోబోలు..!

కాశ్మీర్‌లో ప్రయోగాత్మకంగా అమలు

శ్రీనగర్ : సూపర్ స్టార్ రజనీ కాంత్ బ్లాక్‌బస్టర్ సినిమా రోబో అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ సినిమా లో హీరో ఒక సైంటిస్ట్. ఒక రోబో (చిట్టి)ని తయారుచేస్తాడు. దాన్ని సైన్యంలో ప్రవేశపెట్టేందుకు చిట్టిని పరీక్షకు తీసుకెళతాడు.. విలన్ దానిని కన్ఫ్యూజ్ చేసి తిరస్కరించేలా చేస్తాడు... ఇప్పుడు ఆ సినిమాలో చిట్టి నిజం కాబోతోందా..? చిట్టిలను సైన్యంలో ప్రవేశపెట్టనున్నారా..? సైన్యం వాటి సహాయం తీసుకోనుందా..? అవును.. నిజమే. జమ్మూకాశ్మీర్ లో ఉగ్రవాదులపై పోరాటానికి త్వరలో రోబోలను ప్రవేశపెట్ట నున్నారు. సైనికులకు కావాల్సిన ఆయుధ సామాగ్రిని చేర వేసేందుకు రిమోట్ ఆధారిత రోబోలను త్వరలోనే అందు బాటులోకి తేనున్నారు. ఇందుకుగాను 544 రోబోల తయారీకి ఆర్మీ పంపిన ప్రతిపాదనలను రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. వాటి కత్రిమ మేధస్సుపై ప్రయోగాలు ప్రారంభం కాగా, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాక సైన్యానికి అప్పగించనున్నారు. ఈ రోబోలు ఉగ్రవాద ఏరివేత చర్యల్లో సైన్యానికి సహాయ పడగలవని భావిస్తున్నారు. ఉగ్రవాదులకు ప్రధాన స్థావరాలుగా ఉండే అడవులు, మారుమూల గ్రామాల్లో సైతం ఇవి ఆటంకం లేకుండా పనిచేయ గలవని అంటున్నారు.


ఉగ్రవాదుల రహస్య స్థావరాలను కనిపెట్టి వాటిపై గ్రెనేడ్‌లు విసిరేందుకు కూడా వీటిని ఉపయోగించ నున్నట్టు సమాచారం. తక్కువ బరువుతో బలంగా ఉండే వీటిలో 200 మీటర్ల పరిధి వరకూ తీయగల నిఘా కెమెరాలు, ప్రసార వ్యవస్థల వంటి ఫీచర్స్‌తో వీటిని తయారుచేయనున్నారు.

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాక్

సైనికునితో సహా ఇద్దరు మృతి

న్యూఢిల్లీ : పాక్ సైన్యం శనివారం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్మూకాశ్మీర్ సరిహద్దును ఆనుకునివున్న పూంచ్ సెక్టార్ వద్ద సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పాక్ సైన్యం మోర్టార్లతో కాల్పులు జరిపింది. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన జగ్రామ్ సింగ్ తోమార్ అనే సైనికుడు మరణించినట్లు సైనికాధికారి తెలిపారు. మెంధార్ సెక్టారులో పాక్ సైన్యం ఉదయం జరిపిన కాల్పుల్లో ఓ మహిళ మరణించిందని భద్రతా అధికారులు వెల్లడించారు. మరో సైనికుడు తీవ్రంగా గాయపడ్డారని, ఆయన పరిస్థితి విషమంగా ఉందని సీనియర్ భద్రతాధికారి చెప్పారు.

సాహిత్య అకాడమీ పురస్కార విజేత పుస్తకంపై జార్ఖండ్ నిషేధం



న్యూఢిల్లీ : సాహిత్య అకాడమీ పురస్కార విజేత హన్స్‌దా సౌవేంద్ర శేఖర్ రచించిన కథానికల సంపుటిపై నిషేధం విధిస్తూ జార్ఖండ్ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఆదే శాలు జారీ చేసింది. సంథాలీ సంతతి ప్రజ లను ముఖ్యంగా మహిళలను కించపరుస్తూ ఆయన ఈ కథానికలు రచించినందున దీనిపై నిషేధం విధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం మార్కెట్‌లో వున్న ఈ పుస్తక ప్రతులను వెంటనే స్వాధీనం చేసుకుని రచయితపై చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రఘువర్ దాస్ ప్రధాన కార్యదర్శి రాజ్‌బాల వర్మను ఆదేశించినట్లు ఒక ఆంగ్ల పత్రిక తన వార్తా కథనంలో ప్రచురించింది. ఈ పుస్తకంలో సంథాలీలను కించపర్చిన విషయాన్ని శుక్రవారం ఉదయం శాసనసభ ప్రతిపక్ష ఎమ్మెల్యే సీతా సొరేన్ శాసనసభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ పుస్తకాన్ని వెంటనే నిషేధించాలని శాసనసభలో ప్రతిపక్ష నేత హేమంత సొరేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి ఎమ్మెల్యే లక్ష్మణ్ తుడు ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఈ పుస్తకం సంథాలీ మహిళలను కించపర్చిందని విమర్శించారు. ఇదిలా వుండగా ఈ పుస్తక ప్రచురణపై తనపై గత రెండేళ్లుగా వేధింపులు కొనసాగుతున్నాయని రచయిత శేఖర్ ఆరోపించారు. తన రెండో రచన పాఠకుల ముందుకు వచ్చిన 2015 నవంబర్ నుండి ఈ దాడులు కొనసాగుతున్నాయని ఆయన మీడియాకు వివరించారు. అయితే శేఖర్‌కు వ్యతిరేకంగా జార్ఖండ్‌లో నిరసన ప్రదర్శనలు జోరందుకున్నాయి. శేఖర్ వైద్య వృత్తి నిర్వహిస్తున్న పాకూర్ పట్టణంలో ఈ నెల 4న కొందరు ఆదివాసీల బృందం ఆయన పుస్తకాలను దిష్టిబొమ్మను దగ్ధం చేసింది. ఈ చర్యను శేఖర్‌తో పాటు మరికొందరు రచయితలు ఖండించారు.

ప్రజా ధనం దుర్వినియోగం

జార్ఖండ్ సర్కారుపై క్రైస్తవ సంఘాల ఆరోపణ




రాంచీ : జార్ఖండ్ ప్రభుత్వం క్రైస్తవ వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతూ మహాత్మా గాంధీని, ప్రభు త్వ నిధులను దుర్వినియో గం చేస్తోందని రాష్ట్రానికి చెందిన క్రైస్తవసంఘాలు ఆరోపిస్తున్నాయి. మూ డేళ్ల క్రితం గాంధీని కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ ప్రచారానికి వినియోగించు కోగా, ఇప్పుడు జార్ఖండ్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి మతమార్పిళ్ల నిరోధానికి ప్రతినిధిగా ఆయన్ను వినియోగించు కుంటోంది. ఆదివాసీలు, దళితులను క్రైస్తవ మతంలోకి మార్చేందుకు చేసే ప్రయత్నా లను వ్యతిరేకిస్తూ మహాత్ముని ప్రవచనా లతో కూడిన ఒక ప్రకటనను జార్ఖండ్ ప్రభుత్వం ఇటీవల ప్రింట్ మీడియాలో ప్రచురించింది. ఈ ప్రకటనకు బోసి నవ్వుతో చేతికర్రతో ముందడుగు వేస్తున్న గాంధీ చిత్రాన్ని వినియోగించింది. ప్రభు త్వం వెంటనే ఈ ప్రకటనను ఉపసంహ రించుకుని జార్ఖండ్, భారత్‌లోని క్రైస్తవు లకు క్షమాపణలు చెప్పాలని క్రైస్తవ సంఘాలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశాయి. సమాజంలోని ఒక వర్గంపై దాడి కోసం అధికార యంత్రాంగాన్ని, ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయటం క్షమా ర్హం కాదని ఈ సంఘాలు స్పష్టం చేస్తు న్నాయి. అధికార బిజెపి తన మాతృసంస్థ ఆరెస్సెస్, దాని అనుబంధ సంఘాల ప్రోత్సాహంతో క్రైస్తవులు, ముస్లింల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిని ఈ ప్రకటన ప్రతిబింబిస్తోందని ఈ సంఘాలు విమర్శించాయి. అయితే ఆరెస్సెస్ రాజ కీయ విభాగం అయిన బిజెపి నేతృత్వంలో వున్నప్పటికీ ఒక రాష్ట్ర ప్రభుత్వం ఇటు వంటి పనులు చేయటం విచారకరమని ఈ సంఘాలు తమ ప్రకటనలో పేర్కొన్నాయి.



మరోసారి కెన్యా అధ్యక్షుడిగా కెన్యట్టా...!

నైరోబీ/కిసుము (కెన్యా): కెన్యాలో గత మంగళవారం నాడు జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు ఉహురు కెన్యట్టా మరోసారి విజయం సాధించారు. అయితే ప్రతిపక్షం మాత్రం ఈ ఎన్నికల ఫలితాలను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం వెల్లడయిన ఈ ఫలితాలతో కెన్యెట్టా అనుచరులు సంబరాల్లో మునిగిపోగా ప్రతిపక్షం మాత్రం రాజధానిలో తనకు పట్టున్న ప్రాంతాల్లోనూ, దేశ పశ్చిమ ప్రాంతాల్లోనూ నిరసనలు చేపట్టింది. ఫలితాలు పూర్తిగా వెల్లడయిన తరువాత కెన్యట్టా మీడియాతో మాట్లాడుతూ దేశంలో శాంతిని స్థాపించి, ప్రజల మధ్య ఐక్యతను కొనసాగించేందుకు కలిసిరావాలని ప్రతిపక్షానికి విజ్ఞప్తి చేశారు.ఎన్నికల ఫలితాలను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించిన విపక్షం దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చింది.



అవసరమైతే వెనిజులాపై సైనిక చర్య

వాషింగ్టన్ : వెనిజులాపై సైనికచర్యకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం బెదిరించారు. ప్రస్తుతం వెనిజులాలో పరిస్థితి చాలా ప్రమాదకరంగా వుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు నికొలస్ మదురో అధికార కాంక్షతో వ్యవహరిస్తు న్నారని ఆరోపించారు. జులై 30న రాజ్యాంగ అసెంబ్లీకి ఎన్నికలు జరిగిన అనంతరం వెనిజులా రాజధాని కారకస్‌తో సహా పలు నగరాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. మదురోని నియంతగా ట్రంప్ సర్కార్ అభివర్ణిస్తోంది. మదురోపై, మాజీ, ప్రస్తుత అధికారులపై కొత్తగా ఆంక్షలు విధించింది. "వెనిజులా విష యంలో అనేక అవకాశాలను పరిశీలిస్తున్నాం. ఇందులో భాగంగా సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని తోసిపుచ్చలేం." అని ట్రంప్ పేర్కొన్నారు.

ఇరాన్ గూఢచర్యం కేసులో 12మంది అరెస్టు

దుబాయ్ : ఇరాన్ గూఢచర్యం కేసులో 12మందిని వివిధ ప్రాంతాల్లో కువైట్ అధికారులు అరెస్టు చేసినట్లు హోం మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. 2015లో అబ్దాలీ సెల్‌పై జరిపిన దాడిలో తుపాకులు, పేలుడు పదార్థాలు కనుగొన్న తర్వాత 25మంది కువైట్ జాతీయులపై, ఒక ఇరాన్ జాతీయుడిపై కువైట్ ప్రభుత్వం అభియోగాలు మోపింది. వీరందరూ కూడా షియాలే. కువైట్‌కు వ్యతిరేకంగా ఘర్షణలు, గొడవలు సృష్టించేందుకు వీరు కుట్ర పన్నారని కువైట్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. వీరిలో ఒక వ్యక్తికి మరణశిక్ష విధించగా మిగిలిన వారికి జైలుశిక్షలు విధించారు. గత జూన్‌లో కువైట్ అత్యున్నత కోర్టు ఈ మరణశిక్షను రద్దు చేసింది. వారిలో కొందరికి శిక్ష పెంచగా, మరికొందరికి తగ్గించింది. ఇరాన్ జాతీయుడితో సహా 14మందికి వారి పరోక్షంలో శిక్షలు ఖరారయ్యాయి. కాగా ఈ కేసులో తమ ప్రమేయం లేదని ఇరాన్ తిరస్కరించింది. ఇదే కేసులో దోషులైన మరో ఇద్దరి కోసం అధికారులు ఇంకా గాలింపు కొనసాగిస్తున్నారు.

యెమెన్‌లో హెలీకాప్టర్ కూలి నలుగురు సైనికుల మృతి

దుబాయ్ : యెమెన్‌లో రోజువారీ కార్యకలాపాల్లో పాల్గొన్న తమ హెలికాప్టర్ కూలిపోవడంతో అందులోని నలుగురు సైనికులు మరణించారని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ శనివారం తెలిపింది. యెమెన్‌లోని షాబ్వా ప్రాంతంలో వుండగా వారి హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తిందని, దాంతో అత్యవసరంగా కిందకు దిగడానికి ప్రయత్నించిందని, ఆ క్రమంలో నేలకు బలంగా తాకి ధ్వంసమైందని అధికార వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్‌కి చెందిన హౌతి గ్రూపుపై పోరాడేందుకు 2015లో సౌదీ నేతృత్వంలో ఏర్పడిన సంకీర్ణ కూటమిలో యుఎఇ భాగస్వామిగా వుంది. హౌతి గ్రూపు అధీనంలో ఉత్తర యెమెన్‌లోని ఎక్కువ భాగం, రాజధాని సానా వున్నాయి. ఇప్పటివరకు యెమెన్‌లో సాగుతున్న పోరులో 10వేల మందికి పైగా మరణించారు. 30లక్షల మంది నిర్వాసితులయ్యారు.

అణు ఉద్రిక్తతలకు శాంతియుత పరిష్కారం



అమెరికా, ఉ.కొరియాలకు చైనా సూచన

బీజింగ్: ఉ.కొరియా, అమెరికా మధ్య కొనసాగుతున్న అణు ఉద్రిక్తతలకు శాంతియుత పరిష్కారం అవసరమని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా మార్గాన్వేషణ చేయాలని ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు తెలిపారు. సీ శనివారం ట్రంప్‌తో టెలిఫోన్‌లో మాట్లాడుతూ ఉభయదేశాలూ సంయమనం పాటించి ఉద్రిక్తతలకు తెరదించాలని సూచించినట్లు చైనా అధికార టెలివిజన్ సిసిటీవీ వెల్లడించింది. కొరియా ద్వీపకల్పాన్ని అమెరికా అణు యుద్ధం వైపు నెడుతోందంటూ ఉ.కొరియా విమర్శిం చటం, తమ సేనలు పూర్తి సన్నద్ధంగా వున్నాయంటూ ట్రంప్ ఉ.కొరియాను బెదిరించటం వంటి ఘటనలల నేపథ్యంలో ప్రపంచ దేశాలు అప్రమత్తమయ్యాయి. కొరియన్ ద్వీపకల్పాన్ని అణు నిరాయుధీకరణ చేయటం చైనా, అమెరికా ఉమ్మడి ప్రయోజనాలకు, ఆ ప్రాంతంలో శాంతి సుస్థిరతలకు అత్యవసరమని సీ జిన్‌పింగ్ ట్రంప్‌కు వివరించినట్లు సిసిటీవీ తన వార్తా కథనాలలో వివరించింది. ఇరుదేశాలూ సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రకటనలు, కవ్వింపు చర్యలకు తెరదించాలని సీ సూచించినట్లు వెల్లడించింది. అణు వివాదాన్ని అంతిమంగా రాజకీయంగానే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న సీ ఇందుకు సంబంధించి అమెరికాతో సంప్రదింపులు కొనసాగించేందుకు చైనా సిద్ధంగా వుందని తెలిపినట్లు సీసీటీవీ పేర్కొంది. ఉ.కొరియాతో ఏర్పడిన అణు వివాద పరిష్కారంలో చైనా కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని తాను పూర్తిగా అర్థం చేసుకున్నట్లు ట్రంప్ సీ కి వివరించినట్లు సిసిటీవి వెల్లడించింది.

యెమెన్ ఎయిర్‌పోర్ట్‌ను నియంత్రించలేం

స్పష్టం చేసిన ఐక్యరాజ్య సమితి

ఐక్యరాజ్య సమితి : యెమెన్ ప్రధాన విమానాశ్రయాన్ని నియంత్రించే బాధ్యత తమది కాదని ఐక్యరాజ్య సమితి శుక్రవారం తెలిపింది. ఈమేరకు సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ కూటమి చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. రాజధాని సానాలోని విమానాశ్రయాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని ప్రస్తుతం యెమెన్‌లో పోరాడుతున్న సౌదీ సంకీర్ణ కూటమి గురువారం ఐక్యరాజ్య సమితిని కోరింది. యెమెన్‌లో ప్రత్యర్థి హౌతి రెబెల్స్ అధీనంలో విమానాశ్రయం వున్న భూభాగం వుంది. ప్రచ్ఛన్నయుద్ధంతో యెమెన్ అతలాకుతల మవుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలకు మానవతా సాయం అందేందుకు అనుమతించాలని ఐక్యరాజ్య సమితి ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ ప్రత్యర్థి పక్షాలను కోరారు. రెండేళ్ళుగా సాగుతున్న యుద్ధంలో పదివేల మంది మరణించినట్లు ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది.

బీజింగ్‌లో తుపాను, కుండపోత వర్షం


వందలాది విమానాలు రద్దు



బీజింగ్ : శనివారం బీజింగ్‌లో తుపాను బీభత్సాన్ని సృష్టించింది. తుపాను కారణంగా వందలాది విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈవారంలో భూకంపం వచ్చినందున, ప్రస్తుతం ఇక్కడ కురుస్తున్న భారీ వర్షాలు, పెను గాలులతో కొండచరియలు విరిగిపడే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. శనివారం ఉదయం నుండి మధ్యాహ్నానికి వాతావరణ శాఖ హెచ్చరికల స్థాయిని పెంచుతూ ప్రజలను అప్రమత్తం చేసింది. నగరంలో దాదాపు 70మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం వుందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, గాలులు వీచే అవకాశం వుందని వాతావరణ శాఖ పేర్కొంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పర్వత ప్రాంతాల్లో ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రమాదం వుందని తెలిపింది. ఉదయం 9గంటల నుండి అర్ధరాత్రి వరకు దాదాపు 500 విమానాలు రద్దయ్యాయి. మరో 182 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. బీజింగ్‌లో వేసవి కాలంలో తుపానులు ఎక్కువే

రఖినే స్టేట్‌లో మరోసారి ఉద్రిక్తతలు

సైన్యాన్ని రంగంలోకి దించిన మయన్మార్



యాంగాన్: మయన్మార్ వాయవ్య ప్రాంతంలో వున్న రఖినే స్టేట్‌లో హత్యల నేపథ్యంలో చెలరేగిన హింసాకాండను అదుపు చేసేందుకు సైనిక దళాలను అక్కడికి పంపినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. ముస్లిం మెజార్టీ ప్రాంతమైన రఖినే రాష్ట్రంలో రోహింగ్యా ముస్లింలు గత అక్టోబర్‌లో తొమ్మిది మంది పోలీసులను హత్య చేయటంతో ఉద్రిక్తతలు చెలరేగిన విషయం తెలిసిందే. రఖినే ఉత్తర ప్రాంతంలోని మౌంగ్దా పట్టణ శివార్లలోని పర్వత ప్రాంతాల్లో గత వారం ఏడుగురు బౌద్ధులు హత్యకు గురైన నేపథ్యంలో అక్కడ శాంతి భద్రతల పటిష్టతలో సహకరించేందుకు సైన్యం అదనపు దళాలను పంపిందని రఖినేకు చెందిన సైనిక వర్గాలు వివరించాయి. రఖినేప్రాంతంతో పాటు బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని మరికొన్ని ప్రాంతాలకు సైన్యం దాదాపు 550 మంది సైనికులను పంపినట్లు ఈ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాంతంలో తీవ్రవాదుల చేతుల్లో కొంతమంది ముస్లింలు, బౌద్ధులు హత్యకు గురైన నేపథ్యంలో ఇక్కడ భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశామని రఖినే రాష్ట్ర పోలీస్‌ఛీఫ్ కల్నల్ సీన్ ల్విన్ మీడియాకు చెప్పారు.

ఐరాస ఆందోళన

రఖినే రాష్ట్రంలో కొనసాగుతున్న తాజా పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇక్కడి తాజా పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని మయన్మార్‌లో ఐరాస మానవ హక్కుల ప్రతినిధి యాంఘీ లీ వ్యాఖ్యానించారు. సైనిక దళాలు సంయమనంతో వ్యవహరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రఖినేలో శాంతి, భద్రతల పునరుద్ధరణకు ప్రయత్నించే సమయంలో మానవ హక్కులకు విఘాతం కలుగ కుండా చూడాలని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈజిప్ట్‌లో రెండు రైళ్ల ఢీ

42 మంది మృతి, 100 మందికి పైగా గాయాలు

కైరో: ఈజిప్ట్ తీర ప్రాంత నగరం అలెగ్జాండ్రియాలో శుక్రవారం రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో కనీసం 42 మంది మరణించారని, మరో 133 మందికి పైగా గాయపడ్డారని ఈజిప్ట్ ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. అలెగ్జాండ్రియా నగర శివార్లలోని సబర్బన్ స్టేషన్ వెలుపల జరిగిన ఈ ప్రమాదంలో రెండు రైళ్లు పరస్పరం ఢీకొని 'పిరమిడ్' తరహాలో గాలిలోకి లేచాయని ప్రత్యక్ష సాక్షి ఒకరు వివరించారు. ఈ ప్రమాద ఘటనపై తక్షణమే విచారణ జరిపించాలని అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి ఆదేశాలుజారీ చేశారు. ధ్వంసమైన బోగీల నుండి మృతదేహాలను వెలికి తీసేందుకు, క్షతగాత్రులకు సహకరించేందుకు సహాయక బృందాలను పంపుతున్నట్లు ఆయన ప్రకటించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో సిగ్నల్ వ్యవస్థలో తలెత్తిన లోపాలే ఈ ప్రమాదానికి కారణమని భద్రతా వర్గాలు చెప్పాయి. ఈజిప్ట్ రవాణా మంత్రి హిషమ్ అరాఫత్ మీడియాతో మాట్లాడుతూ 'మానవ తప్పిదమే' ఈ ప్రమాదానికి కారణమని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

శరద్‌యాదవ్‌కు ఉద్వాసన

కాంగ్రెస్‌తో కూడిన మహాకూటమిలో తాను కూడా భాగమేనని స్పష్టం చేశారు. జెడి (యు) కేవలం నితీష్ కుమార్ సొంత పార్టీ కాదని, ఆయన పార్టీలో భాగం మాత్రమేనని ఆయన వివరించారు. అసలైన జెడి(యు) తనతోనేవుందని, నితీష్‌తో వున్నది కేవలం 'సర్కారీ' జెడి(యు) మాత్రమేనని ఆయన వివరణ ఇచ్చారు.

అమిత్‌షా ఆహ్వానం

ఇదిలా వుండగా నితీష్‌కుమార్‌ను ఎన్డీయేలో చేరాలని కోరుతూ బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా ఆహ్వానం పలికారు. శుక్రవారం నాడు తన నివాసంలో నితీష్‌తో జరిగిన భేటీలో ఆయన్ను ఎన్డీయేలోకి ఆహ్వానించినట్లు అమిత్‌షా శనివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాగా ఎన్డీయేలో చేరే అంశంపై ఈ నెల 19న పాట్నాలో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయాన్ని తీసుకోనున్నట్లు నితీష్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. నితీష్ నేతృత్వంలోని జెడి(యు) ఎన్డీయేలో చేరిన తరువాత మోడీ కేబినెట్‌లో చేరే అవకాశాలు కూడా వున్నాయని ఈ వర్గాలు వివరించాయి.

ఐదు రోజుల్లో 60 మంది

పసిపిల్లలు మరణించారు. 'ఆగస్టు ఏడవ తేది నుండి 11వ తేది వరకు 60 మంది చనిపోయారు' అని ఆయన చెప్పారు. మంత్రి ఈ లెక్కలు చెప్పిన కాసేపటికే మరో ఇద్దరు చిన్నారులు మరణించినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఈ ఆస్పత్రిలో గత వారం రోజుల్లో మృతి చెందిన చిన్నారుల సంఖ్య 62కు చేరింది. మరోవైపు ఈ దారుణ సంఘటనలో తమ వైఫలం ఏమీ లేదని చెప్పడానికి రాష్ట్ర ప్రభుత్వం నానా తిప్పలు పడుతోంది. 'ఒక ఆస్పత్రిలో రోజుకు ఏడుగురు చనిపోవడం సహజమే' అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇచ్చిన వివరణ వివాదాస్పదంగా మారింది. ఆయన చేసిన ఈ వ్యాఖ్యపై విపక్షాలు మండిపడుతున్నాయి.

సిఎం తొలి విలేకరుల సమావేశం

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌దాస్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో గందరగోళం నెలకొంది. చిన్నారుల మరణంపై ప్రశ్నలడిగిన విలేకరులపై యోగీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన నిర్వహించిన తొలి విలేకరుల సమావేశం ఇదే కావడం గమనార్హం. ఆక్సిజన్ అందక చిన్నారులు చనిపోయారంటూ వచ్చిన వార్తలను ఒక విలేకరి ప్రస్తావించగా ఆయన తీవ్ర స్థాయిలో స్పందించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన చిన్నారుల మృతికి ఆక్సిజన్ అందకపోవడమే కారణం కాదని, వేర్వేరు కారణాలతో వారు మరణించారని చెప్పారు. ఆ ఘటనపై న్యాయవిచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. చిన్నారుల మరణాలు చోటు చేసుకున్న బాబా రాఘవదాస్ వైద్య కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ రాజీవ్ మిశ్రాను సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బిఆర్‌డి ఆసుపత్రి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రం వివరణ కోరింది. చిన్నారుల మృతికి కారణాలు, ప్రస్తుత పరిస్థితులపై తక్షణమే నివేదిక ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జెపి నడ్డా..యుపి మంత్రులు సిద్ధరామయ్య సింగ్, అశుతోష్ టాండన్‌లను ఆదేశించారు. మోడీ ఆదేశాల మేరకు అక్కడ పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయక మంత్రి అనుప్రియా పటేల్ గోరఖ్‌పూర్‌లో పర్యటించారు.

యోగి ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలి : కాంగ్రెస్ డిమాండ్

దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ బృందం శనివారం బిఆర్‌డి ఆస్పత్రిని సందర్శించింది. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడింది. వైద్యులతోనూ చర్చించింది. అనంతరం విలేకరులతో మాట్లాడిన కాంగ్రెస్ నేతలు యోగి ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్‌డి ఆస్పత్రి వద్ద శనివారం పెద్ద సంఖ్యలో పోలీసులను రాష్ట్ర ప్రభుత్వం మోహరించింది.

ఉల్లి ధర నియంత్రణకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సివిల్ సప్లై శాఖ అధికారులు దాడులు నిర్వహించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉల్లి ధరలపై 1100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులొస్తే ఆయా ప్రాంతాల్లో కొరత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుండి ఉల్లిని సేకరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రైతు బజార్లలో పూర్తిస్థాయిలో ఉల్లిపాయలు అందుబాటులో ఉండేందుకు ప్రతి 2 గంటలకోసారి సమీక్షించాలని ఆయా శాఖల అధికారుల్ని ఆదేశించారు.

నైపుణ్య శిక్షణ.. నిధుల భక్షణ

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన శిక్షణను యువతకు అందిస్తామని, అందుకు వివిధ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని పలు ప్రయివేటు సంస్థలు నిరుద్యోగులకు ఆశ చూపిస్తూ ప్రకటనలిస్తున్నాయి. మూడు నెలల శిక్షణ కాలంలో అభ్యర్థికి స్టయిఫండ్ చెల్లిస్తామని, తమ విద్యార్హతలకు సరిపడా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నిరుద్యోగ యువతకు పలు ప్రయివేటు సంస్థలు నమ్మబలుకుతున్నాయి. వాస్తవంగా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను వినియోగించుకుంటున్నాయే తప్ప, పూర్తి స్థాయిలో వారి అర్హతకు సరిపడా శిక్షణగాని, శిక్షణ తర్వాత ఉద్యోగావకాశాలుగాని లేవు. పలు శిక్షణ కేంద్రాల్లో వసతులూ సరిగా ఉండటంలేదు. ఎమ్‌బిఎ, డిగ్రీ పూర్తి చేసిన వారికి అప్పటికే కొద్దిగా కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నప్పటికీ నైపుణ్య శిక్షణ కేంద్రంలో తమకు తెలిసిన బేసిక్స్, స్కూల్‌లో చెప్పిన ఇంగ్లీష్ గ్లామరే తప్ప ఏమీ నేర్పడంలేదని విజయవాడలోని ఓ ప్రయివేటు సెంటర్‌లో శిక్షణకు తీసుకున్న వారు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కూడా తమ అర్హతకు సరిపడా ఉద్యోగం చూపించడంలేదంటు న్నారు. ప్రభుత్వం నుంచి శిక్షణ కోసం ఆ సంస్థలు నిధులు పొందుతున్నా అభ్యర్థులకు తగిన శిక్షణనివ్వ డంలేదని చెబుతున్నారు. నిధుల వినియోగం, శిక్షణ పొందిన వారు ఎంత మందికి ఉపాధి కల్పించామనే అంశాలపై ప్రర్యవేక్షణ లేదని యువజన సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. 2015-16లో రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా మొత్తం లక్షా ఏడు వేల మంది శిక్షణ పొందితే వారిలో కేవలం 26 వేల మంది మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. గతేడాది 2,69,363 మంది శిక్షణ పొందగా వారిలో కేవలం 65,679 మందికే ఉపాధి లభించింది.

మార్కెట్ పోకడలకు అనుగుణంగా శిక్షణ లేదు



ప్రస్తుత నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో ఎక్కడా బయట మార్కెట్‌కి, పరిశ్రమలకు సరిపడా శిక్షణ ఇవ్వడం లేదు. ఏయే రంగాల్లో కొత్త పోకడలు వస్తున్నాయనే విషయంలో ఆయా కేంద్రాల్లో కూడా అప్‌డేట్స్ లేవు. కేంద్ర ప్రభుత్వ పథకమైన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ యోజన, గ్రామీణ కౌశల్ యోజన వంటి పథకాల ద్వారా గ్రామీణ, పట్టణ యువతకు ఏయే రంగాల్లో శిక్షణ ఇస్తారనే అంశంలో సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో, ఆ రెండు పథకాలు పేరుకు మాత్రమే ఉన్నాయి. నైపుణ్య శిక్షణ కేంద్రాలు పారిశ్రామిక అవసరాలకు సరిపడా శిక్షణనివ్వడంలేదు. వాటిపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలి. యువతకు వారి విద్యార్హతలకు సరిపడా శిక్షణనందించి, ఉపాధి అవకాశాలు చూపించాలి.

– సూర్యారావు, డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి

పథకాల వారీగా గతేడాది నైపుణ్య శిక్షణ, లభించిన ఉపాధి వివరాలు

పథకం	శిక్షణ పొందినవారు	ఉద్యోగాలు వచ్చినవారు
ఉద్యోగ, ఉపాధి కల్పన కార్యాలయాల జాబ్ మేళా	147761	28,578
యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటిసి)	6949	4548
జాతీయ పట్టణ జీవనోపాధుల సంస్థ (ఎన్‌యుఎల్‌ఎమ్)	4855	3975
ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ (ఇఎస్‌డిఎమ్)	1975	1036
ఏపి సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్	74029	25011
ఇతర పథకాలు	33794	2531
మొత్తం	**269363**	**65679**

కూలీలపై పన్నుపోటు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేశారు. దీంతో కూలీలకు చెల్లించే మొత్తంపై కూడా పన్ను చెల్లించాల్సిన స్థితి నెలకొంది. సాధారణంగా ప్రాజెక్టుల నిర్మాణంలో ఎర్త్ వర్క్ ఉన్న చోట కూలీల పాత్ర ఎక్కువగా ఉంటుంది. మట్టి తవ్వకాలు, ఇసుక తరలింపు వంటి వాటిల్లో కూలీలు ఎక్కువగా అవసరమవుతారు. రియల్ ఎస్టేట్ రంగంలో కూడా భవన నిర్మాణ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో కీలకంగా ఉన్న పోలవరం ప్రాజెక్టుపై కూడా జిఎస్‌టి భారం పడుతుందని అంచనా వేస్తున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. పోలవరంలో ఎర్త్ వర్క్ అధికంగా ఉందని, అందుకే జిఎస్‌టి భారం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో కూడా చెరువుల తవ్వకాలకు సంబంధించిన మిషన్ భగీరథపైనా జిఎస్‌టి భారం ఎక్కువగా ఉంటుందని వివరించారు. కేవలం కూలీలతోనే భగీరథ అమలు జరుగుతోందని, అందుకే జిఎస్‌టిపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోందని వివరించారు.

ప్రాజెక్టులూ భారమే

గతంలో సేవాపన్ను మినహాయింపుతో పాటు, మొత్తం విలువలోనే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కూడా కలిసి ఉండేది. దీనిని ఐదు శాతంగా వసూలు చేసి మొత్తం విలువను నిర్ధారించేవారు. ఇందులో స్టీల్‌పై ఐదు శాతం, సిమెంట్‌పై 14 శాతం పన్నుకలిసి ఉండేది. ఈ రెండింటిలో ఏది ఎక్కువ వాడితే పన్ను శాతాన్ని మొత్తం విలువలో గణించేవారు. అలాగే నిర్మాణానికి ఉపయోగించే సరుకు, వస్తువులపై మరో ఐదు శాతం వ్యాట్‌ను వసూలు చేసేవారు. అయితే తాజాగా జిఎస్‌టి అమల్లోకొచ్చాక 12 శాతం పన్నును ప్రాజెక్టు నిర్మాణ పనుల సరుకుపై విధించారు. దీనివల్ల ప్రాజెక్టుల వ్యయం పెరిగే అవకాశాలున్నాయని అంటున్నారు. వీటన్నింటి ఫలితంగా ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం భారీగా పెరుగుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర సర్కారు లేఖ

ప్రాజెక్టులతో పాటు భవిష్యత్‌లో రాజధాని నిర్మాణం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని కూలీలపై విధించిన పన్నును ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరనుందని తెలిసింది. ఈ మేరకు సాధ్యమైనంత త్వరలోనే రాష్ట్ర సర్కారు కేంద్రానికి లేఖ రాయనుందని సమాచారం.

పంచాయతీలకు ఇఎఫ్‌ఎం విధానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమలులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. ఇందుకోసం వివిధ రాష్ట్రాలలో అమలవుతున్న విధానాలను అధికారులు ఇప్పటికే పరిశీలించారు. నిధులు పక్కదారి పట్టకుండా ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఇఎఫ్‌ఎంఎస్) సరైందని అధికారులు భావిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ విధానంలోనే కూలీలకు నేరుగా కేంద్ర ప్రభుత్వం చెల్లింపులు చేస్తోంది. ఇప్పటికే ఈ విధానం మధ్యప్రదేశ్‌లో అమలులో ఉంది. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనరేట్ అధికారుల బృందం ఇటీవల ఆ రాష్ట్రంలో పర్యటించి ఇఎఫ్‌ఎంఎస్ అమలు తీరును పరిశీలించి, ఉన్నతాధికారులకు ఒక నివేదిక సమర్పించింది. దీనిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ నూతన విధానంపై చర్చించారు. ఇఎఫ్‌ఎంఎస్‌ను రాష్ట్రంలో అమలు చేసేందుకు ఆయన మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ విధానంలో పంచాయతీలకు వచ్చే నిధులు, చేసే చెల్లింపులు అనీ బ్యాంక్ ఖాతాల ద్వారానే ఉంటాయి. ఎలక్ట్రానిక్ పద్ధతిలో చెల్లింపులు చేయడం వల్ల జవాబుదారీతనం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన విధివిధానాల రూపకల్పనకు కమిషనరేట్ అధికారులు చర్యలు కరసర్తు చేపట్టారు.


ఖమ్మంలో 'పైసా వసూల్' ఆడియో



సినిమా ప్రారంభోత్సవం రోజున విడుదల తేదీ ప్రకటించడం తెలుగు చలనచిత్ర పరిశ్రమలో జరుగుతున్నదే. అయితే... ముందు ప్రకటించిన విడుదల తేదీ కంటే ఓ నెల రోజుల ముందే రాబోతున్నది మాత్రం 'పైసా వసూల్' చిత్రమే. బాలకష్ణ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో భవ్య క్రియేషన్స్ పతాకంపై వి. ఆనందప్రసాద్ నిర్మించిన సినిమా 'పైసా వసూల్'. సెప్టెంబర్ 1న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఈ నెల 17న ఖమ్మంలో అభిమానుల సమక్షంలో జరగనున్న భారీ వేడుకలో 'పైసా వసూల్' పాటలను విడుదల చేయనున్నారు. ఈ వేడుకకు బాలకష్ణ, దర్శకుడు పూరి జగన్నాథ్, నిర్మాత వి. ఆనంద ప్రసాద్ హైదరాబాద్ నుంచి ఖమ్మంకు హెలికాప్టర్‌లో వెళ్లనున్నారు. అదే రోజున సినిమా ట్రైలర్‌ను కూడా విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా స్టంపర్ రికార్డులు స ష్టిస్తోన్న సంగతి తెలిసిందే.


నిర్మాత వి. ఆనందప్రసాద్ మాట్లాడుతూ... బాలకష్ణగారితో సినిమా చేసినందుకు ఆనందంగానూ, గర్వంగానూ ఉంది. స్టంపర్‌కు వస్తోన్న స్పందనను బట్టి నందమూరి అభిమానులు, ప్రేక్షకులు సినిమా కోసం ఎంతగా ఎదురు చూస్తున్నారో చెప్పొచ్చు. ఇటీవల విడుదలైన స్టంపర్ 68 గంటలు యూట్యూబ్‌లో ట్రెండింగ్ కావడం ఒక రికార్డుగా చెప్పుకోవాలి. ఇప్పటి వరకు డెబ్బైలక్షలమంది స్టంపర్‌ను చూశారు. బాలకష్ణ నటన, పూరీ టేకింగ్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. ప్రస్తుతం రీరికార్డింగ్ పనులు జరుగుతున్నాయి. అనూప్ రూబెన్స్ సంగీతమందించిన పాటలను ఈ నెల 17న ఖమ్మంలో అభిమానుల సమక్షంలో విడుదల చేయనున్నాం. సినిమా సెప్టెంబర్ 1న సినిమా విడుదల చేయనున్నామని' అన్నారు.

జోరు పెంచిన విక్రమ్



చాలా గ్యాప్ తీసుకుని సినిమాలు చేసే విక్రమ్ ఈసారి జోరు పెంచారు. ఇప్పటికే రెండు చిత్రాల్లో నటిస్తున్న విక్రమ్ త్వరలో మరో చిత్రాన్ని కూడా ప్రారంభించనున్నాడు. తమిళ దర్శకుడు హరి దర్శకత్వంలో 'సామి 2' చిత్రంలో నటించనున్న విషయం తెలిసిందే. 2003లో విడుదలైన 'సామి' చిత్రానికి ఇది సీక్వెల్. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెప్టెంబర్‌లో సెట్స్ పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. విక్రమ్ పోలీస్ అధికారి గెటప్‌లో కనిపించనున్నాడు. సామి చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటించింది. సామి2లో కూడా త్రిషని ఓ హీరోయిన్‌గా ఎంపిక చేశారు. విక్రమ్ ప్రస్తుతం 'స్కెచ్', 'ధవ నక్షత్రం' చిత్రాలలో నటిస్తున్నాడు.

స్వాతంత్య్రంరోజే 'రాజా ది గ్రేట్' టీజర్



రవితేజ కొంత కాలం గ్యాప్ తరువాత 'రాజా ది గ్రేట్' చిత్రంలో నటిస్తున్నాడు. అభిమానులకు రవితేజ ఇండిపెడెన్స్ డే ట్రీట్ ఇవ్వనున్నాడు. ఈనెల 15న చిత్ర టీజర్ విడుదల కానుంది. ఈ సినిమాలో రవితేజ కంటి చూపు లేని వ్యక్తిగా కనిపించబోతున్నాడు. ఇలాంటి పాత్రలో కనిపించడం రవితేజ కెరీర్‌లో ఇదే తొలిసారి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో మెహ్రీన్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రం పూర్తి స్థాయి వినోదభరితంగా తెరకెక్కుతోంది. డార్జిలింగ్, హైదరాబాద్‌లో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'దిల్' రాజు ఈ చిత్రానికి నిర్మాత. ఈ ఏడాదే ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

కృష్ణ కీలక పాత్రలో!



మహేష్ నటిస్తున్న 'స్పైడర్' చిత్రం సెప్టెంబర్‌లో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ లోపు మహేష్ బాబు కొరటాల శివ దర్శకత్వంలో 'భరత్ అనే నేను' చిత్రాన్ని ప్రారంభించాడు. రాజ కీయ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మహేష్ బాబు ముఖ్యమంత్రి పాత్ర పోషించనున్నాడు. మహేష్ రాజకీయ నాయకుడిగా కనిపించనున్నాడనే విషయమే అభిమానుల్లో ఆసక్తి కల్గిస్తుంది. కాగా, ఈ చిత్రంలో కష్ణ ఓ కీలకమైన పాత్రలో మెరవనున్నాడనేది సమాచారం. మహేష్, కష్ణతో కలసి నటించి చాలా కాలం అవుతోంది. దీనిపై అధికారిక సమాచారం లేదు. ఈచిత్ర తరువాత షెడ్యూల్‌ని లక్నోలో ప్లాన్ చేస్తున్నారు. బాలీవుడ్ హీరోయిన్ కైరా అద్వానీ మహేష్ సరసన నటిస్తోంది. కాగా మహేష్ హీరోగా నటించిన రాజకుమారుడు, వంశి, టక్కరి దొంగ వంటి చిత్రాల్లో కష్ణ నటించారు. చాలా కాలం తరువాత వీరిద్దరూ తెర పై మెరిస్తే అది అభిమానులకు పండగే అవుతుంది.

ఆయన నువ్వు హీరో అన్నారు



"సినిమాపై ముందునుంచి నమ్మకంతోనే ముందుకుసాగాం. ప్రేక్షకులు నమ్మకాన్ని నిలబెట్టారు. శుక్రవారం సాయంత్రం ఈవినింగ్ మొట్టమొదటి ఫోన్ అరవింద్ ఫోన్‌చేసి.. 'సినిమాపై నమ్మకంతో అనుకున్న సమయంలో రిలీజ్‌చేశారు. మంచి సినిమా తీశారు. మంచి భవిష్యత్ వుందని' ప్రశంసించారని" ఆనందాన్ని వ్యక్తం చేశారు 'జయ జానకి నాయక' నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి. శనివారం ఆయన విలేకరులతో తన ఆనందాన్ని పంచుకున్నారు.

సినిమా విడుదల ముందు నుంచీ జగపతిబాబుగారు కేర్ తీసుకుని.. ఫ్యామిలీ మెంబర్‌కంటే ఎక్కువగా మాట్లాడేవారు. ప్రమోషన్‌పరంగా బిజినెస్‌పరంగా వివరాలు తెలుసుకుంటూనేవున్నారు. కష్టపడిపనిచేస్తే ఫలితం బాగుంటుందని అన్నారు. ఇలాంటి నిర్మాత పరిశ్రమకు అవసరం చెప్పారు. ఈ సినిమాకు మీరే హీరో అని' చెప్పారు. ఇక చిత్ర హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ ఆనందానికి అవధుల్లేవు. సినీకెరీర్‌లో ఇలాంటి సినిమా వస్తుందో రాదో అన్నంత సంతోషంగా వున్నారు. దర్శకుడు బోయపాటి ఒకే నమ్మకంతో తీశారు. విజయం సాధించాం. హంసలదీపి ఎపిసోడ్.. హాలీవుడ్ స్థాయిలో వుందనే ప్రశంసలు వస్తున్నాయి. ఆ ఎపిసోడ్ 30రోజులు నీళ్ళలోనే తీశాం. అక్కడికి వాహనాలు వెళ్లడం కష్టం. నాలుగు కిలోమీటర్ల దూరంలో పెట్టి వెళ్ళాలి. చిత్ర యూనిట్ ఎంతో కష్టపడ్డారు. అందుకు నా వంతు సహకారం అందించానని' వివరించారు.

దేవిశ్రీప్రసాద్ అందించిన రీ రికార్డింగ్ సినిమా స్థాయిని పెంచింది. 'వీడే.. అనే పాటను మంచి స్పందన వస్తుందని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. అలాగే ఓవర్‌సీస్‌లో చాలా మంచి టాక్ వచ్చింది. కలెక్షన్స్ పెరుగుతున్నాయి. భవిష్యత్‌లో తీయబోయే ప్రతి సినిమాను కథను బట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తాను. కథను నమ్మే సినిమాలు చేస్తాను. బోయపాటిగారితో త్వరలోనే సినిమా చేసే అవకాశం ఉంది. రెండు మూడు సినిమాలు చర్చల్లో ఉన్నాయి. వాటి వివరాలను త్వరలోనే తెలియజేస్తాను" అన్నారు.



తమన్నా కొద్దీ రోజులుగా తన సోదరుడి వివాహ కార్యక్రమాల్లో బిజీగా గడిపింది. ఇపుడు మరలా తన చిత్రాలపై దష్టి సారించింది. ఆమె ప్రస్తుతం విక్రమ్ హీరోగా నటిస్తున్న 'స్కెచ్' చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్ర షూటింగ్ త్వరలో పూర్తి కానుంది. ఆమెకు సంబంధించిన సన్నివేశాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా తమన్నా

విజయ్ సర్‌ను మిస్సవుతున్నా!

స్పందించింది. "స్కెచ్ చిత్ర యూనిట్‌తో కలసి పనిచేయడం ఓ అందమైన ప్రయాణం. అప్పుడే షూటింగ్ అయిపోయిందా! అనే బాధ కల్గింది. విక్రమ్ సర్‌ని మిస్సవుతున్నా" అని తెలిపింది. విజయ్ చందర్ ఈ చిత్రానికి దర్శకుడు. ఇది కాక మరో రెండు చిత్రాల్లో తమన్నా నటిస్తోంది.

ఫిట్‌నెస్‌పై ఎన్‌టిఆర్ శ్రద్ధ



ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'జై లవ కుశ' సినిమా చేస్తున్నాడు. కల్యాణ్ రామ్ నిర్మిస్తోన్న ఈ సినిమా, షూటింగ్ పరంగా చివరి దశకి చేరుకుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తి కాగానే త్రివిక్రమ్‌తో కలిసి ఎన్టీఆర్ సెట్స్ పైకి వెళ్లనున్నాడు. ఈ సినిమాకి సంబంధించిన స్క్రిప్ట్ పనులు ఇప్పటికే పూర్తయిందని తెలుస్తోంది. కాగా, ఇందులో ఎన్టీఆర్ కొత్త లుక్‌తో కనిపించనున్నాడు. అందుకోసం బరువు తగ్గాలనీ .. మరింత ఫిట్‌గా కనిపించాలని త్రివిక్రమ్ సూచించాడట. దాంతో డైట్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, నిపుణుల పర్యవేక్షణలో జిమ్‌లోనే ఎక్కువ సమయాన్ని గడుపుతున్నాడట. వచ్చే ఏడాది వేసవి సెలవుల్లో ఈ సినిమాను విడుదల చేయాలనే ఆలోచనలో వున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియనున్నాయి.

కథలో మార్పులు చేస్తే ఇవ్వనన్నా : తేజ

నేను మొదట కథను సురేష్‌బాబుకు చెప్పాను. ఆయన ఇది బాగోలేదు. మార్పులు చేసి తీసుకురా అన్నారు. నేను చేయనని వెళ్ళిపోయాను. కానీ ఆ రాత్రి ఆలోచించాక.. రానా హీరో కాబట్టి మార్పులు అవసరమని అనిపించి మార్పులు చేశాను. తర్వాత పరుచూరి బ్రదర్స్ వద్దకు పంపారు. వారిని చూడగానే కథను కథగా తీయాలి అని చెప్పా. ఆ తర్వాత వారు కథ విని దాన్ని తుదిరూపం తెచ్చాక 'నేనే రాజు నేనే మంత్రి'గా మారింది. విడుదలైన ఈ సినిమాను ప్రజలు ఆదరించడం చాలా ఆనందంగా వుందని.. దర్శకుడు తేజ మనసులోని మాటను ఆవిష్కరించారు. శనివారంనాడు రామానాయుడు స్టూడియోలో చిత్ర యూనిట్ పాల్గొంది. రానా మాట్లాడుతూ... ఈ ఏడాదిలో బాహుబలి, ఘాజీ, నేనే రాజు నేనే మంత్రి చిత్రాలతో హ్యాట్రిక్ దక్కించుకున్నాను. ఇకపై కూడా మంచి కథల్నే ఎన్నుకుని చేస్తాను. దర్శకుడు తేజకు ముందు విజయాలు లేకపోయినా.. ఆయనపై నమ్మకంతోనే చేశాను. విజయాన్ని సాధించామని పేర్కొన్నారు. పరుచూరి బ్రదర్స్ తెలుపుతూ... సురేష్ ప్రొడక్షన్‌లో 48వ చిత్రమిది. ఇంకా రెండు చిత్రాలు పూర్తిచేసి యాభై చిత్రాలు చేస్తాం. సమకాలీన రాజకీయ నేపథ్యంలో సాగిన ఈ చిత్రానికి పనిచేయడం చాలా ఆనందంగా వుందని అన్నారు.



తేజ, పరుచూరి బ్రదర్స్, రానా, అనూప్ రూబెన్స్

'సచ్చింది రా గొర్రె'

శ్రీనివాస్‌రెడ్డి, టిల్లు వేణు, బజర్దస్త్ రాకేశ్, శివారెడ్డి, చిత్రం శీను, సత్యవతి, కోట శంకరరావు తదితరులు నటిస్తున్న చిత్రం 'సచ్చింది రా గొర్రె'. ముంబైకి చెందిన నిర్మాణ సంస్థ సోహం రాక్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్, హైదరాబాద్‌కు చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియో సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రీధర్‌రెడ్డి యార్వ దర్శకుడు. ప్రముఖ హీరోయిన్ నటిస్తోంది. గతంలో హర్షవర్ధన్ రాణే హీరోగా 'సనమ్ తేదీ కసమ్' నిర్మించిన రాక్‌స్టార్ సంస్థ ప్రస్తుతం 'చమీలీ కీ షాదీ'ని రీమేక్ చేసే పనిలో ఉన్నారని నిర్మాత దీపక్ ముకుత్ తెలియ జేశారు. 'క్షణం, రాజుగారి గది' సినిమాలను నిర్మించిన మ్యాట్నీ ఎంటర్‌టైన్ మెంట్‌లో భాగస్వామి అయిన ఎన్ఎం. పాషా ప్రస్తుతం ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియో పేరుతో స్వంత నిర్మాణ సంస్థ ద్వారా సినీ నిర్మాణం చేస్తున్నారు. మంచి కథలకు నూతన ఆలోచనలకు తావుండే విధంగా అర్ధవంతమైన వినోదాత్మకమైన సినిమాలను రూపొందించడమే తమ సంస్థ లక్ష్యమని పాషా తెలియజేశారు. పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్‌కి క్రియేటివ్ హెడ్‌గా వ్యవహరించిన దర్శకుడు శ్రీధర్‌రెడ్డి యార్వా తెలుపుతూ... మంచి క్వాలిటీతో సినిమా తెరకెక్కిస్తున్నాం. ఈమధ్యనే చిత్రీకరణ ప్రారంభించాం. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్ జరుగుతోంది. నవంబర్‌నాటికి షూటింగ్ ముగించుకుని డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కెమెరా: రమణ సాల్వా, సంగీతం: సంతోష్ కుమార్.

సౌండ్ డిజైన్‌కే మూడు నెలలు పట్టింది



70 ఎం.ఎం.ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై తాప్సీ పన్ను, శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్ ప్రధాన తారాగణంగా నటిస్తున్న చిత్రం 'ఆనందో బ్రహ్మ'. మహి వి.రాఘవ్ దర్శకుడు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. ఈనెల18న విడుదలవుతుంది. ఈ సందర్భంగా దర్శకుడు మహి వి.రాఘవ్ చిత్రం గురించి ఇలా తెలియజేశారు.

– 'పాఠశాల' సినిమా తర్వాత ఓ మంచి సినిమా చేయాలనే ఉద్దేశంతో సమయం తీసుకున్నాను. స్క్రిప్ట్ రాయడానికి, నటీనటుల డేట్స్ దొరకడంలో కాస్తా సమయం పట్టింది.

–నేను దెయ్యాన్ని కానీ, దేవుణ్ని కాను నమ్మను. ఈ రెండింటికీ కారణం భయమే. కామెడి జోనర్‌లో చేద్దామని అనుకున్నప్పుడు ఎలాంటి కామెడి చేద్దాం...క్రైమ్ కామెడి సినిమా చేద్దామా, హారర్ కామెడి మూవీ చేద్దామా అని ఆలోచించాను. చివరకు హారర్ కామెడి సినిమా చేయడానికి రెడీ అయ్యాను. మనకు థీమ్ ఉండాలి, దాన్ని కొత్తగా చెబితేనే ఆడియెన్స్‌కు నచ్చుతుంది కదా అని ఆలోచించినప్పుడు హారర్ థీమ్‌నే రివర్స్‌గా చెబితే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. అలా అనుకున్నప్పుడే దెయ్యం మనిషికి భయపడితే ఎలా ఉంటుందని ఆలోచన వచ్చింది. నేను చెప్పే రివర్స్ థీమ్ లాజిక్‌తో ఉంటుంది. క్యారెక్టర్స్ డిఫరెంట్‌గా ఉంటాయి. ఒకడేమో తాగుబోతు. మరొకడికి చెవుడు, ఇంకోడికి రేచీకటి కూడా ఉంటుంది. భయం వచ్చినప్పుడు వాడు ఫ్లూట్ వాయిస్తూ ఉంటాడు. ఒకడు స్పిరిట్ పర్సనాలిటీ ఉంటుంది. శ్రీనివాసరెడ్డికి గుండె సమస్య ఉంటుంది. ఇలా లోపాలు ఉండేవాళ్లకి ఆ లోపాలే బలంగా మారుతాయి. కథంతా ఓ ఇంట్లోనే జరుగుతుంది.

– తాప్సీకి మరో సెపరేట్ ట్రాక్ ఉంది. తాప్సీ కథ విని చేయడానికి సిద్ధమైంది. కానీ నాకు నిర్మాత దొరకడానికి సమయం పట్టింది. తనేమో ముంబై వెళ్లిపోయింది. బిజీ హీరోయిన్‌గా ఉంది. నాకు నిర్మాత దొరకగానే తనకు ఫోన్ చేశాను. తను ఏమాత్రం ఆలోచించకుండా వచ్చి నటించింది. ఈ సినిమాలో పెద్ద ట్విస్ట్ ఉంది. అదేంటనేది సినిమాలో చూడాల్సిందే. 'విలేజ్‌లో వినాయకుడు, కుదిరితే కప్పు కాఫీ, పాఠశాల' సినిమాలను నేను నిర్మించాను. 'పాఠశాల'ను నిర్మిస్తూనే డైరెక్ట్ చేశాను. 'ఆనందో బ్రహ్మ'కు దర్శత్వం వహించాను. నేను కథ ప్రిపేర్ చేసుకోవడానికే ఎక్కువ సమయం తీసుకుంటాను. సుమారుగా ఆరు నుండి ఏడాది సమయం తీసుకుంటాను. అలాగే కథకు తగ్గట్టు ఆర్టిస్టులను ఎంపిక చేసుకోవడానికి కూడా సమయం పడుతుంది. ఈ సినిమాలో కూడా తాప్సీ డేట్స్ కోసం నాలుగు నెలలు వెయిట్ చేశాను.

– హారర్ సినిమాల్లో సౌండ్ చాలా కీలకపాత్రను పోషిస్తుంది. అందుకనే మేం సౌండ్ కొత్తగా ఉండాలని చాలా సమయం తీసుకున్నాం. సౌండ్ డిజైనింగ్ చేయడానికి రెండు మూడు నెలల సమయం తీసుకున్నాం. కామెడీ కూడా క్యారెక్టర్స్ నుండి పుట్టే సిచ్యువేషనల్ కామెడీ. ఎమోషనల్ డ్రామా అన్నింటి కలయికలో మంచి కథ కుదిరింది. సినిమాలో కనపడే దెయ్యాలు భయపెట్టేలా ఉండవు. వాటి మధ్య కూడా మంచి సన్నివేశాలుంటాయి.





జీవితమే కామిక్!

చాలామంది సమాజం 'ఇలా ఉంది... అలా ఉంది...' అంటూ చుట్టూ ప్రపంచాన్ని వ్యంగ్యంగా మాట్లాడుకుంటారు. రోడ్డుపై కనిపించే అదుపులేని ట్రాఫిక్ నుంచి సమాజం చెప్పే కొన్ని అర్థంలేని నీతినియమాల వరకూ చాలా విషయాలు ఇద్దరు ముగ్గురు కూడిన చోట చర్చకు వస్తాయి. అవి మన ఇంట్లో కనిపించే విశేషాలే కావచ్చు కూడా... మనం ఫన్‌గా మాట్లాడుకునే ఆ విషయాలనే శైలేష్ గోపాలన్ అనే యువకుడు కామిక్స్‌గా రూపొందిస్తున్నాడు. ప్రతిరోజూ మనకి కనిపించే, ఎదురయ్యే సంఘటనలే ఇతడి బొమ్మలకు సబ్జెక్ట్. 'బ్రౌన్ పేపర్‌బ్యాగ్' పేరుతో భారత సమాజంలోని వ్యవహారశైలిని ప్రతిబింబిస్తున్న ఇతని కామిక్ కథే ఈ వారం 'జోష్'లో చదువుదాం.



తన చుట్టూ ప్రపంచాన్నే కామిక్స్‌గా రూపొందించి వెబ్ సిరీస్‌ను నడుపుతున్నాడు శైలేష్ గోపాలన్. బెంగళూరుకు చెందిన శైలేష్ ఇరవై ఏళ్లకే రచయితగా, కళాకారుడిగా, యానిమేటర్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇతను రూపొందించిన 'బ్రౌన్ పేపర్‌బ్యాగ్' అనే వెబ్ కామిక్ అతి తక్కువ సమయంలోనే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది అభిమానుల్ని సంపాదించుకుంది.

భలే గుర్తింపు

శైలేష్ యానిమేషన్ డిజైనింగ్ చదువుకుంటున్నాడు. అప్పుడప్పుడూ వెబ్ కామిక్స్ చదివే ఇతనికి అలాంటిదేదో ఒకటి చేయాలనే ఆరాటం ఉండేది. అయితే అనుకోకుండా ఇదొక సెన్సేషన్ అవుతుందని ఊహించనేలేదు. కొత్తకొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆరాటం ఉన్న వ్యక్తి శైలేష్. అలా చాలా ప్రాజెక్టులు అనుకుని, మొదలుపెట్టి, వదిలేసిన సందర్భాలూ ఉన్నాయ్. కానీ 'బ్రౌన్ పేపర్‌బ్యాగ్' విషయంలో అలా జరగలేదు. ఇప్పుడు శైలేష్‌కు ఇది చాలా ఇష్టమైన ప్రాజెక్ట్‌లా మారింది. దీనికి కారణం ప్రజల్లో దీనిపై ఎక్కువ ఆదరణ పెరగడమే. తన స్నేహితులు, కుటుంబం కోసం పది స్ట్రిప్‌లు రూపొందిస్తే, రెండు రోజుల్లో 25 వేల మంది దీన్ని ఫాలో అయ్యారు. అనుకోకుండా సంభవించిన ఈ పరిణామానికి ముగ్ధుడైన శైలేష్ కామిక్స్‌ని మరింత ప్రేమించడం ప్రారంభించాడు. ప్రజలు ఆదరించడం మొదలుపెట్టిన తర్వాత కార్టూన్లు రూపొందించడంపై మరింత బాధ్యత పెరిగిందంటాడు. కార్టూన్ గీసిన ప్రతిసారీ దాన్ని చూసి ఎంతమంది అసంతృప్తి చెందుతారో అంటాడు నవ్వుతూ.

నో పాలిటిక్స్

ఎక్కడ చూసినా రాజకీయాలు విరివిగా ప్రచారంలో ఉండేవే. వార్తపత్రికల్లో రాజకీయలపైనా, రాజకీయ నాయకులపైనా ప్రతిరోజూ కామిక్స్ వస్తుంటాయి. అందుకే శైలేష్ కామిక్స్‌లో రాజకీయాలకు చోటులేదు. జీవన వ్యవహారంలో ఉన్న చిన్నచిన్న సంఘటనలే ఇతని కథలు. వీటికి 'బ్లూపర్‌స్టీషియన్', 'స్ట్రే హంగ్రీ', 'స్ట్రే పూలిష్', 'స్ప్యూపిడిటీ', 'మెయిడ్ ఫర్ ఈచ్ అదర్' అంటూ ఆసక్తి కలిగించే పేర్లు పెడతాడు. సమకాలీన దేశపరిస్థితులకు అద్దం పట్టినట్లుంటాయి ఇతని కార్టూన్లు. శైలేష్ గీసే కామిక్స్‌లో పాత్రలకు బ్రౌన్ కలర్ మాత్రమే ఉంటుంది. దానికి కారణం మనదేశంలో ఏ మూలనున్న వారైనా కొన్ని సందర్భాల్లో ఒక్కటైపోతారు. అందులో ఒకటి మన రంగు. విదేశీయులు కూడా భారతీయులను 'బ్రౌన్ కలర్డ్' అనే సంభోదించడం తెలిసిందే. అదే దృష్టిలో భాగంగా బ్రౌన్ కలర్‌ను ఎంచుకున్నాడు. మొదటిగా ఒక టాపిక్ ఎంచుకుని, దాని తర్వాత కథ, కథనాన్ని రూపొందించుకుంటాడు. తర్వాత ప్యానలింగ్ చేసి, తుదిగా కామిక్ రూపొందిస్తాడు.

మన పాత్రలే

ఇంతమంది ఈ కార్టూన్లను అభిమానించడానికి కారణం ఒక్కటే. శైలేష్ గీసిన కార్టూన్లో వారిని వారు చూసుకుంటారు. భారతదేశ వ్యవహారంలో ఉన్న నైతికత నుండి మూఢనమ్మకాల వరకూ.. ఇలా రోజువారీ కార్యకలాపాల్లో కనిపించే నిజమైన సంఘటనలు ఈ కార్టూన్లలో ప్రతిబింబిస్తాయి. ఈ కామిక్స్‌లో పాత్రలుగా వివిధ వయసులకు సంబంధించిన వారుంటారు. వీళ్ళు ఆయా సందర్భాల్లో ఎలా ప్రతిస్పందిస్తారో కార్టూన్లూ తెలుపుతాయి. భారతదేశంలో యువత ఎంత మోడ్రన్‌గా మారుతున్నారు? సనాతన ఆలోచనలు గల పెద్దలు ఎలా స్పందిస్తున్నారు? అనే అంశాలు నవ్వు పుట్టిస్తాయి. అయితే శైలేష్ కామిక్స్‌లో చాలా సంఘటనలు తన జీవితంలో.. తన కుటుంబంలో ఎదురైనవే కావడం విశేషం. ఈ కార్టూన్ పాత్రల్లో శైలేష్ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు కనిపిస్తారు. శైలేష్ కార్టూన్లలో హీరో పేరు కబీర్. సందర్భాన్నిబట్టి వచ్చిపోయే మిగతా పాత్రలకు పేర్లు లేవు.

పత్రికల్లో కాకుండా ఇంటర్‌నెట్ వేదికగా ప్రచురించే ఈ వెబ్ కామిక్ సిరీస్‌కు పరిధి ఎక్కువంటాడు శైలేష్. దేశంలోనే కాక విదేశాల్లో తన కార్టూన్లు ఆదరిస్తున్నవారు చాలా మంది ఉన్నారు. ప్రపంచంలో చాలా సంస్కృతులు ఉన్నాయి. కానీ విదేశాల నుండి కొందరు శైలేష్ కార్టూన్లపై స్పందిస్తూ, వారూ ఈ కామిక్స్‌లో తమని చూసుకుంటున్నారంటే చాలా ఆశ్చర్యంగా ఉందంటాడు. "మన దేశంలో ఉన్నట్లే కొన్ని సంస్కృతులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయనీ, మానవ నైజంలోనే చాలా దగ్గర పోలికలు ఉన్నాయని అర్థంచేసుకోవచ్చు. అయితే ప్రస్తుతం కార్టూన్ల వలన చదువుకు కొంత ఇబ్బంది ఏర్పడటంతో ఎక్కువ కామిక్స్ రూపొందించ లేకపోతున్నా. భవిష్యత్తులో వీటన్నింటినీ పుస్తకరూపంలో తీసుకు రావాలనే ఆలోచన చేస్తున్నా" అన్నాడు.





మా మంచి ప్రాక్టికల్స్

సాధారణంగా ఒక రిటైల్ స్టోర్ పెట్టుకోవాలంటే చదువు పూర్తయిన తర్వాత మొదలుపెడతారు. కానీ చదువులో భాగంగా స్టోర్ నిర్వహించడం మొదటిసారి దర్శనమిచ్చింది. అందులోనూ చదువుకుంటున్న క్యాంపస్‌లోనే ఈ స్టోర్‌కు అంకురార్పణం జరిగింది. బేతేల్ రిటైల్‌స్టోర్ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ఏకంగా దేశంలోనే విద్యార్థులచే నడపబడుతున్న మొట్టమొదటి రిటైల్‌స్టోర్‌గా గుర్తింపు పొందింది. హైదరాబాద్‌లోని సెంట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్ విద్యార్థులే ఈ ఘనత సాధించారు. రిటైల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్‌లో బ్యాచులర్ ఆఫ్ ఒకేషనల్ చదువుతున్న అమ్మాయిలు వాళ్ల క్యాంపస్‌లో ఈ స్టోర్ మొదలుపెట్టారు. దాన్లో బట్టలు, నగలు, ఫుట్‌వేర్, కాస్మొటిక్స్ మొదలైన ఉత్పత్తులు అమ్ముతున్నారు. మార్కెటింగ్, ప్రమోషన్, ఉత్పత్తులను సర్దుబాటు చేయడం, ఆర్థిక వ్యవహారాలతో పాటు సంబంధిత కార్యకలాపాలన్నీ విద్యార్థులే చూస్తారు. తరగతిగదిలో పాఠాలు నేర్చుకుని, ప్రాక్టికల్ జ్ఞానాన్ని ఈ రిటైల్‌స్టోర్‌లో పొందుతుంటారు. కాలేజ్‌లో ఉన్న అన్ని డిపార్ట్‌మెంట్లకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులే కాకుండా బయటివ్యక్తులూ ఎవరైనా ఈ స్టోర్‌లో కొనుగోలు చేయవచ్చు.

"మా విద్యార్థులు మూడేళ్లలో పారిశ్రామికవేత్తలుగా తయారవుతున్నారు. కోర్సు పూర్తయిన వెంటనే ఏదైనా రిటైల్‌స్టోర్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఎంపికయ్యేలా ఇక్కడ విధివిధానాలు రూపొందిస్తున్నాం. ప్రతీ బ్యాచ్‌లోని విద్యార్థులు ఏడాదిపాటు ఈ స్టోర్ నిర్వహించే బాధ్యతలు తీసుకుంటారు. ప్రయివేటు వ్యాపారులూ మా ఈ స్టోర్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. ఒకసారి స్టాక్ లోపలికి వచ్చిందంటే.. అక్కడి నుంచి పూర్తి బాధ్యతలు విద్యార్థులే చూసుకోవాలి. మార్కెటింగ్, అమ్మకాలు, లెక్కలు, రెవెన్యూ జనరేషన్ వంటి విషయాలన్నీ విద్యార్థులే నిర్వహించడం వలన వారికి ప్రాక్టికల్‌గా సబ్జెక్ట్‌పై పూర్తి అవగాహన వస్తుంది" అంటున్నారు అక్కడి ఉపాధ్యాయులు. ఉదయం 8.30 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఈ స్టోర్ తెరిచే ఉంటుంది. కనీసం ఇద్దరు విద్యార్థులు స్టోర్‌లో సేల్స్ నిర్వహిస్తారు. అయితే కొనకుండా చూసిపోయే కస్టమర్లతో చాలా విసిగిపోతున్నామనీ మొత్తుకుంటున్నారు విద్యార్థులు. ఏదేమైనా ఈ స్టోర్‌లో పొందిన అనుభవంతో కెరీర్‌లో ఉన్నతంగా ఎదగొచ్చనే గట్టి నమ్మకం ఏర్పడందని విద్యార్థులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ★



ఇష్టంతో చేస్తే విజయమే!

ఇంటర్‌నెట్‌లో, న్యూస్ పేపర్లలో యువత గురించి చాలా కథనాలు వస్తున్నాయి. కొందరు యువత మంచి చదువులు చదువుకుని వ్యవసాయం చేస్తున్నారు. కొందరు వినూత్నంగా ప్రయాణాలు చేస్తున్నారు. కొత్తకొత్త వృత్తినైపుణ్యాలతో అద్భుతమైన జీవితానికి ఉదాహరణలుగా నిలుస్తున్నారు. కానీ ఇలాంటి పరిస్థితుల్లో కూడా నిరుద్యోగులుగా మిగిలిపోతున్నవారు చాలా మంది ఉంటున్నారు. కుటుంబ కష్టాలు, ఆర్థికస్థితిగతుల కారణంగా కొందరు ప్రభుత్వ ఉద్యోగమే పరమావధిగా భావిస్తున్నారు. మరికొందరు టాలెంట్ ఉన్నా అవకాశాలు లేక మంచి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. నిజమే అందరికీ విద్యనందించడంతో పాటు వారికి ఉద్యోగం చూపించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై తప్పనిసరిగా ఉంది. కానీ దాన్ని విస్మరిస్తూ ప్రభుత్వ కొలువులు చూపించకపోగా ప్రైవేటు కంపెనీల్లో కూలీల కంటే దౌర్భాగ్యమైన జీతం అందుకుంటున్నా పట్టించుకోకుండా, ఆ ప్రైవేటు కంపెనీల శ్రేయస్సే ముఖ్యమైనట్లు ప్రవర్తిస్తున్నాయి ప్రభుత్వాలు. ప్రజల శ్రేయస్సు ఎలక్షన్ మ్యానిఫెస్టోల్లో రాతలుగా, వేదికలపై కోసే కోతలుగా మిగులుతున్నాయి తప్ప నిజరూపంలో కనిపించడంలేదు. దీన్ని నిరసించాల్సిన ప్రతిపక్షాలు రాజకీయాలు చేసి రాజ్యమేలాలనే ఆలోచన చేస్తున్నారుగానీ నిరుద్యోగుల కష్టాలు తీరడానికి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించడంలేదు. అందుకే యువత సృజనాత్మకతపై దృష్టిపెట్టాలి. డబ్బే పరమాధిగా కాకుండా జీవితంలో వినూత్నంగా కృషిచేసి, సాధించగలిగే మార్గాలను కనుక్కోవాలి. మనకు ఏది ఇష్టమో ఆ అంశంపై ఏకాగ్రతతో, నిబద్ధతగా పనిచేయగలిగితే విజయం సాధించగలమని గుర్తించాలి.



- అనీల్ ప్రకాష్, గుంటూరు.

రైజ్ యువ(ర్) వాయిస్



యువత ఆలోచనలకు అద్దంపట్టే ఒక ప్రత్యేక కాలమ్ రైజ్ యువ(ర్) వాయిస్. మీ వాయిస్ పంపవలసినది : జోష్, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం: 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2 లేదా ఫోన్ నెం: 9490099417కు కాల్ లేదా మెసేజ్ చేయవచ్చు లేదా joshprajasakti@gmail.com కు మెయిల్ పంపగలరు.

ఎవరి గొప్ప వారిది-1

కథ: విద్వాన్ చొప్ప వీరభద్రప్ప (సెల్: 98474 50984)
బొమ్మలు: తుంబలి శివాజీ (సెల్: 98492 27509)



పొడుపు కథ

ఎగిరితే ఎగురుతుంది.. వంగితే వంగుతుంది.. నడిస్తే నడుస్తుంది.. నోట మాట లేదు ఏమిటది?

జోక్ :

రాము : రాజూ! ఆ మనిషి తాటిచెట్టు ఎలా ఎక్కాడంటావు?

రాజు : ఏముందీ.. అది పొట్టిగా ఉన్నప్పుడే దానిమీద కూర్చుని ఉంటాడు.. చెట్టు పెరుగుతూవుంటే వాడూ పెరిగి ఉంటాడు.

రాము : ఆ..!!??



చిన్నారి



గుర్తించండి!

పిల్లలూ..! పైనున్న చిత్రంలో కిందున్న కొన్ని బొమ్మలు దాగున్నాయి అవి ఎక్కడున్నాయో గుర్తించండి!

రెండు ఖండాలలోవిస్తరించి ఉన్న రష్యా





ప్రపంచంలో ఐదు మహాసముద్రాలున్నాయని మనకు తెలుసు. చిన్న చిన్న సముద్రాలు మరిన్ని ఉన్నాయని కూడా తెలుసు. కానీ, ఒకే దేశంలో పన్నెండు సముద్రాలు ఉన్నాయట! మరి ఆ దేశం ఏదో కాదు, అదే రష్యా. రెండు ఖండాలలో (ఆసియా, ఐరోపా) విస్తరించి ఉన్న విశాలమైన దేశం రష్యా. వైశాల్యంలో ప్రపంచంలోనే అతి పెద్ద దేశం ఇది (మొదటిది చైనా). 15 కోట్ల మంది నివసించే రష్యాకు అనేక ప్రపంచ రికార్డులు ఉన్నాయి. ఈ దేశంలో పన్నెండు సముద్రాలు ఉన్నాయి. ఇక్కడ ట్రాన్స్ సైబీరియన్ రైల్వే (మాస్కోని వ్లాదివాస్తోక్‌ను కలిపే) మార్గం ప్రపంచంలోనే అతి పొడవైన రైల్వేమార్గం. 9,289 కిలోమీటర్ల పొడవుండే ఈ మార్గంలో నాన్‌స్టాప్‌గా వెళ్లినా.. ఈ చివర నుంచి ఆ చివరకు చేరుకోవడానికి దాదాపు వారం పడుతుందట! ప్రపంచంలోనే లోతైన సరస్సు రష్యాలోనే ఉంది. ప్రపంచంలోని మొత్తంలో గడ్డకట్టని మంచినీటిలో 20 శాతం నీరు ఈ సరస్సులోనే ఉందట! నీటి వనరులలోనే కాదు అత్యధికంగా అడవులు ఉన్న దేశం కూడా రష్యానే కావడం మరో విశేషం. చమురును ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశాలలోనూ రష్యాది రికార్డే. విశాలమైన భూభాగం ఉన్న ఈ దేశంలో పదిమంది మాత్రమే నివసిస్తున్న గ్రామాల సంఖ్య 30 వేల వరకు ఉందట! దాదాపు 11 వేల గ్రామాల్లో జనాలే లేరట. ఇక్కడ నిరక్షరాస్యత, నిరుద్యోగం అన్న పదాలు వినిపించవు తెలుసా? ★

ఆటలు



ఫైనల్ రేసులో బోల్ట్ సునాయాసంగా

లండన్ : జమైకన్ పరుగుల యంత్రం ఉసేన్ బోల్ట్ తన చివరి రెండో పరుగులో 4x400 రిలేలో జట్టును సునాయాసంగా ఫైనల్స్‌కు చేర్చి తన సత్తాను నిరూపించాడు. శనివారం నాటి ఉదయం జరిగిన హీట్స్‌లో భారీగా తరలివచ్చిన జనసందోహం నడుమ బోల్ట్ ఉరిమే ఉత్సాహంతో దౌడ్ తీశాడు. అనుకోని రీతిలో 100 మీటర్ల పరుగులో కాంస్యంతో నిరాశ పర్చిన బోల్ట్ ఈ పరుగును సవాల్ తీసుకున్నాడు. 400 మీటర్ల రిలేలో అమెరికన్ స్ప్రింటర్ల జట్టు 37.70 సెకన్లతో తొలి స్థానంలో నిలిచింది. జమైకా బృందం ట్రాసీ, జులెయిన్ ఫోర్టీ, క్యాంపెబెల్‌లు తో పాటు బోల్ట్ ఎనిమిది జట్ల రేసులో 37.95తో రెండో స్థానంలోను నిలిచారు. ఫ్రాన్స్ 38.03తో మూడులోను, చైనా 38.20సెకన్లతో నాలుగో స్థానంలో నిలిచాయి. ఐదోసారి ప్రపంచ పతకంపై గురిపెట్టిన జమైకాకు అమెరికా నుంచి గట్టిపోటీనే ఎదురైంది. బోల్ట్ సారథ్యంలో జమైకన్ టీమ్ 2015 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, రియో ఒలింపిక్స్‌ల్లోను స్వర్ణం సాధించిన విషయం తెల్సిందే.

పల్లెకలెలో రికార్డుల జోరు

- భారత్ తొలి ఇన్నింగ్స్ 329/6
- రాణించిన శ్రీలంక బౌలర్లు పుష్పకుమార, సందకన్

పల్లెకలె: శ్రీలంక పర్యటనలో సిరీస్ వైట్‌వాష్‌పై కన్నేసిన విరాట్ సేన రికార్డుల జోరులో భారీ స్కోర్ దిశగా సాగుతోంది. మూడో టెస్ట్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 329/6 పరుగులు చేసింది. సాహా 13, పాండ్య ఒక్క పరుగుతో క్రీజులో నిలిచారు. టాస్ గెలిచిన విరాట్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. పల్లెకలె టెస్ట్‌కు వర్షం ఆటంకంగా ఉంటుందన్న ప్రచారానికి తెరపడటంతో భారత్ భారీ స్కోర్ చేయడానికి ఓపెనర్లు గట్టి పునాది వేశారు. శ్రీలంక జట్టు మూడు మార్పులతో తుది జట్టును బరిలో దింపింది. గాయాల బారిన పడి మూడో టెస్ట్‌కు దూరమైన హెరాత్, ప్రదీప్, ధనుంజయ డిసిల్వా స్థానాల్లో లెఫ్ట్ ఆర్మ్ రిస్ట్ స్పిన్నర్ లక్షణ్ సందకన్, పేస్ బౌలర్లు లాహిరు కుమార, విశ్వా ఫెర్నాండోలు బరిలో దిగారు. భారత్ తరపున సస్పెన్షన్ గురైన జడేజా స్థానంలో చైనమన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్ చేరాడు. దీంతో అక్షర పటేల్‌ను బెంచ్‌కే పరిమితం చేశారు. 2004లో కేప్‌టౌన్ టెస్ట్‌లో డేవ్ మొహ్మద్(వెస్టిండీస్), పాల్ ఆడమ్స్(దక్షిణాఫ్రికా) తరపున తర్వాత ఇద్దరు చైనమన్ బౌల ర్లు తలపడ్డారు. ఆ తర్వాత 13 ఏళ్ల తర్వాత భారత్ తరపున కుల్‌దీప్, శ్రీ లంక తరపున సందకన్‌లు బరిలో దిగారు.

రాహుల్, ధావన్ రికార్డు భాగస్వామ్యం

బ్యాటింగ్‌కు అనుకూలంగా మారిన పిచ్‌పై ఓపెనింగ్ జోడి శిఖర్ ధావన్, కెఎల్ రాహుల్ శ్రీలంక బౌలర్లను చీల్చి చెండాడారు. దీంతో తొలి వికెట్‌కు 188 పరుగుల భాగస్వామ్యంతో సత్తా చాటారు. లంచ్ సమయానికే 134 పరుగులతో అజేయంగా నిలిచి భారీ స్కోర్‌కు బాటలు వేశారు. రికార్డు ఓపెనింగ్ భాగస్వామ్యంతో ఇద్దరూ కదం తొక్కారు. దీంతో విదేశాల్లో 175 పరుగుల రికార్డును వీరిద్దరు అధిగమించారు. 2015 జూన్ తర్వాత ఓపెనింగ్ జోడి అత్యధిక స్కోర్ చేయడం ఇది రెండోది. అంతకు ముందు బంగ్లాదేశ్ టెస్ట్‌లో ఫాతుల్లాలో మురళీ విజయ్, ధావన్ తొలి వికెట్‌కు 283 పరుగులను నమోదు చేసి అత్యధిక స్కోర్‌ను సాధించారు. 85 పరుగుల వద్ద రాహల్ తొలి వికెట్‌గా జట్టు స్కోర్ 188 వద్ద వెనుదిరిగాడు. 119 పరుగుల వద్ద శిఖర్ రెండో వికెట్‌గా పెవిలియన్ ముఖం పట్టాడు. ఈ రెండు వికెట్లను పుష్పకుమార సాధించడం గమనార్హం.పూజరా 8 పరుగుల వద్ద సందకన్ బౌలింగ్‌లో మ్యాథ్యూస్‌కు క్యాచి ఇచ్చి వెనుదిరిగాడు. రహానే 17 వద్ద నాలుగో వికెట్‌గాను, కెప్టెన్ కోహ్లీ కూడా సమయోచితంగా బ్యాటింగ్ చేపట్టి 84 బంతుల్లో కేవలం 3 ఫోర్లతో 42 పరుగుల వద్ద సందకన్ బౌలింగ్‌లోనే ఐదో వికెట్‌గా ఔటయ్యాడు. దీంతో భారత్ 296 వద్ద సగం వికెట్లను కోల్పోయింది. ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ 31 పరుగుల వద్ద ఫెర్నాండో బౌలింగ్‌లో ఆరో వికెట్‌గా వెనుదిరిగాడు. సాహా 13 పరుగులతోను, పాండ్య 1 పరుగుతో క్రీజులో నిలిచారు.

ప్రపంచ రికార్డును సమం చేసిన రాహుల్:

భారత ఓపెనర్ లోకేష్ రాహుల్ పల్లెకలె టెస్ట్‌లో అరుదైన రికార్డుకు చేరుకున్నాడు. ఏడు టెస్ట్‌ల్లో వరుసగా ఏడు అర్ధ సెంచరీలను చేసి ప్రపంచ రికార్డును సమం చేశాడు.వరుసగా ఏడు అర్ధ శతకాలు (90,51,67,60,51)నాటౌట్, 57, 67(నాటౌట్)

శ్రీలంకతో జరుగుతున్న మూడో టెస్ట్ తొలి రోజు 67 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన రాహుల్ 7 అర్ధ సెంచరీలను చేసిన ఈవర్టన్ వీక్స్, ఆండీ ఫ్లవర్, శివ్ నరైన్ చంద్రపాల్, కుమార సంగక్కర, క్రిస్ రోజర్స్ సరసన చేరాడు. 28 పరుగుల వద్ద రాహుల్ ఇచ్చిన క్యాచ్ లాహిరు కుమార వదిలేయడంతో ఈ రికార్డుకు చేరుకున్నాడు. భారత్ తరపున రాహుల్ ద్రవిడ్, గుండప్ప విశ్వనాథ్‌ను వరుసగా ఆరు అర్ధ సెంచరీల రికార్డును రాహుల్ అధిగమించేయడం గమనార్హం.





టెస్ట్‌ల్లో ఆరో సెంచరీ చేసిన శిఖర్ (119) పరుగులు

ఆరేసిన శిఖర్...

ఓపెనర్ శిఖర్ ధావన్ శ్రీలంక సిరీస్‌లో రెండో సెంచరీ నమోదు చేశాడు. దీంతో కెరీర్‌లో ఆరో సెంచరీ చేశాడు. పరుగుల వేటలో తనదైన శైలిలో శిఖర్ జైత్రయాత్రను కొనసాగించాడు. 45 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేసిన శిఖర్ భారత్ స్కోర్ వేగం పెంచడంలో కీలకభూమిక పోషించాడు. కాగా 107 బంతుల్లో 15 ఫోర్లుతో శతకం పూర్తి చేసిన ధావన్ ఆ తర్వాత రెచ్చిపోయి వరుస ఫోర్లుతో దూకుడు పెంచడం విశేషం. గాలె టెస్ట్‌లో 190 పరుగులతో 304 పరుగుల తేడా తో భారత్ విజయానికి శిఖర్ బాటలు వేశాడు.



ఆరు బంతుల్లో ఆరు వికెట్ల తీసిన రాబిన్‌సన్ (చిత్రంలో అతని తండ్రి లూక్యా)

149 ఏళ్ల రికార్డు క్లీన్ బౌల్డ్

ఒకే ఓవర్‌లో 6 వికెట్ల తీసిన రాబిన్‌సన్

లండన్ : ప్రపంచ క్రికెట్ చరిత్రలో అత్యంత అరుదైన రికార్డు నమోదైంది. ఆరు బంతుల్లో ఆరు వికెట్లను క్లీన్‌బౌల్డ్ చేసి 149 ఏళ్ల ప్రపంచ రికార్డును చెరిపేశాడు. 13 ఏళ్ల ఇంగ్లాండ్ స్కూల్ క్రికెటర్ ల్యూక్ రాబిన్‌సన్. ఇది కుటుంబ సభ్యుల సమక్షంలోనే జరగడం ఆ కుర్రాడి ఆనందానికి అవధుల్లేవు. ఈ కుర్రాడి ఫీట్‌ను తల్లి, దండ్రులతో పాటు తాతా గ్లెన్ స్వయంగా మ్యాచ్‌ను తిలకించి మనవడి ఘనతకు ఉబ్బితబ్బిబయ్యాడు. ఇంతకీ వారంతా స్టేడియానికి ప్రేక్షకుల్లా రాలేదు.సీనియర్ క్రికెటర్ అయిన ల్యూక్ తండ్రి స్టీఫెన్ రాబిన్‌సన్ ఇదే మ్యాచ్‌కి అంపైరింగ్ బాధ్యతలు చేపట్టగా.. తల్లి హెలెన్ స్కోర్ బోర్డు వద్ద విధులను నిర్వహించారు.తాత ఒక్కడే ప్రేక్షకుడిగా మ్యాచ్‌ను ఆస్వాదించాడట.13 ఏళ్ల ల్యూక్ రాబిన్‌సన్ ఫిలడెల్ఫియా క్రికెట్ క్లబ్ అండర్-13 జట్టులో సభ్యుడు.క్లబ్ తరపున ఓ మ్యాచ్‌లో పాల్గొన్న ల్యూక్ ఒకే ఓవర్‌లో ఆరు వరుస బంతుల్లో ఆరు వికెట్లను పడ్డగొట్టి రికార్డు సృష్టించాడు..ఈ సందర్భంగా స్టీఫెన్ మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి క్రికెట్ ఆడుతున్నాను. ఒకే ఓవర్లో ఆరుగురు బ్యాట్స్‌మెన్లను బౌల్డ్ రూపంలో పెవిలియన్‌కు పంపండం ఎక్కడా చూడలేదు. నా కుమారుడు ఆ ఘనత సాధించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నాడు.

400 మీ రిలేలో భారత్ జట్లు విఫలం



లండన్ : ప్రపంచ అథ్లెటిక్స్‌లో తొమ్మిదో రోజు భారత్ అథ్లెట్లు నిరాశే మిగిల్చారు. మహిళల 4క్ష్మ400 మీటర్ల రిలే పరుగులో ఆసియా ఛాంపియన్‌గా నిలిచిన జిస్నా మ్యాథ్యూ,అనిలిండా థామస్, నిర్మలా షిరోన్,ఎంఆర్ పూవమ్మల బృందం క్వాలిఫికేషన్ రౌండ్స్‌లో 3:28.62 సెకన్లలో పూర్తి చేశారు.దీంతో ఏడో స్థానంతోనే సరిపెట్టుకున్నారు. ఆసియా ఛాంఫ్‌లో 3:31.34 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకున్న ఈ బృందం స్వర్ణంతో మెరవగా, ఈ సారి కనీసం ఆ టైమ్‌ను నమోదు చేయలేక చతికిలపడ్డారు. ప్రతీ రౌండ్స్‌లో టాప్-3లో నిలిచిన రిలే టీమ్‌లు ఫైనల్స్ రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. మా ప్రదర్శన ఇటీవల కాలంలో కంటే ఇది మెరుగైందనేనని పూవమ్మ తెలిపింది. పురుషుల విభాగంలో పురుషుల రిలే బృందం 3:02.80 సెకన్లలో లక్ష్యానికి చేరుకుంది. దీంతో ఐదో స్థానంలో నిలిచింది.రిలే బృందంలో కున్హు మొహ్మమద్, ఆమోజ్ జాకబ్, మొహ్మద్ అనస్, రాజీవ్ ఆరోఖ్యలు ఇటీవల జరిగిన ఆసియా ఛాంపియన్‌లో 3:02.92 సెకన్లలో పరుగు పూర్తి చేసి స్వర్ణం సాధించిన విషయం తెల్సిందే.

మాంట్రియల్ సెమీస్‌కు ఫెదరర్



ఫ్రాన్స్: స్విస్ స్టార్ టెన్నిస్ ఆటగాడు రోజర్ ఫెదరర్ మాంట్రియల్ మాస్టర్స్ సెమీస్‌కు చేరాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో ఫెదరర్ రోబర్టో బటిస్టా అగట్‌పై 6-4, 6-4తో జయభేరి మోగించాడు. కీలకమైన మ్యాచ్‌లో కష్టపడి గెలిచానని తెలిపాడు. ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధనతో టాప్-5 నుంచి మూడో ర్యాంకుకు ఎగబాకిన ఫెదరర్ రానున్న యుఎస్ ఓపెన్ మరింత కసరత్తు చేయడానికి ఈ టోర్నీ ఎంతగానో ఉపకరించనుంది.

యూత్ ఆసియా కప్ మలేషియాలోనే

న్యూఢిల్లీ: అండర్-19 ఆసియా కప్ క్రికెట్ టోర్నీ వేదిక భారత్ నుంచి మలేషియాకు మారింది. ఈ టోర్నీ ఈ ఏడాది నవంబర్‌లో బెంగళూరులో నిర్వహించాలని ముందుగా నిర్ణయించారు. దీన్ని పూర్తిగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు వ్యతిరేకించింది. దీంతో ఇండియా నుంచి మలేషియాకు వేదికను మారుస్తూ ఆసియా క్రికెట్ కౌన్సిల్ శనివారం నిర్ణయం తీసుకుంది. 2016లో శ్రీలంకలో జరిగిన ఆసియా కప్‌ను భారత్ కైవసం చేసుకున్న విషయం తెల్సిందే. ఎనిమిది జట్లు తలపడే ఈ టోర్నీలో ఆతిథ్య జట్టుగా మలేషియా నేరుగా టోర్నీకి అర్హత సాధించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండియా, శ్రీలంక నేరుగానే పాల్గొంటాయి. మిగిలిన వెస్ట్రన్ రీజియన్ జట్లు ఖతార్, సౌదీ అరేబియా, ఒమన్, బహ్రెయిన్‌లు కువైట్‌లో అర్హతా టోర్నీలో తలపడతాయి.

ఆసియా షూటింగ్‌లో మరో కాంస్యం

కజకిస్తాన్ : ఏడో ఆసియాన్ షాట్ గన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ షూటింగ్ టీమ్‌కు మరో కాంస్యం లభించింది. వ్యక్తిగత మెడల్ ఈవెంట్‌లో షేక్ షీరజ్ తృటిలో కాంస్యం చేజార్చుకున్నాడు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ పురుషుల స్కీట్‌లో షీరజ్, మీరాజ్ అహ్మద్ ఖాన్, వీర్ సింగ్ బజ్వాలు 375 పాయింట్లకు 350 పాయింట్లను సాధించి కాంస్యను సాధించారు. దీంతో భారత్ ఖాతాలో ఏడో కాంస్యం జమ అయ్యింది.

యోధా చేతిలో టైటాన్స్ ఓటమి

రాహుల్ ఒంటరి పోరాటం వృధా

అహ్మదాబాద్: తెలుగు జట్టు రెండో సీజన్‌లోను నిరాశజనకమైన ప్రదర్శనతో పరాజయం పాలైంది. కొత్త జట్టుగా బరిలో దిగిన ఉత్తరప్రదేశ్ అద్భుతమైన ఆటతీరుతో టైటాన్స్‌ను 39-32తో మట్టి కరిపించింది. రైడింగ్, టాకిల్,ఆలౌట్ పాయింట్లలో పై చేయిగా నిలిచిన తోమర్ సైన్యం విజయ ఢంకా మోగించింది.ఉత్తరప్రదేశ్ జట్టు నాలుగో మ్యాచ్‌లు ఆడగా మూడు విజయాలు, ఓ మ్యాచ్ ఓటమితో 15 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. తెలుగు టైటాన్స్ ఎనిమిదో మ్యాచ్‌లో ఓటమితో ఆరు ఓటములు, ఓ విజయం, ఓ డ్రాతో 12 పాయింట్లతో నాలుగో స్థానంకు దిగజా రింది. టైటాన్ కెప్టెన్ రాహుల్ చౌదరీ 23 సార్లు ప్రత్యర్థి జట్టుపై దాడి చేసి 12 పాయింట్లతో ఒంటరి పోరాటమే చేశాడు. మోధా కెప్టెన్ నితిన్ తోమర్ 17 సార్లు దాడులకు వెళ్లి 10 పాయింట్లను సాధించాడు.తొలి అర్ధభాగం లో నువ్వానేనా అన్నరీతిలో ఒక్క పాయింట్ తేడాతో ఇరుజట్లు సమయో చితంగా ఆడాయి. రెండో అర్ధ భాగంలో అనుహ్యం గా యోధా ఆటగాళ్లు దూకుడు పెంచి 3 నుంచి 7 పాయింట్ల ఆధిక్యం లోను జట్టును సురక్షితంగా ముందుకు నడిపారు.

గుజరాత్ సంచలన విజయం...

గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ దంబంగ్ ఢిల్లీ జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగింది.ఢిల్లీపై అనుహ్యంగా గుజరాత్ 29-25 పాయింట్లతో జయకేతనం ఎగుర వేసింది. జోన్ ఎలో అగ్రస్థానంలో కొనసాగుతున్న గుజరాత్ అదే జోరును ప్రదర్శించి వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. తొలి అర్ధభాగం ముగిసే సరికి 10-10 పాయింట్లతో సమ ఉజ్జీలుగా నిలిచాయి. వ్యూహాత్మక దాడులు, ప్రత్యర్థుల కవ్వింపుల్లో ఇరుజట్ల నరాలు తెగే ఉత్కంఠత దిశగా మ్యాచ్‌ను మలుపు తిప్పాయి. మ్యాచ్ ముగిసే ఐదు నిమిషాల ముందు 24-24తో సమానంగా నిలవటం విశేషం. ఈ దశలో పుంజుకున్న గుజరాత్ మరో 3 పాయింట్లతో ప్రత్యర్థిపై ఎదురుదాడిలో సక్సెస్ సాధించింది. గుజరాత్ జట్టులో సచిన్ 8 , సుకేష్ హెగ్డె 7 సునీల్ 3 పాయింట్లను సాధించగా, ఢిల్లీ జట్టులో స్టార్ ఆటగాడు మీరజ్ 8 పాయింట్లతో సత్తా చాటాడు.



నేటి మ్యాచ్‌లు

రాత్రి 8 గంటలకు పాట్నా పైరేట్స్ X యూపి యోధా
రాత్రి 9 గంటలకు గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ X జైపూర్ పింక్ పాంథర్స్



వార్సెస్టర్‌షైర్ కౌంటీ జట్టులో అశ్విన్,జడేజా ?

న్యూఢిల్లీ: భారత స్పిన్నర్ల ద్వయం రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా వార్సెస్టర్‌షైర్ కౌంటీ జట్టులో ఆడేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. రానున్న శ్రీలంక సిరీస్‌కు వీరిద్దరికి సెలక్టర్లు విరామం ప్రకటించనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వన్డే సిరీస్‌కు ఈ నెల 13న బిసిసిఐ సెలక్టర్లు ప్యానల్ భారత్ జట్టు ఎంపికను చేపట్టనున్న విషయం తెల్సిందే. ఫస్ట్‌క్లాస్ సీజన్‌లో బ్యాటింగ్‌ల్లో ఇద్దరు సత్తా చాటుతుండటంతో బ్యాట్స్‌మెన్‌గా కౌంటీల్లో ఆడేందుకు సంతకాలు చేయనున్నారు. శ్రీలంకలో వన్డే సిరీస్ ఇక సెప్టెంబర్ ఆరో తేదీ వరకు కొనసాగనుండటం, ఆ తర్వాత ఆసీస్, కివీస్,శ్రీలంక 23 వన్డేలు ఆడేందుకు భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో డిసెంబర్ వరకు వీరిద్దరికి విశ్రాంతి తప్పనిసరి. నాటింగ్‌హామ్‌షైర్ తరపున కౌంటీల్లో ఇప్పటికే పూజరా ఆడిన తరుణంలో మళ్లీ అదే జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది.

ప్రపంచ ఎలెవన్‌తో శ్రీలంక ఛారిటీ మ్యాచ్

సెప్టెంబర్ 8న టి 20

కొలంబో: ప్రపంచ ఎలెవన్‌తో ఓ ఛారిటి టి 20 మ్యాచ్‌కు శ్రీలంకలోని ప్రేమదాస స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. సెప్టెంబర్ 8న శ్రీలంక, ప్రపంచ ఎలెవన్ జట్టుతో తలపడనుంది. అయితే బ్యాట్స్‌మెన్ ఎవరనేది ఇంకా ఖరారు కావాల్సి ఉంది. భారత్, శ్రీలంకల్లో రిటైరైన వివిధ క్రికెటర్లతో ప్రస్తుత క్రికెటర్ల ఆడనున్నారు. వరదల కారణంగా కిడ్నీ వ్యాధులకు గురైన బాధితులకు ఆర్థిక సహాయార్థం ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. శ్రీలంకతో వన్డే సిరీస్ అనంతరం ఈ మ్యాచ్ నిర్వహించే వీలుంది.

పత్తి రైతుల్లో 'గులాబీ' గుబులు

- మూడు జిల్లాల్లో తెగులు గుర్తింపు
- కాటన్ పరిశోధనా సంస్థ సైతం నిర్ధారణ
- పురుగు సోకితే పంట ధ్వంసమే
- ముందటేడు భారీ నష్టం
- బిటి పరిజ్ఞానం నిరోధించలేదు
- నాసిరకం విత్తనాలే కారణం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

మిర్చికి ధర లేకపోవడంతో మెట్ట రైతులు ప్రస్తుత ఖరీఫ్‌లో పత్తి సాగు వైపు పరుగులు పెడుతుండగా, పత్తిని అమాంతం ధ్వంసం చేసే అతి భయంకరమైన గులాబీ రంగు కాయతొలుచు పురుగు కాచుక్కూర్చుంది. ఏపీలో పత్తి పంటను అధికంగా సాగు చేసే కర్నూలు, గుంటూరు, ప్రకాశం ఈ మూడు జిల్లాల్లో గులాబీ తెగులును ప్రాథమికంగా గుర్తించారు. కేంద్ర పత్తి పరిశోధనా సంస్థకు తెలియపరిచారు. ఏపీ నుంచి పంపిన వివరాల ఆధారంగా కేంద్ర సంస్థ గులాబీ తెగులును నిర్ధారించినట్లు సమాచారం. అటు తెలంగాణాలోనూ కొన్ని ప్రాంతాల్లో పత్తికి గులాబీ తెగులును గుర్తించారు. దీంతో ఏపీ వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల్లో గుబులు మొదలైంది. ప్రాథమిక దశలో తెగులును నివారించేందుకు హడావిడి పడుతున్నారు. కాగా గులాబీ తెగులు రావడానికి పత్తి విత్తనాలు విక్రయించే ప్రైవేటు సంస్థలే కారణమని ఆరోపణలొస్తున్నాయి. విత్తనాల ప్యాకింగ్ సమయంలో సరిగ్గా ట్రీట్‌మెంట్ (విత్తన శుద్ధి) చేయకపోవడం వలన గులాబీ పురుగు పైరుకు ఆశిస్తుందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా అడ్డూ అదుపూ లేకుండా కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయించిన ప్రైవేటు కంపెనీలు మాత్రం రైతుల మీదే నెపం వేస్తున్నాయి. పొలాల్లో విత్తే ముందు రైతులు ఆమ్లంతో విత్తనశుద్ధి చేయనందున గులాబీ పురుగు వ్యాపిస్తుందని తప్పించుకుంటున్నాయి. బిటి విత్తనాలు ఈ తెగులును నివారించలేవని చేతులెత్తేస్తున్నారు.

సర్కారు చోద్యం

ముందటేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో గులాబీ తెగులు పత్తి రైతులను నిలువునా ముంచింది. దీంతో తెలంగాణాలో అసలు పత్తిని సాగు చేయొద్దని నిరుడు ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎపి సర్కారు మధ్యేమార్గంగా గులాబీ తెగులుపై రైతుల్లో అవగాహన కల్పిస్తామని పోస్టర్లు, బ్రోచర్లు విడుదల చేసింది. సాగును గణనీయంగా తగ్గించాలని అంత ర్గతంగా లక్ష్యాలు నిర్దేశించింది. అయితే విత్తనాలు విక్రయించే ప్రైవేటు సంస్థలపై ఎలాంటి నియంత్రణా విధించలేదు. ముందటేడు పత్తి వల్ల నష్టాలు రావడంతో నిరుడు ఖరీఫ్‌లో ఆ పంట సాగు కొంత వరకు తగ్గింది.

2014లో 8.15 లక్షల హెక్టార్లలో పత్తి సాగు కాగా 2015లో 6.62 లక్షల హెక్టార్లలో సాగైంది. 'గులాబీ' భయంతో 2016లో 4.47 లక్షల హెక్టార్లలోనే సాగైంది. వాస్తవానికి వ్యవసాయశాఖ ఐదు లక్షల హెక్టార్లకు తగ్గించాలనుకోగా తెగులు వలన అంతకంటే సాగు తగ్గింది. అయితే నిరుడు తీసుకున్నట్లు ఈ సంవత్సరం వ్యవసాయశాఖ ముందస్తు చర్యలు తీసుకోలేదు. గులాబీ తెగులుపై ప్రత్యేకంగా రైతుల్లో ప్రచారం చేయలేదు. పత్తి సాగును తగ్గించేందుకు ప్రయత్నించలేదు.

మిర్చికి ధర లేదని...

మిర్చికి ధర రాకపోవడంతో ఈ ఖరీఫ్‌లో రైతులు పత్తి వైపు మళ్లారు. సర్కారు 6.41 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతుందని అంచానా వేసింది. ఇప్పటికి 4.27 లక్షల హెక్టార్లు సాగు కావాల్సి ఉండగా 4.43 లక్షల హెక్టార్లలో సాగైంది. నిరుడు ఇదే సమయానికి 3.39 లక్షల హెక్టార్లలోనే సాగైంది. పత్తిని అత్యధికంగా కర్నూలు, గుంటూరు, ప్రకాశం, కృష్ణాలో సాగు చేస్తున్నారు. ఆ తర్వాత అనంతపురం, కడప, విశాఖ, ఉభయగోదావరిలో సాగవుతోంది. ఈ ఖరీఫ్‌లో కర్నూలులో ఇప్పటికే 1.74 లక్షల హెక్టార్లలో (84 శాతం). గుంటూరులో 1.45 లక్షల హెక్టార్లు (78 శాతం), కృష్ణాలో 44 వేల హెక్టార్లు (82 శాతం) సాగైంది. ప్రకాశం, అనంతపురంలో కాస్త తక్కువ పడింది. కాగా పత్తిని సర్వనాశనం చేసే గులాబీ తెగులును కర్నూలు జిల్లా పత్తికొండ ప్రాంతంలో గుర్తించారు. గుంటూరు, ప్రకాశంలోనూ పురుగు కనిపించిందంటున్నారు. తెలంగాణాలో కూడా తెగులును గుర్తించినట్లు వార్తలు రావడంతో సరిహద్దులో ఉన్న కృష్ణా జిల్లా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారి తెగులు వ్యాపిస్తే పంట చేతికి రాదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68